




# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక








ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 130 ఆదివారం 28 డిసెంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్




## తండ్రి అనారోగ్యంతో అప్పలపాలు

**తల్లిదండ్రులను చంపి కుమారుల ఆత్మహత్య**

**మహారాష్ట్ర నాందేడ్‌లో విషాద ఘటన**

ఇద్దరు కొడుకులు కలసి నిద్రిస్తున్న తల్లిదండ్రులను హత్య చేశారు. ఆ తర్వాత రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తండ్రి అనారోగ్యం వల్ల అప్పలపాలు కావడంతో వారిద్దరూ ఇలా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

3



## వెచ్చదనం కోసం ఇంట్లో నిప్పల కుంపటి

**అర్థరాత్రి వేళ విషవాయువులకు ముగ్గురు మృతి**

చలికాలం నేపథ్యంలో గదిలో వెచ్చదనం కోసం మంట రాజేసి ఒక కుటుంబం నిద్రించింది. విష వాయువులు వెలువడంతో ఒక వృద్ధురాలు, ముగ్గురు పిల్లలు మరణించారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. బీహార్‌లోని చాప్రా జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

3




## నకిలీ ఏజెంట్ల మాటలు నమ్మకండి

**వీసా దరఖాస్తుదారులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక**

మిడియేటర్ల మాటలు నమ్మి మోసపోవద్దని, వీసా దరఖాస్తుదారులకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో హెచ్-1బీ వీసా ప్రాసెసింగ్, రెన్యువల్స్ ఆలస్యమవుతుండటంపై యూఎస్ ఎంబసీ స్పందించింది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని కొందరు నకిలీ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొంది.

3

# రాష్ట్రాభివృద్ధికి వైసీపీ ఆటంకం

## జంతుబలులతో ఉన్మాదం

## బర్త్‌డే రోజు ఇదేనా చేసేది

**ఏ ఒక్కరినీ జగన్ ఎందుకు మందలించలేదు**

**రాజకీయం ముసుగులో ఉన్మాదం సహించేది లేదు**

**హోం మంత్రి అనిత ఘాటు హెచ్చరిక**



అమరావతి : రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగించేందుకు వైకాపా నేతలు ఎంతకైనా దిగజారుతున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. జంతు బలులు చేసి.. ఉన్మాదుల్లా తయారవుతున్నారని మండిపడ్డారు. బహిరంగ ప్రదేశాల్లో జంతుబలి చేయడం నేరమని, వచ్చే ఎన్నికల్లో మేం గెలిస్తే మీ పరిస్థితి ఇదేనంటూ నినాదాలు ఇవ్వడం దారుణమని అన్నారు. మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా వైసీపీ నేతలు, కార్యకర్తల వికృత చేష్టలపై

మిగతా 2 లో

## ఆర్ఎస్ఎస్‌పై పోరాటం కొనసాగుతుంది

**దానిని కూకటి వేళ్లతో పెకిలించాల్సిందే**

**నటుడు ప్రకాశ్ రాజ్ పిలుపు**




**విశాఖపట్నం :** బీజేపీని పెంచి పోషిస్తున్న ఆర్ఎస్‌ఎస్‌తో మనం పోరాటం చేయాలని ప్రముఖ సినీనటుడు ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యానించారు. మనం లేకపోయినా ఏదో ఒక రోజు కూకటి వేళ్లతో సైతం ఆర్ఎస్ఎస్‌ను పెకలించాలని హెచ్చరించారు. తాను

మిగతా 2 లో



## జిల్లాల పునర్విభజనపై

# ప్రజాభిప్రాయానికి పెద్దపీట

## అభ్యంతరాల స్వీకరణ గడువు ముగింపు

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మంత్రులు, ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాల పునర్విభజనపై ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

- నెల్లూరు జిల్లాకే గూడూరును కేటాయించాలని నిర్ణయం
- నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్
- మార్కాపురం జిల్లాకు దొనకొండ, కురిచేడు మండలాలు
- సీఎం చంద్రబాబు కీలక సూచనలు



అమరావతి : జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో ప్రజాభిప్రాయానికే పెద్దపీట వేశారు. జిల్లాల పునర్విభజనలో కొద్దిపాటి మార్పు చేర్పులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో

మిగతా 2 లో

## పేద పిల్లలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

**అనాథలు, పేదలకు విద్యాదానం చేస్తున్న సంస్థ**

**గండిపేట ఒకప్పుడు రాజకీయ నేతల శిక్షణ కేంద్రం**

**ఎన్టీఆర్ట్ ట్రస్ట్ ఎడ్యేకుషన్ వార్షికోత్సవంలో చంద్రబాబు**

# విజయవాడ, తిరుపతిల గ్రేటర్ హోదాకి బ్రేక్

**సాంకేతిక కారణలాతో కొంతకాలం వాయిదా**

**పురపాలకశాఖ మంత్రి నారాయణ వెల్లడి**




**అమరావతి :** తిరుపతి, విజయవాడలకు గ్రేటర్ హోదా కల్పించడానికి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. జనగణన ఉన్నందున విలీనానికి సంబంధించిన కొన్ని ఇబ్బందులు ఉండటంతో ఈ విషయంపై చర్చించలేదని తెలిపారు. జనగణన జరగబోతోంది కాబట్టి ప్రస్తుతం డీలిమిటేషన్ చేయకూడదనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. అందుకే ప్రస్తుతం గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రక్రియను కొంతకాలం వాయిదా వేయాలని నిర్ణయించామని మంత్రి నారాయణ

మిగతా 2 లో



## లంక, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారం

**వాటిని ఒక్కోటిగా పరిష్కరిస్తూ వస్తున్నాం**

**కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**

**అమరావతి :** ఇప్పటి వరకు లంక భూములు, అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పుకొచ్చారు. పెండింగ్ ఉన్న 2శాతం రైతులకు కొన్ని

మిగతా 2 లో

# పేదల కడుపుపై తన్నిన మోదీ ప్రభుత్వం

**దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి తీవ్ర ముప్ప**

**ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు నష్టం**

**కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే**



దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు ఉపాధి కరువవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# జిల్లాల పునర్విభజనపై ప్రజాభిప్రాయానికి పెద్దపీట

మొదటి పేజీ తరువాయి

పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈరోజు సమావేశంలో 927 అభ్యంతరాలు, సూచనలపై సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లాకే గూడూరును కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్, మార్కాపురం జిల్లాకు దొనకొండ, కురిచేడు మండలాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ నెల 31న తుది నోటిఫికేషన్‌ను ఏపీ సర్కార్ జారీ చేయనుంది. అయితే, జిల్లాల పునర్విభజనపై ప్రాథమిక నోటిఫికేషన్‌ను నవంబరు 27వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నెల రోజుల పాటు అభ్యంతారాలను స్వీకరించింది. అయితే శనివారంతో గడువు ముగుస్తోంది. ప్రాథమిక నోటిఫికేషన్

అనంతరం వ్యక్తమైన అభ్యంతరాలపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా రాజంపేటను కడపలో కలిపి, రాయచోటిని మదనపల్లిలో కలిపే ప్రతిపాదనలపై ప్రభుత్వం కీలక సమాలోచనలు చేసింది. ఇప్పటికే ప్రకటించిన మూడు జిల్లాలతో 29 వరకు జిల్లాల సంఖ్య పెరగాల్సి ఉంది. తాజా ప్రతిపాదనలతో 28 జిల్లాలకే పరిమితం చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



ఇప్పటికే ప్రత్యేక జిల్లాగా ప్రకటించిన రాయచోటిని మదనపల్లిలో కలిపే దిశగా సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే ప్రకటించిన 3జిల్లాలపై అభ్యంతరాలు, ప్రతిపాదనలపై సమీక్షించారు సీఎం. దొనకొండ, కురిచేడును మార్కాపురం జిల్లాలో.. పొదిలిని ఒంగోలు జిల్లాలో కలిపితే ఎలా ఉంటుందని చర్చించారు. స్థానిక ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు రైల్వే కోడూరును తిరుపతిలో కలిపే అంశంపై కసరత్తు చేశారు. (ఆదివారం) మరోసారి సమావేశమై ఎల్లుండి మంత్రివర్గం ముందుకు ప్రతిపాదనలు తీసుకురానుంది మంత్రివర్గ ఉపసంఘం. కేబినెట్ ఆమోదం తర్వాత ఈనెల 31వ తేదీన తుది నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఈ సమీక్షకు మంత్రులు అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనిత, నారాయణ హాజరయ్యారు.

## మృతి చెందిన రామారావు కుటుంబానికి బాసట

### ఫోన్ చేసి పరామర్శించిన సీఎం చంద్రబాబు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం రాజధాని రైతు దొండపాటి రామారావు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఎన్-8 రహదారి విషయమై తుళ్లూరులో శుక్రవారం మందడం రైతులతో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సమయంలోనే గుండెపోటుతో కుప్పకూలారు రామారావు. ఆస్పత్రికి తరలించేలోపే ఆయన మృతి చెందారు. ఈ క్రమంలోనే సీఎం ఆయన కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని రామారావు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆ కుటుంబానికి అండగా ఉండాలని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కు సీఎం చంద్రబాబు సూచించారు.

## నేడు అయోధ్యకు సీఎం చంద్రబాబు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివార) షెడ్యూల్ బిజీ బిజీగా ఉ ఒడనుంది. హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు ముఖ్యమంత్రి వెళ్లనున్నారు. అయోధ్య రామ జన్మభూమిలోని శ్రీ రాముడు దర్శనం చేసుకోనున్నారు. మూడు గంటల పాటు అయోధ్యలో శ్రీ రాముని సన్నిధానంలో ఉండనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకోనున్నారు. ఈ మేరకు సీఎం కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు.. ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబం విదేశీ పర్యటనకు వెళ్లనుంది. ఈ నెల 30వ తేదీ ఉదయం విదేశాలకు సీఎం కుటుంబం బయలుదేరనుంది. తిరిగి జనవరి నాలుగో తేదీన రానున్నారు. వ్యక్తిగత పర్యటన కోసం సీఎం చంద్రబాబు విదేశాలకు వెళ్తున్నట్లు సమాచారం.

## పేద పిల్లలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

### అనాథలు, పేదలకు విద్యాదానం చేస్తున్న సంస్థ

### గండిపేట ఒకప్పుడు రాజకీయ నేతల శిక్షణ కేంద్రం

### ఎన్టీఆర్ట్ ట్రస్ట్ ఎడ్యేకుషన్ వార్షికోత్సవంలో చంద్రబాబు



**హైదరాబాద్ :** పేద పిల్లలకు అండగా ఉండాలనే ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ వార్షికోత్సవంలో సీఎం మాట్లాడారు. గండిపేటకు వస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. ఒకప్పుడు పార్టీ ప్రధాన కార్యాలయం ఇక్కడ ఉండేది. ఒకప్పుడు రాజకీయ నేతలకు శిక్షణ ఇచ్చే కేంద్రం ఇది. ఇప్పుడు అదే స్థలంలో పిల్లలకు చదువు నేర్పుతున్నారు. రకరకాల కారణాల వల్ల చాలామంది పిల్లలు అనాథలుగా మారేవారు. ఆ పిల్లలకు పెద్ద దిక్కుగా ఉండాలనే ఈ విద్యాసంస్థలకు శ్రీకారం చుట్టాం. ఆ నాడు నాటిన చిన్న మొక్క.. ఇవాళ పెద్ద వృక్షంగా తయారైంది. ఈ విద్యాసంస్థను సమర్థంగా నిర్వహిస్తున్న ఘనత భువనేశ్వరిదే. గ్రూప్-1 పోస్టులకు ఇక్కడి నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఐఐటీలు, ఎన్ఐటీల్లో 29 మంది సీట్లు సంపాదించారు. ఇప్పుడు పలు చోట్ల 1,641 మంది పిల్లలు చదువుతున్నారు. చిన్న పాఠశాల నుంచి ఇంటర్, డిగ్రీ కాలేజీ వరకుఈ సంస్థ ఎదిగింది. నా చొరవ వల్లే ఉన్నతవిద్యకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ మారింది. ఎవరైనా వ్యవసాయం, వ్యాపారం ద్వారా సంపాదించాలనే హెరిటేజ్ పెట్టాం. మొదట్లో హెరిటేజ్ బాధ్యతలు తీసుకునేందుకు భువనేశ్వరి ఒప్పుకోలేదు. తర్వాత హెరిటేజ్‌ను సమర్థంగా నిర్వహించే స్థాయికి ఆమె చేరారు. ఆరోజు హైటెక్‌సిటీ కట్టి ఐటీని ప్రోత్సహించాను. ఈరోజు మళ్లీ డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్ వ్యాలీ, క్వాంటమ్ కంప్యూటర్స్, గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్, డ్రోన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీకి చిరునామాగా ఏపీని తయారు చేయాలని నెక్స్ జెనరేషన్‌కు వెళ్లాం. టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాం' చంద్రబాబు అన్నారు.

# లంక, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారం

మొదటి పేజీ తరువాయి

సమస్యలు ఉన్నాయని.. వాటిని ఒక్కోటిగా పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను జనవరి 1 నుంచి ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. రాజధాని ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీఆర్డీఏ కార్యాలయంలో త్రీ మెన్ కమిటీ నివారం సమీక్ష నిర్వహించింది. అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. జరీబు భూ సమస్యలపై సర్వే పూర్తయిందన్నారు. జరీబు భూములపై న్యాయంగా ఎవరికి ఇవ్వాలి అనేదానిపై కమిటీ రిపోర్ట్ తర్వాత నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. పది సెంట్లు కంటే తక్కువ ప్లాట్లు ఉన్నవాళ్లు 415 మంది ఉన్నారని... వారి సమస్యలు కూడా పరిష్కరిస్తున్నామన్నారు. 2013 కంటే ముందు భూములు ఇచ్చిన రైతులు కూడా తమను ల్యాండ్ పూలింగ్ కింద పరిగణించమని అడుగుతున్నారని... కానీ అవి చట్టపరంగా సాధ్యం కావడం లేదని కేంద్రమంత్రి అన్నారు. వీధి పోటు భూములకు సంబంధించి సుమారు 150 ఉన్నాయని.. వీధి పోటుకు సంబంధించి మరో రెండు అంశాలు రైతుల కోరుతున్నారని. ఆ అంశాలను తర్వాత పరిగణిస్తామని స్పష్టం చేశారు. త్రీ మెన్ కమిటీ నిర్ణయం ప్రకారం తిరిగి లంక భూముల విషయంలో 356కు గాను 79 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. మిగిలిన వారిని కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోమని



కోరారు. గన్నవరం ఎయిర్పోర్ట్ సమస్యలపై కూడా ఈ రివ్యూలో చర్చించినట్లు తెలిపారు. లార్జ్ రిటర్నబుల్ ఎ÷-లాట్స్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని.. పరిష్కారం దిశగా వర్క్ చేస్తున్నామన్నారు. హెల్త్ కార్డ్స్, పెన్షన్లు తదితర అంశాలపై కూడా చర్చించినట్లు చెప్పారు. స్థానికంగా 1596 మందిని క్యాపిటల్ వర్క్స్‌లో అధికారులు జాయిన్ చేసుకున్నారని.. ఇవి కాకుండా మరో 10 వేల మందిని రాజధానిలో ఉండే స్థానికులను కలిపే విధంగా ప్రయత్నిస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు. రోడ్ల నిర్మాణలు, భారీ వాహనాల రాకపోకల వల్ల కొన్ని చోట్ల స్మశాన ప్రాంతాలు ఇబ్బందికరంగా మారుతున్నాయన్నారు. మల్కాపురం, వెంకటాపురం గ్రామాల్లో స్మశానాలు లేవని... అలాగే మరికొన్ని ప్రాంతాల్లో బరెల గ్రౌండ్ ఏర్పాటు చేయాలని చెప్పామన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నాలుగు వేలకు పైగా పెన్షన్లను రిజెక్ట్ చేశారని.. ఎవరెవరికి పెన్షన్లు మిస్ అయ్యాయో వాటి వివరాలు సేకరిస్తున్నామన్నారు. అలాగే కొత్తగా పెళ్లయిన వారికి కూడా పెన్షన్లు అందజేయాలని చూస్తున్నామని చెప్పారు. అమరావతిలో భూమి ఇచ్చిన వారికి బిలో పావర్టీ లైన్ తో సంబంధం లేకుండా అందరికీ హెల్త్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిన్న జరిగిన ఒక గ్రామ సభలో మాట్లాడుతూ ఉండగా రైతు రామారావు

అకస్మాత్తుగా మరణించడం జరిగిందన్నారు. ఆ రైతుకు ఐదు ఎకరాల భూమి ఉందని... సభలో కూడా రామారావు మాట్లాడుతూ తమకు అందించే భూమి ఎక్కడ వస్తుందో స్పష్టంగా చెప్పాలని అడిగారన్నారు. చాలా వివరంగా, ఆయన మామూలుగా మాట్లాడుతూ ఉండగా అనుకోకుండా జరిగిన ఘటనను కొన్ని పత్రికలు, వైసీపీ నాయకులు శవాల మీద రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏమీ లేని చోట ఇలాంటి దుష్ప్రచారాన్ని చేయడం మానుకోవాలని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రాభివృద్ధికి వైసీపీ ఆటంకం

మొదటి పేజీ తరువాయి



హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడైనా పుట్టినరోజు కేకులను వేటకొడవళ్లు, తల్వార్లతో కట్ చేస్తారా అని ప్రశ్నించారు. నడిరోడ్లపై అకారణంగా మూగజీవాల ఉసురు తీసి బలులు, రక్తాభిషేకాలు చేశారని మండిపడ్డారు. వైసీపీ సైకో మూక వికృత చేష్టలు చూస్తుంటే మానవత్వం ఉందా లేదా అనిపిస్తోందన్నారు. అధికారం కోల్పోయిన తరువాత కూడా రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైకాపా శ్రేణులు ఏం చేసినా.. ఆ పార్టీ నాయకుడు నోరు తెరిచి తప్పని చెప్పడం లేదన్నారు. రాజకీయాలను అడ్డం పెట్టుకొని రౌడీయిజం చేస్తున్నారు. జగన్ ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేయడం ఉన్మాదం కాదా? రాష్ట్రాభివృద్ధికి ఆటంకాలు కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారు. చిన్న పిల్లల్ని కూడా సైకోలు, ఉన్మాదుల్లా తయారు చేస్తున్నారని మండిపడ్డారు. టీనేజ్ పిల్లల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారు. రాజకీయ నేతల ఉద్దేశాలు కూడా పిల్లల తల్లిదండ్రులు ఆలోచించాలని అనిత సూచించారు. ఆస్తి గురించి సొంత తల్లి, చెల్లెలిపై కేసులు పెట్టిన వారు మీ పిల్లల్ని రక్షిస్తారా? పిల్లలు రోడ్డుపైకి వచ్చి.. నరుకుతాం.. చంపుతాం అంటున్నారు. తమ పార్టీ నేతలు చేసింది తప్పని జగన్ చెప్పలేరా అని నిలదీసారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు అనేక దారుణాలు జరిగాయి. అధికారం కోల్పోయినా మరో రకం దారుణాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వాటిని ఖండించలేదంటే జగన్ అసలు మనిషేనా అని అనిత మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి వైసీపీ మూఠా ఎంతకైనా దిగజారుతోందని వ్యాఖ్యలు చేశారు. మూగ జీవాలను బలి తీసుకుని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వైసీపీ పార్టీ ఉన్మాదాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, కుప్పం, గోపాలపురం... ఇలా పలుచోట్ల మేక తలలు నరికి బహిరంగంగా నెత్తురు చల్లిన సంఘటనలు ఉన్నాయన్నారు. మీరు చేస్తున్నది తప్పు అని చెప్పిన గర్భిణీ స్త్రీ మీద వైసీపీ మూక ఉన్మాదుల మాదిరి దాడులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గర్భిణి మీద వైసీపీ సైకో దాడి జరిగితే ఈ రోజు వరకు జగన్మోహన్ రెడ్డి తప్పు అని ఖండించలేదన్నారు. గర్భిణీపై దాడి చేసిన కేసులో నీచుడిని అరెస్ట్ చేస్తే జనసేన కార్యకర్త అని మరో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అతను జనసేన కార్యకర్త అయితే జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలలో ఎందుకు పాల్గొంటారని ప్రశ్నించారు.జగన్మోహన్ రెడ్డి రాజకీయ పబ్బం కోసం 20 ఏళ్ళ లోపు యువతని బలితీసుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. అధికారంలో ఉన్నప్పుడు డ్రగ్స్‌కు బానిసలుగా మార్చి రాష్ట్ర యువత భవితను నాశనం చేశారని.. ఇప్పుడు రప్పా రప్పా అంటూ వైసీపీ మూఠా యువతను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. రప్పా రప్పా అంటే జైలుకు పంపడం ఖాయమని స్పష్టం చేశారు. కత్తి తీస్తే కటకటాలపాలవడం ఖాయమని వైసీపీ మూక గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. ఇది రాక్షసుడు నడిపే ఆటవిక వైసీపీ పాలన కాదని.. శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే చంద్రన్న నాయకత్వంలో నడిచే కూటమి ప్రభుత్వ పాలన అని అన్నారు. ఈ ప్రభుత్వం రాష్ట్రంలో ఎటువంటి హింసను సహించదని, ఉపేక్షించదని హోంమంత్రి అనిత తేల్చిచెప్పారు.

# ఆర్ఎస్ఎస్‌పై పోరాటం కొనసాగుతుంది




మొదటి పేజీ తరువాయి

సాంస్కృతికంగా ఆర్ఎస్ఎస్‌పై పోరాటం చేస్తానని పేర్కొన్నారు. భారతదేశంలో కనిపించని బ్రహ్మ రాక్షసుడు ఉన్నారని విమర్శించారు. కమలం పార్టీతో తాను పోరాడుతున్నానని.. తన పోరాటం ఆగదని పేర్కొన్నారు. శనివారం విశాఖపట్నంలోని ఏయూ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు ప్రకాశ్‌రాజ్. సీఐటీయూకి తనకు అనుబంధం చాలా ఏళ్ల నుంచి ఉందని గుర్తుచేసుకున్నారు. వీధి నాటకాల నుంచే తన ప్రయాణం ప్రారంభమైందని ప్రస్తావించారు. అబద్ధం మాట్లాడటానికి ధైర్యం ఉండాలని.. నిజం మాట్లాడటానికి కాదని చెప్పుకొచ్చారు. ఈరోజు రైతుల గుండెల మీద ఆయా ప్రభుత్వాలు బిజినెస్‌మెన్‌లను కూర్చొబెడు తున్నాయని విమర్శించారు. ప్రభుత్వాలు అన్నదాతల కనీస సమస్యలు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఈరోజు ప్రజల గొంతుగా మారి తాను మాట్లాడుతున్నానని చెప్పుకొచ్చారు ప్రకాశ్‌రాజ్. మన ప్రభుత్వాలు అమ్ముడు పోయాయని ఆరోపణలు చేశారు. రాజకీయ నేతలు మనువాదాన్ని అమలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. చమట చుక్కకు ఓటమి లేదని.. ప్రస్తుతం పేదల శ్రమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కోసం సీఐటీయూ గొంతెత్తి పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు పరం అవుతున్నాయని విమర్శించారు. విశాఖపట్నంలో ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వాలు అమ్ముడు పోయాయని ప్రకాశ్‌రాజ్ విమర్శలు చేశారు.

# విజయవాడ, తిరుపతిలకు గ్రేటర్ హోదాకి బ్రేక్

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనపై మంత్రులు, అధికారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇవాళ(శనివారం) ఏపీ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు మంత్రి నారాయణ. ఈ సమావేశంలో కొత్త జిల్లాల ఏర్పాటుపై చర్చించామని తెలిపారు. మరోసారి సమావేశమై గ్రేటర్ తిరుపతి, గ్రేటర్ విజయవాడ అంశాలపై కీలక నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. జరీబు, నాన్ జరీబు భూములపై రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేశామని వ్యాఖ్యానించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం భూములకు సంబంధించి కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చామని అన్నారు. రాజధాని రైతులకు రిటర్నబుల్ ఎ÷-లాట్స్‌లో 42మంది మార్పులు కోరారని తెలిపారు. రిటర్నబుల్ ఎ÷-లాట్ మార్చుకోవాలనుకునే అన్నదాతలు దరఖాస్తు చేసుకుంటే వాటిని మారుస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# విశాఖలో జాతీయ గిరిజన యువ సమ్మేళనం

## 30 నుంచి జనవరి 5వ తేదీ వరకు నిర్వహణ

**విశాఖపట్టణం :** విశాఖ మహా నగరంలో జాతీయ గిరిజన యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి. మహేశ్వర రావు తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 30 నుంచి జనవరి 5వ తేదీ వరకు 17 వ జాతీయ గిరిజన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, కేంద్ర యువజన వ్యవహారాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వరుసగా ఈ ఏడాది కూడా స్మార్ట్ సిటీ విశాఖలో గిరిజన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. యూత్ హాస్టల్లో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ గఢ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి 200 మంది గిరిజన యువతీ యువకులు సమ్మేళనంలో పాల్గొంటారని అన్నారు. స్థానిక సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేయడం, గిరిజన సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ఇక్కడ వారికి చాటి చెప్పడమే ఈ సమ్మేళనం లక్ష్యమన్నారు. ఈ పర్యటనలో ఆదివాసీ యువతీ యువకులు ప్రభుత్వ పారిశ్రామిక ప్రాంతాలు పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తారని చెప్పారు. గిరిజన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల గురించి కూడా తెలియజేయనున్నట్లు తెలిపారు. సమ్మేళనంలో నాలుగు రాష్ట్రాల గిరిజన యువతీ యువకులు ఆయా ప్రాంతాల కళారూపాలను ప్రదర్శిస్తారని అన్నారు. దేశ పురోగతిలో గిరిజనులను భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ సమ్మేళనం ఎంతగానో దోహద పడుతుందని డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు తెలియజేశారు. పాత్రికేయుల సమావేశంలో నేరయోభారత్ రిసోర్స్ పర్సన్ ఎన్ నాగేశ్వరరావు ఎన్ఎస్ఎస్ నేషనల్ అవార్డు గ్రహీత ఆర్. లీలా ప్రసాద్ పాల్గొన్నారు.

# తిరుమలలో వైకుంఠ ఏర్పాట్లు పూర్తి

## టోకెన్ ఉన్నవారికి మాత్రమే దర్శనాలు

**తిరుపతి :** తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేపట్టారు. టోకెన్ ఉన్న భక్తులకే దర్శనం అంటూ టిటిడి ప్రకటన చేసింది. శ్రీవాణిజ టిక్కెట్లను రద్దు చేశారు. జనవరి రెండు వరకు అంటే 30 నుంచి 2 వరకు కేవలం టోకెన్ దర్శాలు మాత్రమే ఉంటాయి. ఈనెల 30వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలు జరగనున్న తెలిసిందే. ఈ సందర్భంగా టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ...ఏర్పాట్లు పూర్తయ్యాయని అన్నారు. తిరుమల వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చౌదరి తెలిపారు. డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీ టోకెన్స్ ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వారా దర్శనం కల్పిస్తామని ఆయన వెల్లడించారు. టోకెన్ పొందిన ప్రతి భక్తుడికీ రెండు నుంచి మూడు గంటల్లోనే వైకుంఠ ద్వారా దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జనవరి 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఎటువంటి టోకెన్స్ లేకపోయినా.. సర్వదర్శనం ద్వారా భక్తులకు స్వామివారి దర్శనం కలుగజేస్తామని తెలిపారు. ఈ ఏడాది సుమారు 8లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనం కల్పించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పుకొచ్చారు. ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పిస్తామని చెప్పారు. భక్తులు టీటీడీ ఇచ్చిన సూచనలను గమనించి తిరుమల పర్యటనను ప్లాన్ చేసుకోవాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు.

# అన్నమయ్య జిల్లాకు నష్టం లేదు

## వదంతులను ప్రజలు నమ్మవద్దు : మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి :** జిల్లాల పునర్విభజన పక్రియపై, ముఖ్యంగా అన్నమయ్య జిల్లాకు సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మీడియాకు ఓ వీడియో విడుదల చేసిన ఆయన.. పునర్విభజన అంశంలో జరుగుతున్న ప్రచారం తుది నిర్ణయాలు కాదని స్పష్టంచేశారు. జిల్లా ముక్కలు కాబోతోందంటూ వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలు, అవగాహనలేని ప్రచారం మాత్రమేనని పేర్కొన్నారు మంత్రి రాంప్రసాద్ రెడ్డి.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల ఆకాంక్షలు, అభిప్రాయాలను పూర్తిస్థాయిలో పరిగణలోకి తీసుకుని మాత్రమే నిర్ణయాలు తీసుకుంటారని మంత్రి తెలిపారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంగానే కొనసాగుతుందని మంత్రి మరోసారి స్పష్టం చేశారు.. రాయచోటి ప్రజలు, నాయకులు ప్రభుత్వం పట్ల పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, జిల్లా కేంద్రం విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని ఆయన భరోసా ఇచ్చారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో, త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి జిల్లాలోని తాజా పరిస్థితిని వివరించి, సమస్యకు పరిష్కారం చూపుతామని.. ప్రజల అభిప్రాయానికే ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, పరిపాలన మరింత మెరుగుపడేలా మాత్రమే పునర్విభజన మార్పులు ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. వదంతులు వ్యాప్తి చేసే అసత్య ప్రచారాలను ప్రజలు అప్రమత్తంగా గమనించాలని ఆయన కోరారు. ప్రభుత్వం తుది నోటిఫికేషన్ ప్రకటించే వరకు అనధికారిక ప్రచారాలను విశ్వసించవద్దని మంత్రి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.

# బంగ్లాదేశ్‌లో హిందువులను రక్షించాలి

## బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**అమరావతి :** బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణాలపై ప్రతి ఒక్కరూ స్పందించాలన్నారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడిన మాధవ్.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దురాగతాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రాజకీయ పార్టీ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనించి.. పొరుగు దేశంలో హిందువుల రక్షణ కోసం గళం విప్పాలని కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మూక దాడులను, హత్యలను సినీ ప్రముఖులు ఖండిస్తున్నారని మాధవ్ పేర్కొన్నారు. హీరోయిన్లు జాన్వీపూర్, కాజల్ అగర్వాల్, సీనియర్ నటి, మాజీ ఎంపీ జయప్రద చేసిన పోస్టులు కొంత ఊరట నిస్తున్నాయన్నారు. భారత విదేశాంగశాఖ బంగ్లాదేశ్‌పై ఘాటు గానే స్పందించిందన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు మాధవ్.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత పోస్టులు

## మండిపడుతున్న జనసైనికులు

**గుంటూరు :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై తరచుగా అనుచిత పోస్టులు పెట్టడం సంచలనం రేపుతోంది. రాజకీయ, వ్యక్తిగత కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అసభ్యకరమైన వ్యాఖ్యలతో పవన్‌ను ఉద్దేశించి పలువురు అనుచిత పోస్టులు పెట్టడం పరిపాటిగా మారింది. ఇలాంటి కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు తాజాగా మరోసారి పవన్‌పై అసభ్యకరమైన పోస్టు పెట్టడం తీవ్ర కలకలం రేపుతోంది. అది కూడా ఇటీవల ఇప్పటంలో ఓ వృద్ధురాలిని పవన్ కలిసిన ఫొటోలను అసభ్యకర రీతిలో పోస్టు చేశాడో వ్యక్తి. దీనిపై జనసేన నేతలు, కార్యకర్తలు, పవన్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఇచ్చిన మాట కోసం ఇటీవల గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటంలో వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మ ఇంటికి పవన్ వెళ్లిన విషయం తెలిసిందే. ఆమె కాళ్లను నమస్కరించడంతో పాటు.. వృద్ధురాలిని మాతృభావంతో ఆప్యాయంగా ఆలింగం చేసుకున్నారు డిప్యూటీ సీఎం. అంతేకాకుండా వృద్ధురాలికి రూ.50వేలు, మనవడి చదువుకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఎప్పుడూ అండగా ఉంటానని పవన్ భరోసా ఇచ్చారు. పవన్ రాకతో వృద్ధురాలు కూడా ఎంతో ఆనందం వ్యక్తం చేసింది. అయితే, సదరు వృద్ధురాలిని పవన్ ఆలింగనం చేసుకున్న ఫొటోను తప్పుడు దృష్టితో చూసిన ఓ వ్యక్తి.. అనుచిత వ్యాఖ్యలతో దాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. నిందితుడు గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన జనసైనికులు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనుచితంగా పోస్ట్ చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు డిమాండ్ చేశారు.




# పేదల కడుపుపై తన్నిన మోదీ ప్రభుత్వం

- దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి తీవ్ర ముప్పు
- ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు నష్టం
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ :** దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాం గానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు ఉపాధి కరువవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఖర్గే పలు కీలక అంశాలపై మాట్లాడారు. నరేగా రద్దును మహాత్మాగాంధీకి అవమానంగా, 'రైట్ టు వర్క్'పై మోదీ సర్కార్ క్రూర దాడిగా ఖర్గే అభివర్ణించారు. 'పేదల కడుపుపై తన్నిన మోదీ ప్రభుత్వం.. పేదల కంటే కార్పొరేట్ల లాభాలే ముఖ్యం' అని ఖర్గే విమర్శించారు. జఖం హయాంలో అమలైన హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. 2006లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ పథకం గ్రామీణ భారత ముఖచిత్రాన్ని మార్చిందని, దళితులు, ఆదివాసీలు, మహిళలకు భరోసా ఇచ్చిందని, పేదరికం నుంచి బయటపడ్డ తరాన్ని సృష్టించిందని ఖర్గే చెప్పుకొచ్చారు. ఎలాంటి అధ్యయనం లేకుండా రద్దు చేశారని మండిపడ్డారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాల తరహాలోనేనని, రైతు ఉద్యమంలా దేశవ్యాప్త పోరాటం అవసరమని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ఓఉఔఖీఇఉంపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సభ్యులకు ఖర్గే సూచించారు. కాంగ్రెస్ 'సంస్థా సృజన అభియాన్'ను కొనసాగిస్తామని ఖర్గే తెలిపారు. 500 జిల్లాల్లో జిల్లా అధ్యక్షుల నియామకం పూర్తయిందని, బూత్ స్థాయి వరకూ పార్టీని బలోపేతం చేస్తున్నామని ఖర్గే చెప్పారు. 2026 ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధమని ఆయన ప్రకటించారు.

# నకిలీ ఏజెంట్ల మాటలు నమ్మకండి

## వీసా దరఖాస్తుదారులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక




**న్యూఢిల్లీ :** మీడియేటర్ల మాటలు నమ్మి మోసపోవద్దని, వీసా దరఖాస్తుదారులకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో హెచ్-1బీ వీసా ప్రాసెసింగ్, రెన్యువల్స్ ఆలస్యమవుతుండటంపై యూఎస్ ఎంబసీ స్పందించింది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని కొందరు నకిలీ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఎలాంటి జాప్యాలకు తావు లేకుండా వీసా లభించేలా చూస్తామంటూ ఆ నకిలీ ఏజెంట్లు దరఖాస్తుదారుల్ని సంప్రదిస్తున్నారని అప్రమత్తం చేసింది. అలాంటి హామీలను నమ్మొద్దని, దానివల్ల ఆర్థికంగా నష్టం, ప్రయాణ ప్రణాళికల్లో ఇబ్బందులు తలెత్తవచ్చని ఎక్స్ వేదికగా అడ్వైజరీ జారీ చేసింది. వీసా అపాయింట్‌మెంట్లు అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే షెడ్యూల్ అవుతాయని స్పష్టం చేసింది. ఈ పక్రియ ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో ఎవరైనా వీసా ఇప్పిస్తామంటే అది మోసం కిందికే వస్తుందని హెచ్చరించింది. అధికారిక పక్రియలో భాగంగా పేర్కొన్న ఫీజు కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదని సూచించింది. అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ కారణంగా భారత హెచ్-1బీ దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతోన్న సంగతి తెలిసిందే. దాని కారణంగా కొన్ని నెలల పాటు వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. ఈ వ్యవహారంపై మన దేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై అమెరికా వర్గాలతో చర్చిస్తున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# పాక్‌తో అప్రమత్తంగా ఉండాల్సిందే

## పాక్ సైనిక వ్యూహాలను తేలికగా తీసుకోరాదు

## కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూ ర్ తరవాత మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వచ్చిందన్నారు. పాక్‌ను తక్కువ అంచనా వేయకుండా అప్రమత్తంగా ఉండాలని, అలాగే దానిని నమ్మడానికి లేదన్నారు. పాకిస్థాన్‌లో మారుతున్న సైనిక వ్యూహాలు, అభివృద్ధి చెందుతున్న హైపర్ సోనిక్ క్షిపణి వ్యవస్థలను.. భారత్ తేలిగ్గా తీసుకోకూడదని హెచ్చరించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్‌తో ఉన్న గత అనుభవాల నుంచి భారత్ చాలా నేర్చుకున్నందున ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పూర్తి సిద్ధంగా ఉండాలన్నారు. డ్రోన్లు, రాకెట్లు, క్షిపణుల తర్వాత హైపర్‌సోనిక్ సాంకేతికతపై పాక్ దృష్టిసారించిందన్నారు. ఇది భారత్ తేలికగా తీసుకునే విషయం కాదన్నారు. పాక్‌లో ప్రజాస్వామ్యం నామమాత్రంగానే ఉందని.. ఇప్పటికీ సైనిక ఆధిపత్యమే కొనసాగుతుందన్నారు. ఆర్థికంగా దుర్భర పరిస్థితిలో ఉన్న ఆ దేశం.. విదేశాల నుంచి అందే సాయంపైనే ఆధారపడుతుందని థరూర్ అన్నారు. ఇక, బంగ్లాదేశ్ దాని సొంత సమస్యలతో సతమతమవుతోందన్నారు. పాక్‌తో రక్షణ ఒప్పందానికి బంగ్లా చేస్తున్న చర్చల గురించి ప్రస్తావిస్తూ.. భారత్ మాకు శత్రువు అనే అభిప్రాయాన్ని కల్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పొరుగు దేశాల్లో పెరుగుతున్న భారత వ్యతిరేకతపై ఆయన మాట్లాడుతూ.. బంగ్లాలో స్థిరమైన, శాంతియుత వాతావరణం మనకు చాలా కీలకమన్నారు. ఈశాన్య రాష్ట్రాలను భారత్ నుంచి విడదీస్తామంటూ వస్తోన్న హెచ్చరికలపై ఆందోళన వ్యక్తం చేశారు.



# తండ్రి అనారోగ్యంతో అప్పులపాలు

## తల్లిదండ్రులను చంపి కుమారుల ఆత్మహత్య

**ముంబై :** ఇద్దరు కొడుకులు కలిసి నిద్రిస్తున్న తల్లిదండ్రులను హత్య చేశారు. ఆ తర్వాత రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తండ్రి అనారోగ్యం వల్ల అప్పులపాలు కావడంతో వారిద్దరూ ఇలా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. డిసెంబర్ 25న జవాలా మురార్ గ్రామానికి చెందిన 51 ఏళ్ల రమేష్ సోనాజీ లాఖే, 45 ఏళ్ల భార్య రాధాబాయి వారి ఇంట్లో మంచంపై మరణించడాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఆ ఇంటికి చేరుకున్నారు. దంపతుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిద్రిస్తున్న ఆ భార్యాభర్తలను గొంతునొక్కి చంపినట్లు పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో తేలింది. కాగా అదే రోజున ఆ గ్రామానికి కొంత దూరంలోని రైలు పట్టాలపై ఆ దంపతుల కుమారులులైన 25 ఏళ్ల ఉమేష్, 23 ఏళ్ల బజరంగ్ మృతదేహాలు కనిపించాయి. దీంతో వారిద్దరి మృతదేహాలను కూడా పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అన్నాదమ్ములు రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. మరోవైపు ఒకే రోజు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వేర్వేరుగా మరణించిన ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేశారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. పక్షవాతంతో మంచానికి పరిమితమైన రమేష్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఆయనకు చికిత్స కోసం ఆ కుటుంబం అప్పులపాలైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆర్థిక బాధలు తట్టుకోలేక ఇద్దరు కుమారులు తమ తల్లిదండ్రులను చంపి ఆ తర్వాత రైలు ముందు దూకి ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు గ్రహించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# వెచ్చదనం కోసం ఇంట్లో నిప్పుల కుంపటి

## అర్థరాత్రి వేళ విష వాయువులకు ముగ్గురు మృతి

**పాట్నా :** చలికాలం నేపథ్యంలో గదిలో వెచ్చదనం కోసం మంట రాజేసి ఒక కుటుంబం నిద్రించింది. విష వాయువులు వెలువడంతో ఒక వృద్ధురాలు, ముగ్గురు పిల్లలు మరణించారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. బీహార్‌లోని చాప్రా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. చాప్రాకు చెందిన ఒక కుటుంబం గురువారం రాత్రి వేళ గదిలో వెచ్చదనం కోసం బొగ్గుల కుంపటి వెలిగించారు. తలుపులు, కిటికీలు మూసేశారు. ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఆ గదిలో నిద్రించారు. కాగా, బొగ్గుల కుంపటి మండటంతో ఆ గదిలో ఆక్సిజన్ స్థాయిలు పడిపోయాయి. విషపూరిత కార్బన్ మోనాక్సైడ్ పేరుకుపోయింది. దీంతో ఆ గదిలో నిద్రించిన ఎనిమిది మంది స్పృహ కోల్పోయారు. శుక్రవారం తెల్లవారుజామున కింది అంతస్తులో నివసించే బంధువులు పైకి వెళ్లి చూశారు. ఆ గదిలో ఉన్న వారి పరిస్థితి చూసి ఆందోళన చెందారు. మరోవైపు వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. మూడేళ్ల తేజాంష్ కుమార్, ఏడు నెలల గుడియా కుమారి, ఆదియా కుమారి, 70 ఏళ్ల కమలావతి దేవి అప్పటికే మరణినంచినట్లు డాక్టర్లు నిర్ధారించారు. 25 ఏళ్ల ఆర్య కుమారి, 24 ఏళ్ల ఆర్య సింగ్, 25 ఏళ్ల అనిషా, 35 ఏళ్ల అమిత్ అలియాస్ సోనుకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఆ తర్వాత బొగ్గుల కుంపటి ఉంచిన గదిని పరిశీలించారు. ఫోరెన్సిక్ బృందాన్ని పంపి ఆధారాలు సేకరించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు శీతాకాలంలో మూసి ఉన్న బెడ్ రూముల్లో బ్రజియర్లు, హీటర్లు, బ్లోయర్‌లను ఉపయోగించవద్దని ఆ జిల్లా అధికారులు సూచించారు. నిద్రించే గదిలో సరైన వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలని కోరారు. తద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



సంపాదకీయం

# హిందువులు లక్ష్యంగా బంగ్లాలో దాడులు!

బంగ్లాదేశ్‌లో అల్లర్లు భారత్‌ను రెచ్చగొట్టేలా సాగుతున్నాయా అన్న అనుమానం కలుగుతోంది. ఎందుకంటే యూనస్ తాత్కాలిక నేతగా పగ్గాలు చేపట్టిన తరవాత హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగాయి. హసీనాను పదవీచ్యుతి చేసిన తరవాత హిందువులు లక్ష్యంగా దాడులు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే వందలమందిని హతమార్చారు. హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న నేపథ్యంలో కావాలనే అక్కడి మైనార్టీ హిందువులపై దాడులు విపరీతం అయ్యాయి. రాజకీయ హింసలో భాగంగా వీటిని చూపే ప్రయత్నం చేసి తప్పించుకోవాలని చూస్తున్నారు. అయితే గత ఏడాదిగా అక్కడ జరుగుతున్న అల్లర్లు కేవలం హిందువులను ఊచకోత కోసేవిగా ఉన్నాయి. పనిగట్టుకుని మూకలు రెచ్చిపోతున్నా, తాత్కాలిక ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఇద్దరు హిందువులను హతమార్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణాలపై భారతదేశంలో ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవు తున్నాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మూక దాడులను, హత్యలను సినీ ప్రముఖులు ఖండిస్తున్నారు. గాజాలో జరిగిన పరిణామాలను అయ్యో పాపం అనుకున్న భారతీయులు, పొరుగు దేశం బంగ్లదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా మౌనం వీడాలంటూ సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు. ఈ క్రమంలోనే హీరోయిన్లు జాన్వీపూర్, కాజల్ అగర్వాల్, సీనియర్ నటి, మాజీ ఎంపీ జయప్రద చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి కారణంగా ఆ దేశం రణరంగంగా మారిన సంగతి తెలిసిందే. అక్కడ ఇటీవల హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. తొలుత దీపుచంద్ర దాస్ అనే వ్యక్తిని దారుణంగా కొట్టి చంపి, అతని మృతదేహానికి నిప్పంటించిన ఘటన మురువకముందే తాజాగా మరో వ్యక్తిని కొట్టి చంపిన సంఘటన జరిగింది. అమృత్ మండల్ అలియాస్ సామ్రాట్ అనే వ్యక్తి రాజ్‌బరిలోని పంగ్షా ఉప జిల్లాలో హత్యకు గురయ్యాడు. సామ్రాట్ హత్య ఏ విధంగానూ మతపరమైనది కాదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇది కేవలం హత్యను కప్పిపుచ్చుకోవడానికి చేసిన ప్రయత్నం తప్ప మరోటి కాదు. అయితే హిందువులపై జరుగుతున్న వరుస దాడులపై భారత్ తీవ్రంగా స్పందించింది. మైనారిటీ కమ్యూనిటీ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఇటీవల జరిగిన వరుస సంఘటనలను ఆందోళన కలిగించేవిగా అభివర్ణించింది. హిందువులపై ఇలాంటి హింసను విస్మరించలేమని భారత్ హెచ్చరించింది. సరిహద్దు వెంబడి జరుగుతున్న పరిణామాలను న్యూఢిల్లీ తీవ్రంగా పరిగణించిందని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. హిందువులపై జరుగుతున్న హింసను విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. బాధ్యులను గుర్తించి శిక్షిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో ఇటీవలి పరిణామాల గురించి ప్రపంచమంతా గమనిస్తోంది. వాటిని నిశితంగా గమనిస్తున్నట్లు భారత్ కూడా పేర్కొంది. శాంతిభద్రతల పరిస్థితి విషయానికొస్తే అక్కడ ఏం జరుగుతుందో ఎప్పటి కప్పుడు భారత్ తెలియజేస్తున్నది. బంగ్లాదేశ్‌లోని హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు సహా మైనారిటీలపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగించే విషయమని జైస్వాల్ అన్నారు. మైమెన్‌సింగ్‌లో ఇటీవల జరిగిన హిందూ యువకుడి దారుణ హత్యను ఖండిస్తున్నామని అన్నారు. ఈ నేరానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని ఆశిస్తున్నాం. తాత్కాలిక ప్రభుత్వ హయాంలో హత్యలు, దహనాలు, భూ కబ్జాలతో సహా మైనారిటీలపై 2,900 కంటే ఎక్కువ హింసాత్మక సంఘటనలు జరిగినట్లు స్వతంత్ర వర్గాలు నమోదు చేశాయి. ఈ సంఘటనలను కేవలం రాజకీయ హింసగా తోసిపుచ్చలేమని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఇద్దరు హిందూ వ్యక్తులను కొట్టి చంపిన నేపథ్యంలో భారత్ ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే ప్రపంచవ్యాప్తంగా నిరసలు వస్తున్నా బంగ్లాదేశ్‌లో ముస్లిమేతరులు సహా పలువురి మీద జరుగుతున్న దాడులపై ప్రకంపనలు ఆగడం లేదు. విప్లవవాద నాయకుడు షరీఫ్ ఒస్మాన్ హాడీ హత్యను నిరసిస్తూ అతని మద్దతుదారులు శుక్రవారం ఢాకాలోని కీలక కూడలిని దిగ్బంధం చేశారు. న్యాయం చేయాలని నినదిస్తూ బైఠాయించడంతో ట్రాఫిక్ గంటలతరబడి నిలిచిపోయింది. ఢాకా విశ్వవిద్యాలయ మసీదు నుంచి షాబాగ్ వరకు ప్రదర్శన చేపట్టి ధర్నా నిర్వహించారు. న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. హాడీ హత్యానంతరం చెలరేగిన అల్లర్లు, విధ్వంసకాండలో హిందూ కార్మికుడు దీపూ చంద్రదాస్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మరోవైపు.. బ్రిటన్‌లోని ప్రవాసం వీడి 17 ఏళ్ల తర్వాత స్వదేశానికి చేరుకున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రహ్మాన్ తన తండ్రి, బంగ్లా మాజీ అధ్యక్షుడు జియాఉర్ రహ్మాన్ సమాధిని సందర్శించి నివాళులర్పించారు. 19 ఏళ్ల తర్వాత ఈ సమాధి వద్దకు రాగలగడంపై ఉద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీ లపై దాడుల్ని కేంద్ర మాజీమంత్రి మీనాక్షీ లేఖి ఖండించారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో ఇంకా కొందరు నేతలు మొగల్ చక్రవర్తి బాబర్ మాదిరి ఆలోచనాధోరణితో ఉన్నారని విమర్శించారు. అందుకే ఆ రెండు దేశాల్లో హత్యలు జరుగుతున్నాయన్నారు. భారత్‌ను రెచ్చగొట్టాలనేదే వారి ఉద్దేశమని ఆరోపించారు. దండెత్తి వచ్చేవారిపై సహృదయత చూపాల్సిన అవసరం లేదన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల్ని భారత్ ఖండించింది. కిరాతకమైన దాడిలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడానికి కారకులైన దోషుల్ని శిక్షించాలని డిమాండ్ చేసింది. తాత్కాలిక ప్రభుత్వం వచ్చాక దాదాపు 2,900 హింసాత్మక ఘటనలు మైనారిటీలపై జరిగాయని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. వీటిని రాజకీయ హింసగా కొట్టిపారేయ లేమంది. పశ్చిమబెంగాల్ శాసనసభ విపక్షనేత సువేందు అధికారి కోల్‌కతాలో బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ కార్యాలయంలో సీనియర్ అధికారులను కలిశారు. హిందూ మైనారిటీలపై దాడులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐదులక్షల మంది సన్యాసులతో వచ్చి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లోని రెండుకోట్ల మంది హిందువుల్ని పదేపదే లక్ష్యంగా చేసుకుంటుంటే భారత్‌లోని వందకోట్ల మంది హిందువులు మౌన ప్రేక్షకులుగా కూర్చొంటారా అని ప్రశ్నించారు. మొత్తంగా బంగ్లను ఇలాగే వదిలేస్తే దారుణాలు పెరుగుతాయని గుర్తించాలి.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్

# ఆసుపత్రి రోగులకు ఆహార భరోసా

## ఉచిత భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



**సూళ్లూరుపేట:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు నిజంగా వరంగా మారిన ఉచిత భోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ పిలుపునిచ్చారు. పేద ప్రజలపై చికిత్స సమయంలో పడే ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అత్యంత పటిష్టంగా అమలు చేస్తోందని ఆమె స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అడ్మిట్ అయిన ఇన్‌పేషెంట్లకు రోజుకు మూడు పూటలా నాణ్యమైన భోజనం పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవం అయిన బాలింతలకు మూడు రోజుల పాటు ప్రత్యేక పౌష్టికాహారం, భోజన వసతి కల్పిస్తున్నామని వెల్లడించారు.

రోగుల ఆరోగ్య పరిస్థితిని బట్టి షుగర్, కిడ్నీ సమస్యలు లేదా శస్త్రచికిత్స అనంతరం ఉన్నవారికి వైద్యుల సూచనల మేరకు ప్రత్యేక డైట్ మెనూ అందిస్తున్నామని ఆమె తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న సమయంలో రోగులు, వారి సహాయకులు భోజన ఖర్చుల విషయంలో ఇబ్బంది పడకుండా చూడడమే కాకుండా, పౌష్టికాహారం ద్వారా వారు త్వరగా కోలుకునేలా చేయడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. అలాగే ఆసుపత్రుల్లో వడ్డించే భోజన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, మెనూ ప్రకారం సమయానికి ఆహారం అందేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నియోజకవర్గ ప్రజలందరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఈ సౌకర్యాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. డయాలసిస్ కేంద్రానికి సన్నాహాలు నియోజకవర్గంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. చెన్నై, తిరుపతి, నెల్లూరు వంటి ప్రాంతాలకు చికిత్స కోసం వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన పరికరాలు, వైద్య బృందాలను త్వరలో సమకూరుస్తామని ఆమె పేర్కొన్నారు. "ఆరోగ్యవంతమైన సూళ్లూరుపేట నిర్మాణమే మన అందరి లక్ష్యం" అని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉచిత భోజన పథకం కాంట్రాక్టర్ శివయ్య నాయుడు, సూళ్లూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రం ఇంచార్జ్ డాక్టర్ రమేష్, గవర్నమెంట్ హాస్పిటల్ కమిటీ సభ్యులు హనుమంత రావు, సతీష్, సరిత, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం దృఢ సంకల్పం



**సూళ్లూరుపేట:** రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన పాలనా తప్పిదాల వల్ల నేడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి తరచూ స్పష్టం చేస్తున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ముఖ్యంగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, భూ వివాదాలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి అధిక సంఖ్యలో అర్జీలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూ రిజిస్ట్రేషన్లలో జరిగిన అక్రమాలే ఇందుకు ప్రధాన కారణమని వారు ఆరోపించారు. ఒకరి పేరులో ఉన్న భూమిని మరొకరి పేరులో నమోదు చేయడం, సర్వే నంబర్లు మార్చడం, వారసత్వ భూములను తప్పుగా రిజిస్టర్ చేయడం వంటి చర్యల వల్ల ఇప్పటికీ ప్రజలు నష్టపోతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా సమస్యలు కొనసాగుతున్నాయంటే, గత పాలనలో జరిగిన అన్యాయాల ప్రభావమేనని వ్యాఖ్యానించారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రతి మండలానికి రూ.2 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేసి గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించామని చెప్పారు. అలాగే నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీలకు కూడా రూ.2 కోట్ల చొప్పున నిధులు కేటాయించి, రోడ్లు లేని ప్రాంతాల్లో పనులు శరవేగంగా సాగుతున్నాయని వెల్లడించారు. డ్రైనేజీ సమస్యల కారణంగా చెత్త పేరుకుపోయి, దోమలు పెరిగి ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట మున్సిపాలిటీకి రూ.16 కోట్లు, నాయుడుపేట మున్సిపాలిటీకి రూ.18 కోట్లు డ్రైనేజీ పనుల కోసం మంజూరు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని, త్వరలోనే డ్రైనేజీ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల అమలుపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. గతంలో రాజకీయ కారణాలతో పేదల పెన్షన్లు రద్దు చేసిన పరిస్థితులు ఉన్నాయని, కానీ ప్రస్తుతం ఎట్టి పరిస్థితుల్లోనూ పేదలను ఇబ్బంది పెట్టవద్దని ముఖ్యమంత్రి కఠిన ఆదేశాలు జారీ చేశారని అన్నారు. ఎవరికి ఓటు వేశారు, ఏ పార్టీకి చెందినవారు అన్నది పక్కనపెట్టి అర్జీలను స్వీకరిస్తున్నామని, సీఎంఆర్ఎఫ్, ఇళ్లు, పెన్షన్లు వంటి అంశాల్లో రాజకీయ భేదాభిప్రాయాలకు తావు లేదని నాయకులు స్పష్టం చేశారు. పేదలకు అవసరమైన అన్ని సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గతంలో రాజకీయ గుర్తింపుల పేరుతో సంక్షేమ పథకాలు రద్దు చేసిన దుస్థితిని ప్రజలు చూశారని, అయితే చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఇక అలాంటి పరిస్థితులకు చోటు లేదని స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అదే నిబద్ధతతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని నాయకులు పేర్కొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలలు పీపీపీతో నిర్మించడం ప్రజలకు నష్టం

## విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు



**నర్సీపట్నం:** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించడం వల్ల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని, విద్యా, వైద్య సేవలు ప్రజలకు అందించడం ప్రభుత్వం యొక్క కనీస బాధ్యత అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి విశాఖపట్నంలో పరిశ్రమల సదస్సులు నిర్వహిస్తున్నదని, వాటి వల్ల ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఉపాధి కలిగిందా అని ప్రశ్నించారు. ఆ ఖర్చుతోనే నర్సీపట్నం, పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పూర్తి చేయవచ్చని అన్నారు. పీపీపీ పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణానికి టెండర్లు పిలిచినా ఇప్పటివరకు ఒక్కరే ముందుకు వచ్చారని తెలిపారు. కిమ్స్ యాజమాన్యం కూడా తాము టెండర్ వేయలేదని ఒక వ్యక్తిగత డాక్టర్ వేశారని ప్రకటించడం, చంద్రబాబు ప్రభుత్వంపై కార్పొరేట్ సంస్థలకు ఉన్న నమ్మకాన్ని స్పష్టం చేస్తుందని విమర్శించారు. ప్రజలకు అవసరమైన విద్య, వైద్య సేవలను ప్రభుత్వం గాలికి వదిలేసి, కార్పొరేట్లు, పరిశ్రమాధిపతులకు సేవలు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం తలమునకలై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ ప్రత్యక్ష భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం, జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, అల్లు రాజు, ఈరెల్లి చిరంజీవి, సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎల్. గౌరి, కె.వి. సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అనకాపల్లి కుంచావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవం

**గౌరమ్మ ను దర్శించుకున్న ఎమ్మెల్యే లు కొణతాల, గంటా, మాజీ ఎమ్మెల్యే పీలా, కూటమి నేతలు సురేంద్ర, బాలాజీ, నాగజగదీష్, రత్నకుమారి**

**అనకాపల్లి, డిసెంబర్ 27 (మనసులో మాట):** అనకాపల్లి కుంచావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌరీపరమేశ్వరులను భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మెన్ మళ్ళ సురేంద్ర, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్, డిసిఎంఎస్ ఛైర్మెన్ కోట్నీ బాలాజీ, రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కొమతాల రత్నకుమారి తదితర ప్రముఖులు దర్శించుకొని పూజలు జరిపారు. ముందుగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు వారందరికీ మంగళవాయిద్యాలు మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువా లు కప్పి మెమోంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం గౌరీ పరమేశ్వరుల మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఒక రోజు ముందుగా ఈ నెల 31నే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**మునగపాక, డిసెంబర్ 27, మనసులో మాట..** అనకాపల్లి ఎలమంచిలి నియోజవర్గంనూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జనవరి 01 2026 న పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ సామాజిక భద్రతా భరోసా పింఛన్లను ఒక రోజు ముందుగా ఈ నెల డిసెంబర్ 31 బుధవారం రోజు నే పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు ఎలమంచిలి నియోజవర్గం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఈ నెల 31 బుధవారం ఉదయం 6 గంటల నుంచే ఎలమంచిలి నియోజకవర్గంలో అన్ని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా లబ్ధిదారులకు పింఛన్లను అందజేస్తారని అన్నారు.

## ఒకే కాన్పులో రెండు పెయ్యాలు



**దేవరాపల్లి, డిసెంబర్ 27, (మనసులో మాట) :** మండలం తెనుగుపూడి వారు రొంగలిపేటకు చెందిన సింగంపల్లి బంగారయ్య అనే రైతుకి చెందిన ఆవుకి రెండు ఆవు పెయ్యిలు శుక్రవారం జన్మించాయి. తల్లితో పాటు రెండు పెయ్యిలు ఆరోగ్యంగా ఉన్నాయని రైతు తెలిపారు. ఒకే కాన్పులో రెండు పెయ్యిలు జన్మించడం పట్ల రైతు ఆనందం వ్యక్తం చేశారు. ఇటువంటి కాన్పుపై పశువైద్యాధికారిణి కె నుంష రాణి విలేకరులకు వివరించారు. కృత్రిమ గర్భదారణ (హార్టిఫిషియల్ ఇన్సిమినేషన్) సమయంలో ఒక అండాశయాన్ని, ఒక వీర్యం కలవడం ద్వారా ఒక పెయ్యి జన్మించడం సహజంగా జరుగుతుంది. ఒకేసారి రెండు అండాశయాలు విడదలై, రెండు వీర్యాలతో కలవడం వల్ల రెండు పెయ్యిలు జన్మించే అవకాశం అరు ఏగా జరుగుతుందన్నారు. ఇటువంటి కాన్పులు వందలో 7 శాతం వరకు సంభవిస్తుంటాయని ఉంటాయన్నారు.

## పెదబయలు ఎస్ఐగా టి. వెంకటేష్



**పెదబయలు మనసులో మాట :** పెదబయలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ గా టి.వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం డీఐజీ రేంజ్ కార్యాలయంలో పనిచేసి ఇటీవల జరిగిన బదిలీల్లో పెదబయలు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ కె.రమణ అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. మండలంలో పోలీసు శాఖకు సంబంధించి సమస్యలు ఉంటే తమ దృ ష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### అభివృద్ధి, సంక్షేమమే

# కూటమి ప్రభుత్వ లక్ష్యం

**అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ**





**అనకాపల్లి, డిసెంబర్ 27 (మనసు లో మాట):** అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని పల్లె పండుగ 2.0 లో భాగంగా రేబాక లో పాలిటెక్నిక్ కాలేజ్ వరకు మరియు బగులవాడ గ్రామంలో సుమారు 70 లక్షలు రూపాయలతో నిర్మించిన కొత్త సీసీ రోడ్లు ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద జగదీశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ అజెండా అని చెప్పారు. రోడ్ల అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఉచిత బస్సు సౌకర్యం, రైతు భరోసా, పింఛన్ల పెంపు కార్యక్రమాలు ఇప్పటికే అమలు చేశామని గుర్తుచేశారు. సంక్రాంతి తర్వాత అర్హులకు గృహాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనకాపల్లి నియోజకవర్గంలో అభివృద్ధికి అధిక నిధులు తీసుకుని రావడం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అప్పులు చేస్తే, అదే కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసి చూపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, గంగుపామ్ జగదీష్, అనకాపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కర్రి బాబి, తలారి కాశీనాయుడు, మాటూరు సన్యాసమ్మ, గనిరెడ్డి రాజు, కరణం నాయుడు,కూటమి నాయకులు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# రూ.2.10 కోట్లతో ప్రసూతి నిరీక్షణ కేంద్రానికి శంకుస్థాపన



**నర్సీపట్నం ,డిసెంబర్ 27 (మనసులో మాట)..** నర్సీపట్నం నియోజకవర్గాన్ని మెడికల్ హబ్ గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం నర్సీపట్నం ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రూ. 2కోట్ల 10లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రసూతి నిరీక్షణ కేంద్రం నిర్మాణానికి అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఈడీ కెవిఎల్పి. రాజుతో కలిసి స్పీకర్ శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 35 లక్షల విలువైన అత్యాధునిక టిఫా స్కానింగ్ మిషన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ 1985లో ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన ఈ ఆసుపత్రి నేడు వందలాది మందికి సేవలందిస్తోందని గుర్తు చేశారు. సర్సీపట్నం ఆసుపత్రిపై నమ్మకంతో తుని, పాడేరు వంటి సుదూర ప్రాంతాల నుండి కూడా గర్భిణీలు ప్రసవాల కోసం ఇక్కడికే వస్తున్నారని తెలిపారు. అయితే చివరి నిమిషంలో ఆసుపత్రికి రావడం వల్ల తలెత్తుతున్న అనర్థాలను నివారించేందుకు ఈ ప్రసూతి నిరీక్షణ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్పీకర్ గర్భిణీలు డెలివరీ డేట్ కు రెండు రోజుల ముందే ఆసుపత్రికి వచ్చి, వైద్యుల పర్యవేక్షణలో ఉండేలా ఈ భవనాన్ని డిజైన్ చేశామన్నారు. గర్భిణీతో పాటు ఒక సహాయకురాలికి కూడా ఇక్కడే ఉచిత భోజన వసతి, పడక సదుపాయం కల్పిస్తామని, జిల్లా కలెక్టర్ చొరవతో డెక్కన్ ఫైన్
కెమికల్స్ సంస్థ వారు సీఎస్ఆర్ నిధుల కింద రూ. 2.10కోట్లు మంజూరు చేయడం అభినందనీయమని తెలిపారు. నర్సీపట్నంలోని 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ఎన్టీపీసీ సంస్థ రూ. 72.5 లక్షలు మంజూరు చేసిందని, తద్వారా ఆయా ఆసుపత్రుల్లో మౌలిక వసతులు మెరుగుపడతాయని స్పీకర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం కేవలం 7 టిఫా స్కానింగ్ మిషన్లను మంజూరు చేయగా, అందులో ఒకటి నర్సీపట్నం ఆసుపత్రికి రావడం గర్వకారణమని అయ్యన్నపాత్రుడు అన్నారు. గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితిని, లోపాలను ముందుగానే గుర్తించడానికి ఈ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సహకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్ కు, దాతలైన డెక్కన్ కెమికల్స్ రాజుకి, ఎన్టీపీసీ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, డెక్కన్ ఫైన్ కెమికల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెవిఎల్పి.రాజు, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, జడ్పిటిసి రమణమ్మ, జనసేన నియోజకవర్గం ఇన్చార్జ్ సూర్యచంద్ర, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి, డాక్టర్ కృష్ణారావు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంతి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధా, ఆసుపత్రి సిబ్బంది, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక వృద్ధికి అవగాహన

**- 8 పరిశ్రమల ద్వారా 54 వేల మందికి ఉపాధికి ప్రతిపాదన**

**- జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**



**విజయనగరం, (మనసులోమాట) డిసెంబరు 27 :** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులకు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. దీనికోసం ఈ నెలాఖరులోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకోసం వచ్చే దరఖాస్తులను సింగిల్ విండో విధానంలో వెంటనే పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలని చెప్పారు. జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమావేశం కలెక్టరేట్లో శనివారం జరిగింది. జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి జిల్లా యంత్రాంగం తరపున అన్నివిధాలా సంపూర్ణ సహకారం అందించి, వీలైనంత వేగంగా స్థాపించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. భూసేకరణపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటుకు ప్రతిపాదించిన 8 పరిశ్రమల గురించి సమీక్షిస్తూ, వాటికి అవసరమైన సహకారాన్ని అందించాలని ఆయా శాఖలకు సూచించారు. సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్, స్టీల్ ఎక్సేంజ్ ఇండియా లిమిటెడ్, స్టీల్ ఎక్సేంజ్ ఎన్ఫ్రా లాజిస్టిక్స్ లిమిటెడ్, అన్నుమి స్పేస్ కార్పొరేషన్, జెఎస్డబ్ల్యూ ఇండస్ట్రీస్ పార్క్ లిమిటెడ్, వైశాఖి గ్రోత్ కారిడార్, రుషిల్ డెకర్స్, ఎలైట్లాజిక్స్ ఎగ్జిమ్ ఏజెన్సీ ఇండియా లిమిటెడ్ తదితర కంపెనీలు జిల్లాలో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు వచ్చాయని, వీటి ద్వారా సుమారు 54 వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. వీటి ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. అలాగే ర్యాంపు కార్యక్రమంలో భాగంగా యువతకు చైతన్యం కల్గించి, పరిశ్రలమ స్థాపనకు ముందుకు వచ్చేవిధంగా కృషి చేయాలని సూచించారు. దీనికోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, నియోజకవర్గ ప్రత్యేకాధికారులకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఇ.మురళి, పరిశ్రమలశాఖ ఇన్ఛార్జి జిఎం ఎంవి కరుణాకర్, పొల్యూషన్ ఇంజనీర్ సరిత, అగ్నిమాపక అధికారి రాంప్రకాష్, ఏపిఈపిడిసిఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, ఎస్డిసిలు, ఇతర శాఖల అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## నర్సీపట్నంలో సంక్రాంతి కబడ్డీ సంబరాలు

**నర్సీపట్నం, డిసెంబర్ 27 (మనసులో మాట)..** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నర్సీపట్నంలో నిర్వహించనున్న మండల స్థాయి కబడ్డీ పోటీల కరపత్రాన్ని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, నర్సీపట్నంలోని వెలమవీధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో క్రీర్తిశేషులు రుత్తల లచ్చాపాత్రుడు జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి 12 నుండి 14వ తేదీ వరకు స్థానిక పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఈ పోటీలు జరగనున్నాయన్నారు. ఈ పోటీలలో నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు (నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, నాతవరం) చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులుగా మొదటి బహుమతి రూ. 20వేల, రెండవ బహుమతి రూ. 15వేల అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని, ఆసక్తి గల జట్లు కమిటీ సభ్యులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలమవీధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కుంచావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవం

**- గౌరమ్మ ను దర్శించుకున్న దాడి రత్నాకర్**



**అనకాపల్లి, డిసెంబర్ 27 (మనసులో మాట):** శతాబ్దన్నర చరిత్ర కలిగిన అనకాపల్లి కుంచావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. పట్టణ ప్రముఖులు పలువురు గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ముందు గా టిడిపి రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ గౌరమ్మ ను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అంతకుముందు ఉత్సవ కమిటీ సభ్యులు రత్నాకర్ కు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతంలో 150 సంవత్సరాలు చరిత్ర కలిగిన కుంచావారి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం ప్రతి ఏటా వలె ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నందుకు నిర్వహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎం వీరభద్రరావు (అబ్బులు), కర్రీ కృష్ణ, పండగకి సత్యారావు, కోరుకొండ సాంబశివరావు, కొమ్మోజు రామకృష్ణ, పాలూరి శ్రీనివాసరావు, బోయిన చిన్న మణికంఠ, అంగిన రేవంత్, కుంచా దివాకర్, ఎస్. గణపతి, పలకా శేఖర్, బొడ్డపాటి చిన్న రాజారావు, యల్లపు శ్రీనివాస్, కోటిపల్లి శ్రీను, పలకా కాసులు, ఎం. రమణబాబు, ఆడారి రవికుమార్, నందవరపు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అడ్డురోడ్డు కేంద్రం గా రెవిన్యూ డివిజన్ ఏర్పాటు



**ఎస్. రాయవరం, డిశంబర్ 27,(మనసులో మాట):** ఎస్. రాయవరం మండలం అడ్డురోడ్డు కేంద్రంగా కొత్త రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలంటూ శనివారం జరిగిన జిల్లా ల పునర్విభజన కమిటీ సమావేశంలో ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. నక్కపల్లి కేంద్రం గా పాయకరావుపేట, నక్కపల్లి, కోట ఉరట్ల, ఎస్. రాయవరం, యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాలు కలిసి రివెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలనిగతంలో కమిటీ నిర్ణయించింది. మునగపాక మండలం అనకాపల్లి డివిజన్ లోనే ఉంచాలంటూ స్థానికనేతలు నుండి విజ్ఞప్తులు రావటంతో ఆ మండలాన్ని అనకాపల్లి డివిజన్ లోనే కొనసాగించాలని కమిటీ సభ్యులుకు ముఖ్యమంత్రి సూచించారు. డివిజన్ కేంద్రం అందరికిఅందుబాటులో గఉండేవిధంగా అడ్డురోడ్డులో నే ఏర్పాటు చేయాలంటూ కమిటీ సమావేశంలో తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు హోంమంత్రి అనిత, రెవిన్యూ మంత్రి సత్య ప్రసాద్, మున్సిపల్ శాఖమంత్రి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## సీటీయూ లో పీజీ అడ్మిషన్లకు సియుఈటి నోటిఫికేషన్

**- ఇన్చార్జి వీసీ ప్రొ.టి.శ్రీనివాసన్**

**విజయనగరం (మనసులోమాట) డిసంబర్ 27:** విద్యాసంవత్సరం 2026%-%27 కోసం నిర్వహించబడే సి.యు.ఈ.టి (పీజీ) ద్వారా సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, విజయనగరం నందు పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించబడిన నొటిఫికేకషన్ ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిందని దీనిద్వారా విశ్వవిద్యాలయం లో నిర్వహించే ఎనిమిది పీజీ ప్రోగ్రాములైన ఎం.ఎస్.సి కెమిస్ట్రీ, ఎం.ఎస్.సి బయోటెక్నాలజీ, ఎం.బి.ఏ, ఎం.ఏ ఇంగ్లీష్, ఎం.ఏ సోషియాలజీ, ఎం.ఏ ట్రైబల్ స్టడీస్, ఎం.ఏ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ ల అడ్మిషన్లను చేయనున్నట్లు ఇన్చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య తంత్రవాహి శ్రీనివాసన్ తెలిపారు.

అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఎన్ టి ఏ అధికారిక వెబ్సైట్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు విధానం, అర్హతలు, పరీక్ష షెడ్యూల్ తదితర వివరాలు NTA వెబ్సైట్ https://exams.nta.nic.in/cuet-pg/ లో పొందుపరచబడ్డాయని, మరిన్ని వివరాల కోసం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను యూనివర్సిటీ పని దినాల్లో కార్యాలయ వేళల్లో సంప్రదించవచ్చని ప్రొ. టి.శ్రీనివాసన్ తెలిపారు.

## ఎన్నికల వాగ్దానాలు నీటిలో మూటలేనా?

**జిల్లా అధ్యక్షులు బూర వాసు డిమాండ్**




**విజయనగరం (మనసులోమాట) డిసంబర్ 27:** రాష్ట్ర సమితి పిలుపు మేరకు శ నివారం విజయనగరం జిల్లా మయురా హెూటల్ వద్ద ఐఐఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు ఆధ్వర్యంలో బిక్షాటన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బూర వాసు మాట్లాడుతూ నేటి విద్యా శాఖ మంత్రి గా ఉన్నటువంటి నారా లోకేష్ గారు ఎన్నికల ముందు యువగలం పాదయాత్రలో మా కుటమీ ప్రభుత్వం వస్తే సంవత్సరానికి ఒక జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, అలాగే ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తామని నిరుద్యోగ భృతి కింద 3000, రూ ఇస్తామని హామీ ఇచ్చారు నేటికీ సంవత్సరం కావస్తున్న జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా యువత ని మోసం చేస్తున్నారు అని అన్నారు అలాగే జాబ్ క్యాలండర్ మాట ఎత్తనే లేదు యువత కనబడలేదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు

అలాగే గత ప్రభుత్వం వైసిపి పాలనలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి యువతకు ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వకుండా యువత ఆశలు పై నీళ్లు చెల్లి నిరాశ చేసి మోసం చేశారు ఉద్యోగాలు లేక యువత గంజాయిలకి, మాధవద్రవ్యాలకు బానిసలు అవుతూ వాళ్ల జీవితాలు నాశనం చేసుకుంటున్నారు అయ్యా చంద్రబాబునాయుడు గారు అదే విధంగా మీరు యువత ని మోసం చేయకుండా తక్షణమే జనవరి 1తేదీ నా జాబ్ క్యాలండర్ విడుదల చేసి ప్రభుత్వ శాఖలో ఖాళీగా వున్నా పోస్టులును భర్తీ చేసి యువత కు నిరుద్యోగి భృతి 3000రూపాలు ఇచ్చి యువతను ఆదుకోవాలని కోరేరు లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత బలపరుస్తామని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెలగడ రాజేష్,ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. నాగభూషణం జిల్లా నాయకులు సుమన్,చరణ్, విద్యార్థులు, యువత పాల్గున్నారు

## గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపేట

**మొదటి విడత పల్లె పండుగలో భాగంగా గజపతినగరం నియోజకవర్గంలో రూ.120 కోట్లతో పనులు చేపట్టాం**

**ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్ నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం - రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం (మనసులోమాట) డిసంబర్ 27 :** గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఇందులో భాగంగానే పల్లె పండుగ కార్యక్రమం కార్యక్రమం ప్రారంబించామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గంలో పల్లె పండుగ 2.0 కార్యక్రమాన్ని పురిటిపెంట గ్రామంలో మంత్రి శనివారం ప్రారంబించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గజపతినగరం మండలం పురిటిపెంటలో రూ.54 లక్షల విలువైన పంచాయతీరాజ్ రోడ్డు నిర్మాణ పనులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధికి ఆమడ దూరం నెట్టివేశాయని, కూటమి ప్రభుత్వం అభివృద్ధిని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు దగ్గర చేస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీసం మౌళిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో కనీస మౌళిక వసతులకు పెద్దపీట వేసి పనులు పూర్తి చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ రోడ్లు, సిసి డ్రైన్లు, గోకుల్ షెడ్స్, స్మశానాల అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిచ్చి ఎం జి ఎన్ ఆర్ జి ఎస్ ద్వారా చేపట్టామని అన్నారు. పల్లె పండుగలో భాగంగా గజపతినగరం నియోజకవర్గంలో రూ.120 కోట్లతో పనులు ప్రారంభించామని, వీటిలో రూ. అరవై కోట్లకు పైగా పనులు పూర్తయ్యి బిల్లుల చెల్లింపులు దశకు చేరుకున్నాయని అన్నారు. మిగిలిన రూ. అరవై కోట్ల పనులు నిర్మాణ దశలో ఉండగా పల్లెపండుగ 2.0 లో భాగంగా మరో రూ. ముప్పై కోట్లపనులకు రాష్ట్ర ప్రభుత్వం శాంక్షన్ చేసిందని అన్నారు. పల్లెపండుగ మొదటి విడతలో విజయనగరం జిల్లాలో రూ. 500 కోట్ల తో పనులు చేపట్టామని, వీటిలో రూ. 200 కోట్ల పనులు పూర్తయ్యి బిల్లులు జమ చేస్తున్నామని తెలియజేశారు. ఇంత పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కారకులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలియజేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రజల జీవన విధానం మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెడుతూ హెల్తీ, వెల్తీ ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలియజేశారు. జిల్లాలో ఆర్ %ఙ% బి శాఖ ద్వారా రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టామని, గజపతినగరం నుంచి మెంటాడ వరకు రోడ్డు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మెరుగైన రవాణా సదుపాయాల తోపాటు, ఆరోగ్యకరమైన జీవన విధానం ఉండాలని మంత్రి అన్నారు. గజపతినగరం నియోజకవర్గ%శీ%లో సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న పురిటిపెంట, కనిమెరక, కోమటిపల్లి వద్ద నూతనంగా ఆర్ఓబి ల నిర్మాణానికి పనులు పనులు చెపడుతున్నామని శ్రీనివాస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాలరాజు, పి ఏ సి ఎస్ అధ్యక్షులు బంగారు నాయుడు, గజపతినగరం మండల మాజీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మాజీ జడ్ పి టి సి మక్కువ శ్రీధర్, బిజెపి జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీవీ రమణమూర్తి, డిపి చంద్రశేఖర్ తోపాటు పలువురు కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిపిఎం నేత అప్పలరాజు పై పెట్టిన పీడీ యాక్ట్ ను రద్దు చేయాలి

**- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు**



**నర్సీపట్నం ,డిసెంబర్ 27 (మనసులో మాట)..** నర్సీపట్నంలో జిల్లా కలెక్టర్ ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కే.లోకనాథం, జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, అప్పలరాజు భార్య లక్ష్మి, జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ప్రజల సమస్యల పై ప్రజల కోసం పనిచేస్తున్న అప్పలరాజు పై రౌడీలు, స్మగ్లర్సు, దేశద్రోహులు పై పెట్టాల్సినంటి కేసుల్ని అప్పలరాజు పై పెట్టారు, నిజమైన రౌడీలు బయట హల్చల్ చేస్తున్నారన్నారు.దీన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. తక్షణమే అప్పలరాజుపై పిడి యాక్ట్ రద్దుచేసి బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలతో పోరాటాలు ఆపలేరు అన్నారు, ఎంత నిర్బంధం విధిస్తే ప్రజా పోరాటాలు పుట్టుకొస్తాయని ఆ విషయం చంద్రబాబు నాయుడు గుర్తించాలని అన్నారు. సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కే.లోకనాథం మాట్లాడుతూ అప్పలరాజు పై పెట్టిన పీడీ యాక్ట్ ను రద్దుచేసి,విడుదల చేయకపోతే ప్రజా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, అల్లు రాజు,చిరంజీవి, సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎల్ గౌరీ, కె వి సూర్యప్రభలు పాల్గొన్నారు.

## పల్లె పండుగ 2.0 లో భాగంగా కశింకోట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం..

**ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు, పీల గోవింద సత్యనారాయణ**



**కశింకోట, డిసెంబర్ 27 మనసులో మాట..** అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రివర్యులు స్థానిక అనకాపల్లి కొణతాల రామకృష్ణ తెలిపారు. మండలంలోని పల్లె పండుగ 2.0 లో భాగంగా ఉపాధి హామీ నిధులతో తీడ,కన్నూరుపాలెం గ్రామాల్లో నిర్మించనున్న సుమారు రూ.కోటి రూపాయలు సీసీ రోడ్లుకు భూమి పూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ జగదీశ్వరరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర,మండల టీడీపి అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ అజెండా అని చెప్పారు. రోడ్ల అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్నీ అమలు చేస్తున్నామన్నారు. ఉచిత బస్సు సౌకర్యం, రైతు భరోసా, పింఛన్ల పెంపు కార్యక్రమాలు ఇప్పటికే అమలు చేశామని గుర్తుచేశారు. సంక్రాంతి అనంతరం అర్హులకు గృహాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అనకాపల్లి నియోజకవర్గంలో అభివృద్ధికి అధిక నిధులు తీసుకుని రావడం జరుగుతుందన్నారు.గత వైసీపీ ప్రభుత్వం అప్పులు చేస్తే మేము అభివృద్ధి చేసి చూపిస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల టీడీపి అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణ మూర్తి, జిల్లా తెలుగు పార్టీ ఉప అధ్యక్షుడు కాయల మురళీధర్, కశింకోట పిఏసీస్ అధ్యక్షుడు సిదిరెడ్డి శ్రీనివాసరావు,మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపికృష్ణ, ఎన్టీఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఉల్లింగల రమేష్, మాజీ ఎంపీపీ కుంద్రపు రాము నాయుడు,కూటమి నాయకులు కుంద్రపు అక్కు నాయుడు, ఏం.ఎస్.ఎన్.చిరికి సన్యాసి నాయుడు,చూచుకొండ దుర్గా ప్రసాద్, కాంద్రేగుల సతీష్,కర్రి సత్యనారాయణ, దాడి నాగ రాజు, దొడ్డి నాగేశ్వరరావు,పంచాయతీ రాజ్ డీ.ఈ వేణుగోపాల్, మండల ప్రత్యేక అధికారి సుభాషిని, ఎంపీడీఓ చంద్ర శేఖర్ రావు, తహసిల్దార్ తిరుమలరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.







## టిడిపిలో40 మందికి ప్రశంస పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే బండారు

**వి మాడుగుల డిసెంబర్ 27 (మనసులో మాట)..** మాడుగుల నియోజవర్గం కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మాడుగుల మరియు చీడికాడ మండలాలకి సంబంధించి ఉత్తమ కార్యకర్తలుగా ఎంపిక కాబడిన 40 మందికి ప్రశంసా పత్రాలు మాడుగుల నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బండారు సత్యనారాయణమూర్తి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు గవిరెడ్డి రామానాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు , పెద్దారు జలాశయం చైర్మన్ అద్దెపల్లి జగ్గారావు, కింతలే పిఎసిఎస్ అధ్యక్షులు మరియు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉండూరు దేవుడు టిడిపి పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీనారాయణ, మాడుగుల మరియు చిడికాడ మండల ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి షియాజ్ ఖాన్



నర్సీపట్నం రూరల్, డిసెంబర్ 27, ( మనసులో మాట) : నర్సీపట్నం సివిల్ జడ్జి ( సీనియర్ డివిజన్) పి షియాజ్ ఖాన్ శనివారం నర్సీపట్నం సబ్ జైలును సందర్శించారు. సబ్ జైలులోని ఖైదీలతో ఆయన మాట్లాడి వారి సాధక బాధకాలు అడిగి తెలుసుకున్నారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు రెగ్యులర్ గా వస్తున్నారా? మంచి భోజనం అందిస్తున్నారా? ఇక్కడ వసతులు ఏ విధంగా ఉంటున్నాయి అనే విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. కేసు వాదించడానికి లాయర్ ను పెట్టుకునే స్తోమత లేని వారు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కి తెలియజేస్తే ఉచితంగా లాయర్ ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఖైదీలకు అందించే ఆహారాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హిందూధర్మ పరిరక్షణ కోసం హిందువులు ఐక్యం కావాలి

**- తిమ్మాపురంలో జై శ్రీరామ్ నినాదాలుతో ర్యాలీ**

**- హిందువులంతా బంధువులే**





**ఎస్. రాయవరం, డిశంబర్ 27,(మనసులో మాట):** హిందూధర్మపరిరక్షణ కోసం ప్రతి హిందూవు కృషిచేయాలని, పరాయి మతస్తుల ప్రలోభాలుకు లొంగవద్దని భద్రాచలం వారాహి పీఠాధిపతి స్వామి అరుణానంద పిలుపునిచ్చారు. ఎస్. రాయవరం మండలం తిమ్మాపురం గ్రామంలోని శరణ్య వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా భజనలు, కోలాటాలుతో జై శ్రీరామ్ నినాదాలుతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిఅరుణానంద అనుగ్రహభాషణం చేస్తూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంద ఏళ్ళు పూర్తి చేసుకున్న సుదర్భంగా హిందూసమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా, సేవే లక్ష్యంగా సనాతానధర్మపరిరక్షణ కోసంపనిచేస్తున్న సంస్థ అర్ ఎస్ ఎస్ అన్నారు. ఇటువంటి సంస్థ వందేళ్ళుపూర్తి చేసుకుందని ఆయన అన్నారు. ప్రతి హిందువుబంధువేనని, భారతదేశంలో జన్మించిన వారంతా ఎదో ఒక సమయంలో బంధువులేనన్నారు.రాబంధువులు అయిన కొంత మందిపరాయి మతస్తులు ప్రలోభాలుకు గురికావద్దని కోరారు. పెళ్ళిలేకుండానే బొట్టు, పూలు, అలంకరణ లేని మిషనరీ చదువులుపట్ల పిల్లలు ను దూరంగా ఉంచాలన్నారు. వేదపాఠశాలలు, అనేక విద్యాసంస్థల లోచదివినవారంతా ప్రముఖులు గుర్తింపు పొందారన్నారు. దేవుడు ఒక్కడేనని అవసరాన్నిబట్టి రూపాన్ని మార్చుకోవల్సివచ్చిందన్నారు. దీనిని కొంతమంది రోజుకొక దేవుడుగా విమర్శలు చేయటంఅవివేకమన్నారు. పరాయి మతాలను విమర్శించటం తమ అభిమతం కాదని, ప్రలోభాలుతో మతమార్పిడి కి ప్రచారంచేసేవారికితగిన గుణపాఠంచెప్పాలన్నారు. ఈ సమావేశంలో విశ్వనాధ శర్మ మాట్లాడుతూ హిందూధర్మ విశిష్ఠత ను వివరించారు. ఈ కార్యక్రమం లోమండల బిజెపి అధ్యక్షుడు బాదంపల్లిజోగినాయుడు, అర్ ఎస్ ఎస్ ప్రతినిధులు రాపర్తి సత్యనారాయణ, చిట్టిబాబు తోపాటు శర్మ, అబద్ధం, రామకృష్ణ, ధర్మారావు, వెంకటరమణ, సూర్యారావు,అప్పారావు, రవిరాజు, తాతాజీ, గున్నావెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి




**ఎస్. రాయవరం, డిశంబర్ 27 (మనసులో మాట):** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యం తో ఎ పి నైపుణ్యాభివృద్ధి సంస్థ జాబ్ మేళాలు నిర్వహిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎపి నైపుణ్యాబివృద్ధి సంస్థ జిల్లా మేనేజరు గోవిందరావు కోరారు. ఎస్. రాయవరం మండలం అడ్డురోడ్డులోని ఎస్ వి ఎస్ డిగ్రీ కళాశాలలో శనివారంఏర్పాటుచేసిన జాబ్ మేళాను స్థానిక కూటమినేతలు తో కలిసి ఆయన ప్రారంభించారు. ఏడాదికాలంలో పాయకరావుపేట నియోజకవర్గం లో నాలుగు జాబ్ మేళాలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనరు కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ హెూంమంత్రి అనిత కృషి తో ఇప్పటివరుకు నాలుగుజాబ్ మేళాలు నిర్వహించామన్నారు.వచ్చిన అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతిభ ఉన్న వారు ఉన్నత అవకాశాలను పొందవచ్చునన్నారు. నిరుద్యోగులు ఎసిలో పనిచేసే ఉద్యోగాలుకోసం ఎదురుచూడవద్దని వచ్చిన అవకాన్ని వినియోగించుకోవాలన్నారు. గతంలోజరిగిన మేళాలో ఎంపికైన అర్హులు ఎవ్వరూ ఉద్యోగాలలో చేరలేదన్నారు. మహిళలు ఉద్యోగులు చేసేందుకు పోటీపడ్తున్నారన్నారు. మండల టిడిపిఅధ్యక్షుడు అమలకంటి అబద్ధం మాట్లాడుతూ జాబ్ మేళానిర్వహణకు సహకరించిన ఎస్ వివిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ రాపర్తిరామును అభినందించారు. ఈ కార్యక్రమం లో ఎం పిపి వెంకట లక్ష్మి, జెడ్పీటిసి కాకర దేవి, డాక్టర్ వీరభద్రరావు,కోరుప్రోలు పి ఎ సి ఎస్ చైర్మన్ జి. రామకృష్ణ
టిడిపి నేతలు వెంకట్రాజు, నూకరాజు, నరసింహ మూర్తి, లక్ష్మణరావు, లోవరాజు, జనసేన నాయకుడు శివ, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాపర్తి రాము,కళాశాల సిబ్బంది, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 24 మందికి18,32,066 విలువ చేసి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే




**వి మాడుగుల డిసెంబర్ 27 (మనసులో మాట)** మాడుగుల నియోజకవర్గ కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మాడుగుల మరియు చీడికాడ మండలంకి సంబంధించిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మాడుగుల నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ బండారు సత్యనారాయణమూర్తి అందజేయడం జరిగింది. మాడుగుల మండలంకి సంబంధించిన 19 మంది బాధితులకు 15,37,318 రూపాయల చెక్కులను, చీడికాడ మండలానికి సంబంధించిన 5 మంది బాధితులకు 2,94,748 రూపాయల చెక్కులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు శ్రీ గవిరెడ్డి రామానాయుడు మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పెద్దేరు జలాశయం చైర్మన్ అద్దిపల్లి జగ్గారావు, కింతలి పిఎసిఎస్ అధ్యక్షులు మరియు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉండూరు దేవుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు నందారపు సన్యాసిరావు, సీనియర్ నాయకులు బుద్దాల రవణ,మాడుగుల మండల ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# కొవ్వూరు అంగన్వాడీలో ఈసీసీఈ డే..



**రోలుగుంట మనసులో మాట, డిసెంబర్ 27..** అనకాపల్లి జిల్లా రోలుగుంట, మండలం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రోలుగుంట మండలం ఐసిడిఎస్ రావికమతం ప్రాజెక్టు బుచ్చంపేట సెక్టార్లోని కొవ్వూరు గ్రామ అంగన్వాడీ సెంటర్-2లో ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే (ఈసీసీఈ డే) ఘనంగా జరిగింది. ప్రీస్కూల్ పిల్లలకు, తల్లులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు పుస్తకాలు, ఆటలు, ప్రీస్కూల్ పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య 1, 2కి సంసంబంధించిన పుస్తకాలు, ఆటలు వస్తువులు అందజేశారు. ప్రతిరోజూ ఆటపాటల మధ్య విద్యను అందించే విధంగా క్రియల ద్వారా అభ్యాసాలు చేపట్టాలని తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమం పిల్లల సృజనాత్మకత, మానసిక, శారీరిక అభివృద్ధిని పెంచుతుందని కొవ్వూరు మహిళా పోలీసు వరలక్ష్మి తెలిపారు. తల్లులకు, పిల్లలకు వేర్వేరుగా ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. ఐసిడిఎస్ కార్యక్రమాలు గ్రామీణ పిల్లల విద్యా అభివృద్ధికి దోహదపడుతున్నాయని స్థానికులు స్వాగతించారు. అనకాపల్లి జిల్లాలో ఐసిడిఎస్ కింద ఈసీసీఈ కార్యక్రమాలు రోలుగుంట మండలం అన్ని గ్రామాలలో సూపర్వైజర్లు ఎస్కే బేగం, హేమ ఆధ్వర్యంలో విస్తృతంగా చేయబడుతున్నాయి. ఇలాంటి స్థానిక కార్యక్రమాలు ప్రీస్కూల్ విద్యను బలోపేతం చేస్తున్నాయి. మరిన్ని గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు జరపాలని నిర్వాహకులు కోరారు.

# ఘనంగా ఉరుకూటి జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలియజేసిన గాజువాక నియోజకవర్గం వైఎస్ఆర్ సిపి నాయకులు,కార్యకర్తలు



**గాజువాక (మనసులో మాట)డిసెంబర్ 27..** వైయస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఉరుకూటి అప్పారావు జన్మదిన సందర్భంగా వారి నివాసంలో అభిమానులు కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా 66వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్,72వ వార్డు వైఎస్ఆర్ సిపి ఇన్చార్జ్ సిరట్ల శ్రీనివాస్,65,66,70,76 వార్డు ప్రెసిడెంట్లు మద్దాల అప్పారావు,పెదిరెడ్ల ఈశ్వర్రావు,కొణతాల రాము,మంత్రి శంకర్ నారాయణ,87 వ వార్డు వైఎస్ఆర్ సిపి నాయకులు ప్రగడ వేణుబాబు,ఇల్లపు రాము,85వ వార్డు నాయకులు బోర సోమ నాయుడు,64 వ వార్డు నాయకులు పేర్ల నూకరాజు,ఓలేటి నూకరాజు,బి హె చ్ పి వి ఐ ఎన్ టీ యూ సి కార్యదర్శి ఉరుకూటి బాబురావు,నాయకులు కుప్పిలి సత్యనారాయణ,రెహమాన్,చట్టి తాతారావు,ఉరుకూటి కనక రాజు,పాలఘాట్ కృష్ణ,ఆనార్ బాబు,డేవిడ్ కింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో వైయస్సార్ సీపీ కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# అప్పలరాజు పై పీ.డి. యాక్ట్ ను రద్దుచేసి విడుదల చేయాలి

### - రౌండ్ టేబుల్ సమావేశం, అనంతరం నిరసన





**మునగపాక, డిసెంబర్ 27, మనసులో మాట..** సిపిఎం పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. అప్పలరాజు పై పి.డి. యాక్టు(ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ ) పెట్టీ అక్రమ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మునగపాక పి ఏ సి ఎస్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమకారులపై పిడి యాక్ట్ ను ప్రయోగించి అక్రమ నిర్బంధం చేయటం అన్యాయమని, రాజ్యాంగ హక్కులను హరించే విధంగా ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వ వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. ప్రజా పోరాటాలపై నిర్బంధాలు ప్రయోగిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే పిడి యాక్టర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా నక్కపల్లి ప్రాంతంలో ప్రభుత్వం చేపట్టిన బలవంతపు సేకరణ వ్యతిరేకంగా అప్పలరాజు అనేక పోరాటాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్రపూరితంగా ప్రభుత్వం ఆయనపై కేసులు బనాయించిందన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ అనుమతులు రద్దు చేయాలని , ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న సిపిఎం నాయకునిపై పీడీ యాక్ట్ లాంటి చర్య అమానుషం, అప్రజాస్వామికం. తక్షణం ఆయన పై పెట్టిన కేసులు రద్దుచేసి విడుదల చేయాలని డిమాండ్ చేసారు. మండలం సిపిఎం నాయకులు ఎస్ బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె.సురేష్ , బాలు గాడి, , నిర్వాసితుల సంఘం నాయకులు కె సదాశివరావు లు వహాట్లా డారు. ప్రజానాట్యమండలి నాయకులు ఎస్ కన్నుమనాయుడు, కె సంజీవరావు, ఎ.శివ, ఆడారి రమణ తదితరులు పాల్గొన్నారు.



## 30న శ్రీ క్షేత్రంలో ఉత్తర ద్వార దర్శనం

విజయనగరం (మనసులోమాట ):డిసంబర్27:: ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రం లో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 30వ తేదీ మంగళవారం నాడు ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 5 గంటల నుండి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నామని దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ ఉమాదేవి దంపతులు పేర్కొన్నారు .ఈరోజు ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సప్త ద్వారా దర్శనాన్ని చేసుకొని భక్తులు భగవంతుని అనుగ్రహం పొందాలని కోరారు .ఈనెల 28వ తేదీన అష్టలక్ష్మి దేవాలయంలో భగవద్గీత హెూమం నిర్వహిస్తున్నామని హిందూ ధర్మ రక్షా సమితి రాష్ట్ర కార్యదర్శి నందివాడ వేణుగోపాల్ పేర్కొన్నారు .అనంతరం మదన్ గుప్తా చే ఆధ్యాత్మిక ప్రవచనం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## జనవరి 5 న జరిగే గ్రామసభల్లో చెత్త, వ్యర్థాలులేని గ్రామంగా తీర్మానం చేయాలి



**ఎస్. రాయవరం, డిశంబర్ 27,(మనసులో మాట):** ఎస్.రాయవరం. మండలంలోని గ్రామపంచాయితీలలో జనవరి అయిదవ తేదీన గ్రామసభలు నిర్వహించాలని, ఈ సభలో చెత్త, వ్యర్థాలు లేని గ్రామ పంచాయితీ గా తీర్మానం చేయాలని డిప్యూటీ ఎంపిడిఓ బి. సత్యనారాయణ అన్నారు. అన్ని గ్రామ పంచాయితీలపరిధిలో జనవరి నాలుగవ తేదీ వరుకు పారిశుద్ధ్య పనులు చెయాలని సూచించారు. శనివారం దార్లపూడి,భీమవరం, ధర్మవరం,ఎస్. రాయవరం గ్రామ పంచాయతీలలో అమలు జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను డిప్యూటీ ఎంపిడిఓ పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని, రోడ్లకు ఇరువైపుల ఉన్న చెత్త కుప్పలు తక్షణమే తొలగించాలని సూచించారు. మండలంలో గల 28 గ్రామ పంచాయతీలకు గాను ప్రస్తుతం 26 గ్రామ పంచాయతీలలో సంపద తయారీ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని వీటన్నింటిని పూర్తి స్థాయిలో ప్రాసెసింగ్ లోకి తీసుకు వస్తామని, సంపద కేంద్రాలలో ఉన్న మొత్తం కంపోస్ట్ తయారుచేసే ట్యాంకులు, వర్మీ ట్యాంకులు ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

## సంక్రాంతి పండుగ ముందస్తు ప్రభావం

### హుకుంపేట సంతలో కోళ్లకు భారీ గిరాకీ



**హుకుంపేట డిసెంబర్ 27 (మనసులు మాట)..** హుకుంపేట మండలంలో శనివారం నిర్వహించిన వారసంతలో సంక్రాంతి పండుగను ముందుగానే దృష్టిలో ఉంచుకుని కోళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. పండుగ సమీపిస్తుండటంతో సంతకు వచ్చిన ప్రజలు కోళ్ల కొనుగోలుపై అధిక ఆసక్తి చూపారు. కేజీ నుంచి రెండు కేజీల వరకు బరువున్న కోడులు ఒక్కోటి రూ.800 నుంచి రూ.1000 వరకు ధర పలకడంతో వ్యాపారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ, పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ కొనుగోలుకు ఆసక్తి చూపడంతో సంతలో సందడి నెలకొంది.
సంక్రాంతి పండుగకు ఇంకా కొన్ని రోజులు ఉన్నప్పటికీ, ముందుగానే కొనుగోళ్లు చేయడంతో రానున్న రోజుల్లో కూడా కోళ్లకు డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు తెలిపారు.



## విజయరామరాజుపేట శ్రీ గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న ఏపీయుఎఫ్ఐడిసి చైర్మెన్ పీలా గోవింద

**అనకాపల్లి, డిసెంబర్ 27 (మనసు లో మాట):** అనకాపల్లి పట్టణం లోని విజయరామరాజుపేట శ్రీ గౌరీ పరమేశ్వరులను శనివారం రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి నియోజవర్గం టిడిపి ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర దర్శించుకున్నారు. విజయరామరాజు పేట శ్రీ గౌరీపరమేశ్వరుల మహెూత్సవం సందర్భంగా స్వామి వారిని వారు దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని సత్కరించారు.ఈ కార్యక్రమంలో 82 వ వార్డు టీడీపీ ఇంచార్జి పొలవరపు త్రినాథ్, ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్, ఉత్సవ కమిటీ చైర్మన్ ఆళ్ళ రామచంద్రరావు, వార్డు టీడీపీ ప్రెసిడెంట్ దాడి జగన్, టీడీపీ నాయకులు ఆకుల నానాజీ, బొమ్మల దేవి,కొయిలాడ గణేష్, భానుచంద్ర (అఖిల్), మణికంఠ, దొడ్డి శ్రీను, దాడి శ్రీను, టీడీపీ శ్రేణులు, ఆలయ కమిటీ సభ్యులు, విజయరామరాజుపేట సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సౌర విద్యుత్ జనవరి మొదటివారంలో అమలుకు కలెక్టర్ ఆదేశం



**విజయనగరం. (,మనసులో మాట )డిసెంబరు 27 :** ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో భాగంగా, జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలకు చెందిన కుటుంబాలకు ఉచితంగా సౌర విద్యుత్‌ను అందించే పథకాన్ని జనవరి మొదటి వారంలో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. అర్హులైన ప్రతి ఇంటిపై రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ ఫలకాలను ప్రభుత్వం ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగా ఏర్పాటు చేయనుందని, దీనిని లబ్దిదారులకు త్వరితగతిన అందజేయాలని సూచించారుఈ పథకం అమలుపై జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ఎపిఈపిడిసిఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావుతోపాటు సంబంధిత సంస్థల ప్రతినిధులతో శనివారం తమ ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనులను వేగవంతం చేసి, 2026 జనవరి మొదటి వారంలోనే మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు మరియు ఇతర ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకం ద్వారా వేల కుటుంబాలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గి, శాశ్వత ప్రాతిపదికన వెలుగులు నిండనున్నాయి.

**పథకం వివరాలు :** జిల్లా వ్యాప్తంగా విభాగాల వారీగా పనుల కేటాయింపు పూర్తయింది. బొబ్బిలి విభాగంలో 3,948 ఇళ్లకు (ఎస్సీ 2,764, ఎస్టీ 1,184), -మెస్సర్స్ ప్రష ఎనర్జీ కన్సల్టింగ్. చీపురుపల్లి విభాగంలో 1,326 ఇళ్లకు (ఎస్సీ 926, ఎస్టీ 397), -మెస్సర్స్ రాక్‌లాండ్ ఇండస్ట్రీస్ విజయనగరం గ్రామీణ విభాగంలో అత్యధికంగా 5,410 ఇళ్లకు (ఎస్సీ 3,787, ఎస్టీ 1,623) పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. -మెస్సర్స్ సద్భవ్ ఫ్యూచర్‌టెక్ లిమిటెడ్. విజయనగరం పట్టణ విభాగానికి సంబంధించి 2,869 ఇళ్లకు (ఎస్సీ 2,686, ఎస్టీ 184) టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం పరిశీలనలో ఉంది.

# అడవితల్లి బాట కార్యక్రమం

### నూతన బీట్ రోడ్డు శంకుస్థాపన చేసిన సియ్యారి దొన్నుదొర



**హుకుంపేట డిసెంబర్ 27 (మనసులో మాట)...** హుకుంపేట మండలంలోని పాతకోట పంచాయతీ పాలెం నుండి పెద్ద చెట్టు గ్రామం వరకు నూతన బిట్ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అరకు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, ఆర్టీసీ విజయనగరం రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 2.5 కిలోమీటర్ల పొడవుతో, రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ రోడ్డును అడవితల్లి బాట కార్యక్రమం కింద చేపడుతున్నారు. సియ్యారి దొన్నుదొరతో పాటు జనసేన అరకు నియోజకవర్గ ఇంచార్జ్ శెట్టి చిరంజీవి సంయుక్తంగా కొబ్బరి కాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమవుతోందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో గిరిజన ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యాలు కల్పించడం సాధ్యమైందన్నారు. గతంలో రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వాటికి నేడు ప్రభుత్వం పరిష్కారం చూపుతోందని చెప్పారు.
గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపనలకే పరిమితమయ్యారని విమర్శించిన ఆయన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో గిరిజన ప్రాంత అభివృద్ధికి వేగం పెరిగిందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని గ్రామాలకు రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గిరిజన ప్రజల తరఫున ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ జీసీసీ చైర్మన్ శెట్టి లక్ష్మణుడు, అరకు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సూర్యకాంతం, ఉపాధ్యక్షురాలు సాగర సత్యవతి, హుకుంపేట మండల అధ్యక్షుడు శతక బొంజుబాబు, మాజీ మండల అధ్యక్షుడు కొర్ర తులసీరావు, సర్పంచ్ బాకూరు వెంకటరమణ, అందిబ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పాడి బాలన్న, మండల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు, ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యామ్ సుందర్, ఉపాధ్యక్షుడు లకే నాగేశ్వరరావు, టీఎన్ఎస్ఎఫ్ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు పట్టిబోయిన శంకర్‌నాయుడు, ఎస్టీ సెల్ నాయకులు కొర్ర సంతోష్‌కుమార్, పాలసీ అప్పారావు, కొర్ర వాసుదేవ్, పిసిసి చైర్మన్ మోహన్ దాస్ గ్రామ కమిటీ అధ్యక్షులు సాంబే బాబురావు, పాతకోట గ్రామ కమిటీ అధ్యక్షుడు కొర్ర నర్సింగరావు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



# 31 న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**

**అనకాపల్లి, డిసెంబర్ 27(మనసు లో మాట):** ఎన్టీఆర్ సామాజిక భద్రతా భరోసా పింఛన్ల ను నూతన సంవత్సరం 2026 సందర్భంగా ఒకరోజు ముందుగానే ఈనెల 31 న పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 31 న ఉదయం 6 గంటల నుంచే జిల్లాలో అన్ని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా లబ్ధిదారులకు పింఛన్లను అందజేస్తార న్నారు. ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేందుకు డిసెంబర్ 30న అవసరమైన నగదు డ్రా చేసేందుకు చర్యలు తీసుకోవాలని డి.ఆర్.డి.ఎ.ప్రాజెక్ట్ డైరెక్టర్ శచి దేవి, గ్రామ వార్డు సచివాలయాల సమన్వయ అధికారి మంజులవాణి లను ఆదేశించామన్నారు. పెన్షన్ లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలియజేశారు.

# విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- వాడ్రాపల్లి హై స్కూల్ విద్యార్థులకు డి సి బి పుస్తకాలు పంపిణీ
- మండల టిడిపి నాయకుడు మల్ల రాజేష్ ఆర్థిక సహాయంతో



**మునగపాక, డిసెంబర్ 27, మనసులో మాట..** ఎలమంచిలి నియోజవర్గం మునగపాక మండలం వాడ్రాపల్లి గ్రామంలో శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఆదేశాలతో వాడ్రాపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ లో పదవ తరగతి విద్యార్థులకు డి.సి.బి .ఈ , బుక్స్ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మల్ల రాజేష్ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎలమంచిలి నియోజకవర్గ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు మంచి సూచనలు సూచించి ఈ బుక్స్ ద్వారా బాగా చదువుకొని మంచి ర్యాంక్స్ సంపాదించుకొని మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు సూచించారు. అలాగే స్కూల్ 60 లక్షల వేచ్చించి స్కూలు కట్టిన దానికి రోడ్డు మార్గం లేకపోవడం చేత తక్షణమే రోడ్డు అవసరం ఉన్నదని తెలుసుకొని మన శాసనసభ్యులదృష్టికి తీసుకువెళ్తానని మాట ఇవ్వడం జరిగినది. అలాగే కూటమి నాయకులు,జనసేన మండల పార్టీ అధ్యక్షులు, టెక్కలి పరశురాం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దాడి ముసలి నాయుడు, మునగపాక జనసేన నాయకులు ఆడారి గణేష్, వాడ్రాపల్లి ఉపసర్పంచ్ మాజీ గుబ్బల సత్యనారాయణ, జనసేన నాయకులు సూరిశెట్టి శివ , జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు కాండ్రేగుల రాము , ఆడారి భాస్కర రావు , కొయిలాడ పరుశురాం , పల్ల సన్యాసిరావు ,స్కూల్ మాస్టర్స్ సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**దేవరాపల్లి, డిసెంబర్ 27, (మనసులో మాట) :** మండలంలోని ములకలాపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన షేక్ ఈశ్వరమ్మ కుటుంబాన్ని జనసేన మండల పార్టీ అధ్యక్షులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు పరామర్శించారు. ప్రమాద బాధితులకు గొర్రుపోటు రామ్మూర్తి నాయుడు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు ముర్రు ఈశ్వర్ 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. జనసేన మండల ఉపాధ్యక్షులు ఇంటి సురేష్ నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు తమరాన సూరిబాబు, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ చామంతుల వెంకన్న దొర, స్కూల్ కమిటీ చైర్మన్ చామంతులు జగ్గారావు , జనసేన సీనియర్ నాయకులు గొర్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వార్తల్లో విశ్వసనీయత ఉంటేనే విలువ

**- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు**



**గాజువాక(మనసులో మాట)డిసెంబర్ 7...** ఎస్సీఆర్డబ్ల్యూఏ గాజువాక యూనిట్ సభ్యులకు డైరీలు, స్వీట్లు పంపిణీ చేశారు.

పాత్రికేయులు రాసే వార్తలు విశ్వసనీయత ఉండాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే వార్తలను ప్రజలు విశ్వసిస్తారని ఆయన చెప్పారు. వార్తల్లో విశ్వసనీయత కోల్పోతే పాత్రికేయుడు లేదా ఆ సంస్థకు విలువ తగ్గిపోతుందని ఆయన హెచ్చరించారు. నూతన సంవత్సర ఆగమనాన్ని పురస్కరించుకుని స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గాజువాకలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్సీఆర్డబ్ల్యూఏ డైరీ - 2026 ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ నిజమైన వార్తలను అందించాలని ఆయన సూచించారు. తప్పుడు వార్తలు సమాజం పై తీవ్ర ప్రభావం చూపిస్తాయని ఆయన ఆందోళన అన్నారు. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభం గా ఉన్న పాత్రికేయులు సమాజానికి వెన్నుముక గా నిలవాలని పిలుపు నిచ్చారు. ఆ దిశగా స్మార్ట్ సిటీ రిపోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేయాలని సూచించారు. పారిశ్రామిక కేంద్రానికి కేంద్ర బిందువుగా ఉన్న గాజువాకలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. స్మార్ట్ సిటీ రిపోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్ మాట్లాడుతూ గడచిన దశాబ్ద కాలంగా పాత్రికేయుల సంక్షేమం కోసం తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం సహా పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తూ విలువలతో కూడిన పాత్రికేయులు తయారు చేయడంలో ముఖ్య భూమిక పోషిస్తున్నట్లు అశోక్ చెప్పారు. అనంతరం ఎస్సీఆర్డబ్ల్యూఏ గాజువాక యూనిట్ సభ్యులకు అతిథులు చేతుల మీదుగా డైరీలు ,స్వీట్లు పంపిణీ.. అనంతరం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును అసోసియేషన్ సభ్యులు దుస్సాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డైరెక్టర్, గాజువాక టీడీపీ ఇంచార్జి ప్రసాదుల శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు దీనకొండ కృష్ణంరాజు ,గాజువాక టీడీపీ మహిళ ఉపాధ్యక్షురాలు కోరుకొండ పద్మ, స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి కర్రి సత్యనారాయణ (సత్య), ఉపాధ్యక్షురాలు శిరీష, సెక్రెటరీ వసంత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

# తల్లికి తెలియకుండా తల్లి ఆస్తి కాజేత!?



**చీడికాడ. డిసెంబర్ 27, (మనసులో మాట)..** కన్నతల్లికి తెలియకుండా ఆస్తి మొత్తం కాల్ చేసి విక్రయించిన ఘనుడిపై తల్లితో పాటు అక్క చెల్లెల్లు శనివారం చీడికాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులు విలేకరులకు లిఖితపూర్వకంగా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చీడికాడ మండలంలోని చెట్టు పల్లి గ్రామానికి చెందిన పాతాళం వరహాలమ్మకు ఐదుగురు సంతానం కాగా నలుగురు ఆడపిల్లలు ఒక కుమారుడు, పిల్లలు చిన్నతనంలోనే వరహాలమ్మ భర్త చనిపోవడంతో తనుకున్న సుమారు 10 ఎకరాల సాగు భూమి సాగు చేసుకుంటూ పిల్లల్ని పోషించానని తెలిపారు. తన కుమారుడు తూర్పుగోదావరి జిల్లా ఏలూరు ప్రాంతానికి 20 ఏళ్ల క్రితం వెళ్లిపోయి అక్కడే ఉంటూ జీవిస్తున్నాడు అన్నారు. అయితే ఇటీవల కాలంలో ఎప్పుడు వచ్చాడో తెలియదు కానీ వరహాల మార్చుకొని ఆస్తిపాస్తులు తన పేరున పెట్టుకున్నారని ఇటీవల కాలంలో తెలిసి చీడికాడ తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు సైతం చేశానన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో 2025 నవంబర్లో తన కుమారుడు సాగు భూమిని తూర్పుగోదావరి జిల్లా ఏలూరు గ్రామానికి చెందిన వ్యక్తికి విక్రయించాడని ఆ విషయం తెలిసి అధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. తన పేరు మీద ఉన్న భూమిని కుమార్తెలకు సైతం ఇవ్వాల్సి ఉండగా ఎవరికి ఇవ్వకుండా ఒక్కరే కాజేయాలని చూస్తున్నారని తనకు తెలియకుండా తన (కుమారుడి)పేరును మార్చుకొని విక్రయించడంతో తన భవిష్యత్తు అంధకారమైందని తన అనుమతి లేకుండా తనకు తెలియకుండా భూమిని విక్రయించిన తన కుమారుడిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా చీడికాడ పోలీస్ స్టేషన్లో శనివారం సాయంత్రం ఫిర్యాదు చేసినట్లు ఆమె విలేకరులకు తెలిపారు.

# ఘనంగా కుంచావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవం

**- గౌరమ్మ ను దర్శించుకున్న దాడి రత్నాకర్**



**అనకాపల్లి, డిసెంబర్ 27 (మనసులో మాట):** శతాబ్దన్నర చరిత్ర కలిగిన అనకాపల్లి కుంచావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. పట్టణ ప్రముఖులు పలువురు గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ముందు గా టిడిపి రాష్ట్ర కార్యానిర్వహక కార్యదర్శి దాడి రత్నాకర్ గౌరమ్మ ను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అంతకుముందు ఉత్సవ కమిటీ సభ్యులు రత్నాకర్ కు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతంలో 150 సంవత్సరాలు చరిత్ర కలిగిన కుంచావారి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం ప్రతి ఏటా వలె ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నందుకు నిర్వహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎం వీరభద్రరావు (ఆబ్బులు), కర్రీ కృష్ణ, పండగకి సత్యారావు, కోరుకొండ సాంబశివరావు, కొమ్మోజు రామకృష్ణ, పాలూరి శ్రీనివాసరావు, బోయిన చిన్న మణికంఠ, అంగిన రేవంత్, కుంచా దివాకర్, ఎస్. గణపతి, పలకా శేఖర్, బొడ్డపాటి చిన్న రాజారావు, యల్లపు శ్రీనివాస్, కోటిపల్లి శ్రీను, పలకా కాసులు, ఎం. రమణబాబు, ఆడారి రవికుమార్, నందవరపు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులను ఖండిస్తూ గాజువాకలో మహా ప్రదర్శన

**- ఖబడ్దార్ బంగ్లాదేశ్ అంటూ నినాదాలు**



**గాజువాక (మనసులోమాట) డిసెంబర్ 27..** బంగ్లాదేశ్‌లో హిందువులపై పెరుగుతున్న దాడులను ఖండిస్తూ విహెచ్పి,భాజపా, ఆరెస్సెస్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో గాజువాకలో మహా ప్రదర్శన చేపట్టి దాడులను ముక్త కంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో దీపు చంద్రదాస్, అమృత్ మండల్ హత్యలతో సహా హిందువులపై జరిగిన దారుణాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. బంగ్లాదేశ్ లో తరచూ ఇటువంటి దాడులు జరగడం బాధాకరమని అన్నారు. హిందువులపై దాడులను ఇకపై సహించబోమని హెచ్చరించారు. హిందువుల్లో చైతన్యం రావాల్సిన సమయం ఆసన్నమైంది అని పేర్కొన్నారు. ప్ల కార్డులు ప్రదర్శిస్తూ చిన్నారుల దగ్గర నుండి వృద్ధుల దాకా అంతా ముక్తకంఠంతో నినదించారు. పాత గాజువాక కూడలి నుంచి సినిమా హాలు జంక్షన్ వరకు ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసరావు,వీర్రాజు,సనాతన ధర్మ పరివార్ అధ్యక్షుడు సంతోష్, నాయకులు కృష్ణంరాజు, శంకరరావు, నాగబాబుశర్మ, కృష్ణారెడ్డి,ఆర్.ఎస్.ఎస్ గోపాలకృష్ణ, రంగనాయకులు, నాగేశ్వరరావు, బాస్కరబట్ల ప్రసాదశర్మ, కల్కీబాబా,పొలిమేర శ్రీనివాసరావు, బాబ్జి,పేర్ల అప్పారావు, శ్రీదేవి, పావని,సింగ్,రామారావు తదితరులు పాల్గొన్నారు.

# 29 న నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల బంద్ ను జయప్రదం చేయండి

**- ఆఖిలపక్ష ప్రజావేదిక, వామపక్ష పార్టీ లు పిలుపు**

**అనకాపల్లి, డిసెంబర్ 27 (మనసులో మాట):** సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు పై అక్రమంగా బనాయించిన పిడి చట్టం కేసు ను వెంటనే ఉపసంహరించి, వెంటనే విడుదల చేయాలని వామపక్ష పార్టీలు, అఖిలపక్ష ప్రజావేదిక డిమాండ్ చేస్తున్నాయి. ఆ ప్రాంత ప్రజా సమస్యలపై కృషిచేస్తున్న అప్పలరాజు పై తప్పుడు కేసులు బనాయించి చట్టవిరుద్ధంగా నిర్బంధించడాన్ని ఖండిస్తూ ఈనెల 29 న నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో బంద్ చేస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్. దొరబాబు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు లు ప్రకటించారు. ఈ మండలాల్లో వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, రవాణా, ట్రాన్సుపోర్టు, ప్రజలు సహకరించి బంద్ ను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ ప్రాంతంలో 15 సంవత్సరాలుగా నిర్వాసితులు, రైతులు, కార్మికులు, ప్రజల సమస్యలపై పనిచేస్తున్న సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేడిబోయిన అప్పలరాజు పై అక్రమంగా పిడి చట్టం పెట్టి బుధవారం విశాఖ సెంట్రల్ జైల్ కు తరలించారు. గుండాలు, దొంగలు, మాదకద్రవ్యాల నేరస్తులు, స్మగ్లర్లు, భూ కబ్జాదారులు, సైబర్, వైట్ కాలర్ నేరాలు, మహిళలు అపహరణకు పాల్పడుతున్న అరాచకశక్తులపై పెట్టవలసిన పిడి చట్టాన్ని దుర్వినియోగం చేసి ప్రజల సమస్యలపై నిబద్ధతతో పనిచేస్తున్న అప్పలరాజు పై ఈ పిడి చట్టం పెట్టారని అవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధమైనదని వెంటనే పిడి చట్టాన్ని బేషరత్తుగా ఉపసంహరించుకోవాలని వారన్నారు. ఎం.అప్పలరాజు ముఖ్యంగా నక్కపల్లి, రాయవరం ప్రాంతాల్లో భూములు కోల్పోతున్న పేద రైతులు, అసైన్డ్ భూములు సాగుచేస్తున్న దళిత, గిరిజన బలహీనవర్గాల వారికోసం, ఉపాధి కోల్పోయే వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు, ఇతర వృత్తిదార్ల ప్రయోజనాలు కోసం ప్రజాస్వామ్య యుతంగా, శాంతియుత పద్ధతుల్లో పోరాడుతున్నారు. ప్రజలను భయభ్రాంతులను చేసేందుకే అప్పలరాజు పై దుర్బుద్ధితో అక్రమ పిడి చట్టం కేసు నమోదు చేశారని స్పష్టం అవుతున్నందన్నారు. ఎం.అప్పలరాజు పై పెట్టిన అక్రమ పిడి యాక్టును ఉపసంహరించుకోని, విడుదల చేయాలని ఈనెల 29 న జరుగు బంద్ లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.



# బిజెపి తీర్థం తీసుకున్న బొద్దపు ఫ్యామిలీ

**మునగపాక, డిసెంబర్ 27, మనసులో మాట..** మునగపాక మండలం ఒంపోలు గ్రామంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డెడ నాగేశ్వరరావు మరియు మండల అధ్యక్షులు మల్ల కాళేశ్వరరావు ఆధ్వర్యంలో బోద్దపు హరినాథ్ వాళ్ళ ఫ్యామిలీ మరియు సుమారు 20 ఫ్యామిలీలు బిజెపి తీర్థం తీసుకున్నారు. బొద్ధపు హరినాథ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బిజెపి పార్టీ బలోపేతం కావడానికి కృషి చేస్తానని మరియు రాబోయే రోజుల్లో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయ కేతనం ఎగురవేసే దిశగా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బొడ్డేడ భాస్కరరావు, ఉమ్మలాడ సూపర్ సర్పంచ్ సూరిశెట్టి రామకృష్ణ, మండల మాజీ అధ్యక్షులు దొడ్డి సత్యనారాయణ,మండల ప్రధాన కార్యదర్శి భార్గవాచార్యులు, సూరిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అధ్యక్షుడికి వెల్లువెత్తిన శుభాకాంక్షలు



**దేవరాపల్లి, డిసెంబర్ 27, (మనసులో మాట) :** జిల్లా టిడిపి పార్టీ నూతన అధ్యక్షులుగా రెండోసారి ఎన్ని కాబడిన బత్తుల తాతయ్య బాబుకు శుభాకాంక్షలు వెల్లి వెత్తాయి. మండలానికి చెందిన టిడిపి నాయకులు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయం చైర్మన్ పోతల పాత్రు నాయుడు, బత్తుల తాతయ్య బాబు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి పదవిని అలంకరించినందుకు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు సాలువుతో సన్మానించి అభినందనలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు చామంతులు బాలు, ఎంపీటీసీ రెడ్డి బలరాం, సెక్రటరీ దొగ్గ దేవుడు నాయుడు, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు శరకాన సూర్యనారాయణ గ్రామ శాఖ అధ్యక్షుడు గుల్లిపల్లి అర్జున టిడిపి సీనియర్ నాయకులు సోమిరెడ్డి గోవింద, గంధం జగన్, మాజీ ఎంపిటిసి పెంటకోట అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, ఈశ్వరరావు, గుల్లిపల్లి మురళి,దీవి శంకర్, గొర్లి గోవింద తదితరులు ఉన్నారు.

# యునైటెడ పాస్టర్స్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు



దేవరాపల్లి, డిసెంబర్ 27, (మనసులో మాట) : జీసస్ సేవ్స్ మినిస్ట్రీస్ జీనబాడు మందిరంలో యునైటెడ్ పాస్టర్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగికులుగా నిస్సి మినిస్ట్రీస్ డైరెక్టర్ కాశీపురం టైటస్ గొర్లె, గ్రేస్ టైటస్ దంపతులు క్రిస్మస్ సందేశాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా రెవ . దేవరాజు అధ్యక్షత వహించారు. గ్రీటింగ్స్ పాస్టర్ జయరాజ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకమైన ఆరాధన దైవ సేవకురాలు గ్రేస్ టైటస్ శక్తివంతమైన ఆరాధన జరిగించారు. వేలాది మంది హాజరై దేవుని వాక్యాన్ని విన్నారు ఈ కార్యక్రమములో కొంతమంది సేవకులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వాసులు, యవనస్తులతో పాటు పాస్టర్ జేమ్స్ ,లాజరస్ తిమోతి, పాల్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పలరాజు అరెస్టు కు నిరసనగా 29 న మండల బంద్

**ఎస్. రాయవరం, డిశంబర్ 27,(మనసులో మాట):**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం అప్పలరాజును పిడి యాక్ట్ క్రింద అరెస్టు చేయాడాన్ని నిరసిస్తూ ఈనెల 29 వతేదీన ఎస్. రాయవరం, నక్కపల్లి మండలాల లో బంద్ నిర్వహించనుట్లు సిపిఎం మండలశాఖ అధ్యక్షుడు



ఎంసత్యనారాయణ తెలిపారు. బంద్ కు సంబంధించిన పోస్టర్లును శనివారం అడ్డరోడ్డులో అవిష్కరించారు. ఈ బంద్ ని జయప్రదంచేయాలంటూ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె లోకనాధం విజ్ఞప్తి చేసారు. ఎస్. రాయవరం మండలంలోని అభ్యుదయ వాదులు, మేథావులు, స్కూల్ యాజమాన్యాలు,కార్మికులు, షాపుయాజమానులు ఈ బంద్ కు సహకరించాలంటూ విజ్ఞప్తి చేస్తూ కరపత్రాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం లో నాగేశ్వరావు, త్రిమూర్తులు, సతీష్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవిన్యూ డివిజన్ లోనే కొనసాగించేలా నిర్ణయించడం హర్షనీయం

**అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్**



**మునగపాక, డిసెంబర్ 27, మనసులో మాట..** మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవిన్యూ డివిజన్ లోనే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. అయితే అచ్యుతాపురం మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్లోనూ కొనసాగిస్తే చాలా మంచిదని ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి అచ్యుతాపురం మండలాన్ని కూడా అనకాపల్లి రెవిన్యూ డివిజన్ లోనే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ప్రసాద్ సూచించారు. అయితే వైయస్సార్సీపి ఆధ్వర్యంలో మునగపాకలో పది రోజులు పాటు రిలే నిరాహార దీక్షలు చేసి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో తలోగ్గి అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. మునగపాక మండలం అనకాపల్లి రెవెన్యూ డివిజన్లో కొనసాగేలా వైసిపి ఆధ్వర్యంలో సాగిన పోరాటాలు ఫలించాయని, ఇది వైసిపి నాయకులు కార్యకర్తలు పోరాట ఫలితమే ప్రభుత్వ నిర్ణయానికి కారణమని ప్రసాద్ అన్నారు. వైసీపీ శ్రేణులు అందరకు ప్రసాద్ అభినందనలు తెలియజేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక







# ప్రెస్‌క్లబ్ ఎన్నికలకు ఇంత జాప్యం ఎందుకు?!



- ▸▸ అడ్డుకునేది ఎవరు..
- ▸▸ రాజమండ్రి ప్రెస్ క్లబ్ సమస్య పరిష్కరిస్తా
- ▸▸ ఉద్యమ పాత్రికేయ జేఏసీకి హామీ ఇచ్చిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి
- ▸▸ నిష్పక్షపాతంగా ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహించాలి: జేఏసీ విజ్ఞప్తి
- ▸▸ ప్రెస్ క్లబ్ లావాదేవీలపై ఆడిట్ నిర్వహించాలి
- ▸▸ ప్రత్యేకాధికారి పర్యవేక్షణలో ప్రెస్ క్లబ్ నిర్వహణ, ఎన్నికల నిర్వహణ కొనసాగాలి
- ▸▸ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్ లను కలిసిన జేఏసీ బృందం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:** రాజమండ్రి ప్రెస్ క్లబ్ దుస్థితిని ఉద్యమ పాత్రికేయుల ద్వారా తెలుసుకున్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఒకింత ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. శనివారం పాత్రికేయ జేఏసీ బృందం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ను, జేసీని కలిసి వినతి పత్రాలను అందజేశారు. క్లబ్ పేరుతో జరుగుతున్న దందాలు, గత ఆరేళ్ళుగా ఎన్నికలు నిర్వహించకుండా 'కొందరు' పెత్తనం చెలాయిస్తూ రాజమండ్రి ప్రెస్ క్లబ్ ను భ్రష్టు పట్టిస్తున్న వైనాన్ని సవివరంగా కలెక్టర్, జేసీలకు వివరించారు. ప్రస్తుతం క్లబ్ కు అధ్యక్షుడు ఉన్నారా లేరా అని కలెక్టర్ జేఏసీ బృందాన్ని ప్రశ్నించారు. నిబంధనలు ప్రకారం పాలకవర్గం కాలపరిమితి ముగిసి అయిదారేళ్ళు అవుతున్నా..ఎన్నికలు జరపకుండా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నారని జేఏసీ బృందం తెలిపింది. క్లబ్ బైలా ప్రకారం ఏటా ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా జేఏసీ ప్రతినిధులు తెలిపారు. మరి ఇన్నాళ్ళూ ఎందుకు జరపలేదని కలెక్టర్ ప్రశ్నించారు. క్లబ్ నిర్వహణ, ఆదాయ వనరులపై కలెక్టర్ కీర్తి చేకూరి ఆరా తీశారు. గత కలెక్టర్ హయాంలో త్రిసభ్య కమిటీ నియామకాన్ని ఈ సందర్భంగా కలెక్టర్, జేసీల దృష్టికి తీసుకొచ్చారు. ప్రెస్ క్లబ్ ముసుగులో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను జేఏసీ వివరిస్తున్నప్పుడు కలెక్టర్, జేసీ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ప్రెస్ క్లబ్ కు ఎన్నికలు నిర్వహించాలని, అప్పటి వరకూ స్పెషల్ ఆఫీసర్ ను నియమించాలని జేఏసీ బృందం కోరింది. నాలుగైదు రోజుల క్రితం అనంతపురం ప్రెస్ క్లబ్ పై అక్కడి జిల్లా కలెక్టర్ తీసుకున్న నిర్ణయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అదే మాదిరిగా రాజమండ్రి ప్రెస్ క్లబ్ సీజ్ చేసి, అధికారుల పర్యవేక్షణలో సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టి, ఎన్నికలు నిర్వహించాలని కోరారు. అలాగే గడచిన ఏడేళ్ల లావాదేవీలు, ఆడిట్లపై విచారణ జరిపించాలని, లావాదేవీలపై పలు అనుమానాలు ఉన్నాయని, వాటిపై విచారణ జరిపించి బహిర్గతం చేయాలని..ఆ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్, జేసీలను జేఏసీ బృందం కోరింది. జేఏసీ ఇచ్చిన నివేదికను పూర్తిగా కలెక్టర్, జేసీలు చదివి..పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. డీసీఓ తో మాట్లాడి మరో రెండు, మూడు రోజుల్లో సమస్యాత్మకంగా మారిన ప్రెస్ క్లబ్ సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా కార్యాచరణ ఉంటుందని కలెక్టర్ కీర్తి చేకూరి హామీ ఇచ్చారు.

## 49వ డివిజన్‌లో రూ. 2. 2 కోట్లతో పనులు

- ♦ టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులేశారుగానీ.. సౌకర్యాలపై శ్రద్ధ లేదు
- ♦ క్వారీ ఏరియా మహిళలు చైతన్యవంతులు...తేడావస్తే తిరగేస్తారు
- ♦ అవుట్ లెట్ డ్రెయిన్ కి శంకుస్థాపనతో పాటు మరో డ్రెయిన్ నిర్మాణం
- ♦ మా సొంతంగా కాకుండా ప్రజలకు అవసరమైన పనులే చేస్తాం
- ♦ సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలో ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:స్థానిక 49వ డివిజన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసినవి, చేస్తున్నవి, చేయాల్సినవి కలిసి మొత్తం రూ. 2 కోట్ల 20 లక్షల విలువైన పనులు ఉన్నాయని రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. వీటితో పాటు ఇంకా చేయాల్సిన పనులు కూడా దశలవారీగా చేస్తామన్నారు. 49వ డివిజన్‌లోని సింహాచలం నగర్‌లో ఉన్న టిడ్కో ఇళ్లకు సంబంధించి రూ. 6 లక్షలతో చేపట్టిన సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వాసు.. నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ 2014 -19 టీడీపీ పాలనలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు వైసీపీ హయాంలో చివరి దశలో ఆ పార్టీ రంగులు వేసి, లబ్దిదారులకు ఇచ్చారని, రంగులు వేయించడంలో ఉన్న శ్రద్ధ, సౌకర్యాల కల్పన పనుల్లో చూపించలేదని విమర్శించారు. క్వారీ ఏరియాలో మహిళలు రాజకీయంగా మంచి చైతన్యం గలవారని, తేడా వస్తే అట్టు తిరగేసినట్టు తిరగేస్తారని అన్నారు. ఈ ఇళ్ల నుంచి డ్రెయినేజీ వాటర్ బయటకు వెళ్లే దారిలేదని ఎమ్మెల్యే వాసు అన్నారు. మహిళలు చాలా బాధపడ్డారని తెలిపారు. అందుకే రూ.6 లక్షలతో అవుట్ లెట్ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే అక్కడ నుంచి బయటకు వెళ్ళడానికి రూ.16.7 లక్షలు వెచ్చించి మరో డ్రెయిన్ మంజూరు కోసం కమిషనర్ సందర్శనకు వెళ్లారని ఆయన చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ ప్రాంతంలో మొత్తంగా రూ. 23 లక్షలతో పనులు ప్రారంభించుకుంటున్నామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. మాకు ఇష్టమైన పనులు కాకుండా ప్రజలకు ఏది అవసరమో తెలుసుకుని వారి ఇష్టం ప్రకారం పనులు చేయడమే తమ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. రాత్రికి రాత్రి పనులు చేయలేకపోవచ్చుని, చేసిన పనులు సంతృప్తికరంగా చేస్తే ప్రజలు కూడా ఆనందిస్తారని ఆయన తెలిపారు. ఈ వార్డే కాదు, అన్ని వార్డుల్లో కూడా ప్రజలకు అవసరమైన పనులు ఒక్కొక్కటిగా చేస్తున్నామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. డివిజన్ ఇంచార్జ్ దుత్తరపు గంగాధర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, నగర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి మొకమాటి సత్యనారాయణ, పందిరి మహా దేవుడు సత్రం డెవరెక్టర్ సలాది ఆనంద్, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు చాపల చిన్నరాజు, మదినా సాహెబ్ అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



### ఉపాధి హామీ పథకం సమన్వయం

**పిఠాపురం నియోజకవర్గంలో తో అనుసంధాన అంతర్గత రహదారుల త్వరితగతిన నిర్వహించాలి..**
**- కలెక్టర్ సన్మోహన్ సగలి**

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 27..** ఉపాధి హామీ పథకం సమన్వయంతో పిఠాపురం నియోజక వర్గంలో మంజూరు చేసిన అనుసంధాన అంతర్గత రహదార్ల పనులను త్వరితగతిన నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన డ్వామా పాడా పంచాయితీరాజ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పిఠాపురం గొల్లప్రోలు యు.కొత్తపల్లి మండలాల్లో ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టవలసిన జనావాసాలను కలిపే కనెక్టింగ్ రోడ్ల పై సమీక్షించి అవసరమైన పనులు చేపట్టేందుకు 8 కోట్లు మేరకు నిధుల మంజూరు ఆమోదించారు. అలాగే ఆవాసాల్లో ప్రజాప్రతినిధులు అత్యవసరమని సూచించిన, ప్రజలు విజ్ఞప్తి చేసిన అంతర్గత రోడ్ల పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పిడి పి.వెంకటలక్ష్మి పాడా ప్రోజెక్ట్ డైరక్టర్ ఎ.శ్రీనివాసరావు పంచాయితీరాజ్ ఎస్ఈ ఎవిఎస్ శ్రీనివాస్ యంపిడిఓలు పిఆర్ డిఈలు ఏఈలు డ్వామా ఎపిడిలు పాల్గొన్నారు.

## సాంస్కృతిక వికాసానికి, కళా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

**- మంత్రి కందుల దుర్గేష్ - అట్టహాసంగా ప్రారంభమైన ఆర్ఎంసి కార్నివాల్**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:** సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కార్నివాల్ నిర్వహించుకోవడం సంతోషదాయకమని రాష్ట్ర పర్యటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.రెండు రోజుల పాటు నగరంలో నిర్వహిస్తున్న ఆర్ఎంసీ కార్నివాల్‌ను శనివారం సుబ్రహ్మణ్య మైదానంలో ఘనంగా ప్రారంభించారు. కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతుల మధ్య "ఫుడ్ మ్యూజిక్ ఫన్" థీమ్‌తో ఏర్పాటు చేసిన మ్యూజిక్ కన్సర్ట్, విభిన్న రకాల ఫుడ్ స్టాళ్లు, చిన్నారులకు వినోదాన్ని పంచే ఆటలు, సెల్ఫీ బూత్‌లు సందర్శకులను విశేషంగా ఆకర్షించాయి. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ , శాసన సభ్యులు తదితరులు స్టాళ్లను సందర్శించి సంప్రదాయ వంటకాలను రుచి చూశారు. అనంతరం సంగీత కళాకారుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. స్వాతంత్ర్య సమరయోధుడు బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణం పేరుతో ప్రారంభమైన ఈ మైదానంలో ఇలాంటి అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఆనందదాయకమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ కార్నివాల్ నగరానికి పండుగ శోభను తీసుకువచ్చిందని అభివర్ణించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు కుటుంబ సమేతంగా ప్రజలందరూ పాల్గొని ఆనందించేలా నగర పాలక సంస్థ ఈ వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. దైనందిన జీవితంలో ప్రజలు నిత్యం ఒత్తిళ్లకు లోనవుతూ సాంస్కృతిక వికాసానికి దూరమవుతున్నారని మంత్రి తెలిపారు. ఇటువంటి తరుణంలో ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు రాజమహేంద్రవరానికి ఉన్న గత వైభవాన్ని పున'ప్రారంభించేందుకు ఈ కార్నివాల్ ఒక చక్కని ప్రయత్నమని అన్నారు. ఆంధ్రా రుచులతో పాటు స్థానిక కళాకారులను ప్రోత్సహించే విధంగా స్టాళ్లను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.కళల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉగాది పురస్కారాల నుంచి ప్రతి నెలా ఒక రాష్ట్ర పండుగను నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో 2027 పుష్కరాల వరకు ప్రతి నెలా నగరంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా రాజమహేంద్రవరానికి ఉన్న గత వైభవాన్ని నిలబెట్టుకుందామని మంత్రి పిలుపునిచ్చారు. అలాగే ఆనం కళా కేంద్రంలో గతంలో నిర్వహించిన నంది నాటకోత్సవాల వంటి కార్యక్రమాలను మళ్లీ ప్రారంభించి, కళాకారులకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో కళలు, కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్నివాల్ నగర వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు సాంస్కృతిక అనుభూతులను అందిస్తోందన్నారు. ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని ఆనందించేలా ఈ కార్యక్రమాలు నగరానికి పండుగ శోభను తీసుకువచ్చాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, ఆర్డీఓ ఆర్ కృష్ణ నాయక్, అడిషనల్ ఎస్పీ డీ మురళీకృష్ణ, ఆర్ఎంసీ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ దాసరి ప్రియా సౌజన్య, ఏపీ శెట్టిబలిజ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో నగర ప్రజలు పాల్గొన్నారు.

## విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 27..** విద్యతోపాటు క్రీడలకు జాయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జాయ్ ఇంగ్లీష్ మీడియం స్కూలు కరస్పాండెంట్. గుత్తుల సుశీల పేరెంట్ అసోసియేషన్ అధ్యక్షులు సాపే. సుధాకర్ పేర్కొన్నారు. కాకినాడ సురేష్ నగర్ లో గల జాయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మూడవ తరగతి చదువుతున్న కంకటాల నిహారికను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా జిల్లా, రాష్ట్రా, జాతీయ స్థాయిలో కంకటాల నిహారిక కు మంచి గుర్తింపు తీసుకురావాలని వారు పేర్కొన్నారు. మా పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న కంకటాల నిహారిక చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తుందన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన జాతీయ స్కేటింగ్ రింగ్ పోటీలలో దేశం నుంచి 21రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని, 6 నుండి 8 గ్రూపులో జాతియ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం జరిగిందన్నారు. అంతేకాకుండా తూర్పుగోదావరి జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జాతీయ స్థాయిలో మెడల్ సాధించడం జరిగిందని తెలిపారు. నిహారిక కు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నిహారిక తల్లిదండ్రులు కంకటాల సతీష్ శ్రీప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## ఊడిమూడి వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు 65 శాతం పూర్తి

**- జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్**




**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 27 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం మండలం లో నాలుగు లంక గ్రామాలకు కలిపే ఉడిమూడి వద్ద ప్రధాన వారధిగా నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు 65 శాతం పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. శనివారం ఊడిమూడి గంటి పెదపూడి లంక గ్రామాల వద్ద ఆసియా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకు నిధులైన రూ 71. 43 కోట్లతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మి స్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన క్షేత్ర స్థాయిలో ఇంజనీర్లతో కలిసి పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. బ్రిడ్జ్ వద్ద అప్రోచ్ రోడ్లు నిర్మాణానికి రైతుల నుండి సేకరించిన 5.1 ఎకరాలకు భూసేకరణ నిధులు రూ 2.30 కోట్లు వారం రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతా యన్నారు. ఈ బ్రిడ్జి ఆస్ట్రేలియన్ సూపర్ టీ టెక్నాలజీ తో నిర్మించడం పట్ల జిల్లా కలెక్టర్ సంబంధిత ఇంజనీర్ పిపి రాజును అభినందించారు. ప్రస్తుతం పిల్లర్ 7, 8 పనులు గోదావరి నదికి అడ్డంగా క్రాస్ బండ్లు వేసి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో రెవెన్యూ డివిజనల్ అధికారి పి శ్రీకర్, తాహసిల్దార్ పి శ్రీ పల్లవి, పంచా యతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ అన్యం రాంబాబు, గోదావరి హెడ్ వర్క్స్ డివిజనల్ ఇంజనీర్ ప్రసాద్, ఏఈలు దుర్గా కొండలరావు సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రి ప్రెస్ క్లబ్ కూ అదే పరిస్థితా?!



- ▸▸ అనంతపురం ప్రెస్ క్లబ్ మాదిరిగా చర్యలు తీసుకోక తప్పదా?
- ▸▸ ఉద్యమ పాత్రికేయుల లక్ష్యం నెరవేరేనా
- ▸▸ ఉద్యమాన్ని నీరుగార్చే వ్యూహంలో బ్రోకర్లు

రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 26:అనంతపురం ప్రెస్ క్లబ్ కలెక్టర్ స్వాధీనం చేసుకున్న వార్త ఇప్పుడు రాజమండ్రి నగరంలోని 'ఉద్యమ పాత్రికేయులలో' కొత్త ఉత్సాహాన్ని తీసుకు వచ్చింది. అదే సమయంలో బ్రోకర్ల గుండెల్లో దడ ప్రారంభమైంది. ఇంతకీ అనంతపురం ప్రెస్ క్లబ్ సీజ్ చేస్తే..రాజమండ్రి పాత్రికేయ వర్గాల్లో స్పందనకు సంబంధం ఏమిటా అనేగా మీ ప్రశ్న.

అనంతపురం ప్రెస్ క్లబ్ పరిస్థితి ఎలాగుందో..అంతకంటే దారుణంగా రాజమండ్రి ప్రెస్ క్లబ్ పరిస్థితి ఉందంటున్నారు స్థానిక పాత్రికేయులు కొందరు. అనంతపురం ప్రెస్ క్లబ్ చట్టబద్ధంగా వ్యవహరించకపోవటం వల్లనే అక్కడి జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. త్రీమెన్ కమిటీ పరిశీలించి..చివరికి సీజ్ చేయక తప్ప లేదని అక్కడి అధికారులు వివరించారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ పరిస్థితి అంతకు మించి దారుణంగా ఉందంటున్నారు. 'ది రాజమండ్రి ప్రెస్ క్లబ్' రెన్యువల్ చేయకపోవడం వల్ల ఆ పేరు మరుగున పడింది. అటు తర్వాత దానిస్థానే 'రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్'గా రిజిస్ట్రేషను చేయించారు. దానినీ నిబంధనలు ప్రకారం రెన్యువల్ చేయించకపోవడం వల్ల అదీ మరుగున పడింది. ప్రస్తుతం రాజమండ్రిలోని 'ప్రెస్ క్లబ్'కు ఏ పేరూ లేదు. ఏ పాలకవర్గమూ లేదు. ఓ అధ్యక్షుడంటూ ఎవరూ లేరు. ఎవరికి వారు తమ అవసరార్థం తామే అధ్యక్షులం, కింగ్ మేకర్లం అంటూ డబ్బా కొట్టుకుంటూ తమ పబ్బం గడుపుకొంటున్నారని పలువురు పాత్రికేయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రెస్ క్లబ్ కు సంబంధించి ఓ లెక్కా పత్రం లేదని, సరైన నిర్వహణ లేదని, జవాబుదారీతనం కొరవడిందని, ఫలితంగా పాత్రికేయులు ఎవరి కుంపటి వారు ఏర్పాటు చేసుకుని సందిట్లో సడేమియాగా దందాలకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. ఇదే అదనుగా కొంత మంది మీడియా అవతారం ఎత్తి 'బ్రోకర్లు' గా తయారయ్యారని, మరికొందరు ఇసుక, లిక్కర్, గ్రావెల్, విద్యా సంస్థలకు, భూ మాఫియాలకు తొత్తులుగా మారి అందిన కాడికి ఎవరికి వారు దోచుకుతింటూ మొత్తం పాత్రికేయ రంగాన్ని భ్రష్టుపట్టించేశారని ఆరోపిస్తున్నారు. అంటే మీడియా ముసుగులో కొందరు బ్రోకర్లుగా మారి 'పాత్రికేయులకు' తలవంపులు తెస్తున్నారనేది పలువురు పాత్రికేయుల ఆవేదన. ఇన్ని జరుగుతున్నా...అన్నీ తెలిసిన సీనియర్ జర్నలిస్టులు ఏమీ చేయలేని పరిస్థితిగా తయారైందని అంటున్నారు. మనకెందుకు వచ్చిన గొడవ..తలదూర్చి వివాదాలు తెచ్చుకోవటం తప్పిస్తే ఫలితం ఉండదని 'సీనియర్లు' మౌనంగా ఉంటున్నారని చెబుతున్నారు. జోక్యం చేసుకుంటే తమ ఇన్నాళ్ళ గౌరవం మంటగలిసిపోతుందనే భయం వల్లో, మనం కలుగజేసుకుంటే మాటకు విలువ ఇవ్వరనే అనుమానమో..నువ్వెవ్వరవు మాకు చెప్పడానికి అంటే తమ ఆత్మాభిమానం దెబ్బతింటుందనే ఉద్దేశంతోనో మరికొందరు.. ఇలా ఎవరికి వారు లోలోన మదనపడుతున్నా..ప్రెస్ క్లబ్ వ్యవహారాల్లో మాత్రం దూరం దూరంగానే ఉంటున్నారు. బ్రోకర్లకు కావలసినది ఇదేనని, పెద్దలు జోక్యం చేసుకోకుండా ఉంటే 'మా పని మేం చేసుకుంటాం' అనే తీరులో వ్యవహరిస్తున్నారని పలువురు ఉద్యమ జర్నలిస్టులు చెబుతున్నారు.

**గ్రూపులుగా చీల్చి..ఆపై ఆజ్యం పోసి..**

మీడియా బ్రోకర్లు తమ పనికి, తమ దందాలకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా ఉండాలంటే..ఒక్కటిగా అన్నదమ్ముల్లా ఉన్న పాత్రికేయ సోదరులు చీలాలి. వర్గాల కుంపట్లు రాజేయాలి. మళ్ళా ఆ వర్గాలలో ఆజ్యం పోయాలి. వాళ్ళూ వాళ్ళూ తగవులాడుకుంటుంటే..మన దందాలకు ఏ ఆటంకం రాదనేది వారి ఆలోచనగా కనిపిస్తోందని అంటున్నారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ స్థాపన సమయంలో సీనియర్లు కేవలం ప్రింట్ మీడియా ప్రతినిధులకే సభ్యత్వం అన్నది బైలాలో స్పష్టంగా పేర్కొన్నారని, అప్పటికి పెద్దగా ఎలక్ట్రానిక్ మీడియా జోరు లేదని.. అటు తర్వాత ఎలక్ట్రానిక్ మీడియా హవా ప్రారంభమైందని, వారిని కూడా సభ్యులుగా చేర్చుకున్నారని వివరించారు. అంత వరకూ బాగానే ఉన్నా కాల క్రమంలో 'మేమే గొప్ప అంటే మేమే గొప్ప' అన్న భావన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ఏర్పడటం.. అక్కడ నుంచి వివాదాలు, వర్గాలూ మొదలయ్యాయని చెబుతున్నారు. ప్రెస్ క్లబ్ పాలక వర్గంలో ఉభయులకూ అవకాశం కల్పించారని, ఆ తరువాత ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆధిపత్యం కోసం, తమదే పై చేయిగా ఉండాలనే స్వార్థం వివాదాలకు కారణమైందని చెబుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరి పెత్తనం అందరికీ భారంగా తయారైందని, చివరికి ప్రెస్ క్లబ్ ఉనికికే ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని గాలికొదిలేసి తమ సంక్షేమం కోసమే ప్రెస్ క్లబ్ అన్నట్టుగా తయారు చేశారని పలువురి ఆరోపణ. క్లబ్ స్థాపన లక్ష్యాన్ని పక్కనపెట్టి వర్గ రాజకీయాలు, సిగపట్లకు వేదికగా మార్చేశారంటున్నారు. ప్రెస్ క్లబ్ నిబంధనలను తుంగలోకి తొక్కి 'అంతా మాదే'..అంతా మేమే అన్న చందంగా తయారు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరేళ్ళుగా కొంతమంది చేతిలో మొత్తం పెత్తనాన్ని పెట్టుకుని..ఆడిందే ఆట, పాడిందే పాటగా వ్యవహరించడాన్ని నగరంలోని కొందరు వర్కింగ్ జర్నలిస్టులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎన్నాళ్ళీ దగా, దారుణం, అరాచకం అని ప్రశ్నిస్తున్నారు. ప్రశ్నించే జర్నలిస్టులను ప్రెస్ క్లబ్ లో సభ్యులు కారని, వారికి అసలు సభ్యత్వమే లేదని, నిజానికి తమను ప్రశ్నించే విలేకరులు ఏ పేపర్లలోనూ పని చేయటం లేదని..వారంతా పీడీఎఫ్ పేపర్ల గాళ్ళే అనే ప్రచారాన్ని మీడియా బ్రోకర్లు ప్రారంభించారు. మేమే అసలు సిసలైన జర్నలిస్టులమని, మేమిచ్చే జాబితాలోని వారే వర్కింగ్ జర్నలిస్టులమని అందరికీ చెప్పడం ప్రారంభించారు.

**కోర్టుకు సమర్పించిన జాబితాలో పేర్లు ఎవరు జేర్చారు?..**

అవసరానికో జాబితాతో నగరంలో ఉన్న వివిధ రంగాల ప్రముఖులను అయోమయానికి గురి యచేస్తున్నారు మీడియా బ్రోకర్లు. చివరికి న్యాయ స్థానానికి ఇచ్చిన ఆధారాలలో కూడా మోసం చేసే స్థాయికి ఎదిగిపోయారు. న్యాయ స్నానానికి సమర్పించిన జాబితాలో 200 కు పైగా పేర్లు ఉన్నాయి. కాకపోతే క్రమ క్రమంగా ఆ జాబితాలో చాలామంది పేర్లను నిర్ద్వందంగా తొలగించి..ఏం చేసుకుంటారో చేసుకోండనేటట్టు వ్యవహరించడమే అసలు సమస్యకు కారణం. బైలాలోని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, ఏళ్ళ తరబడి ఎన్నికలు నిర్వహించకపోయినా సర్దుకుపోయిన పాత్రికేయులను క్లబ్ సభ్యత్వం నుంచి తొలగించడంతో 'మీరెవరు మమ్మల్ని తొలగించడానికి' అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదిగో అక్కడ నుంచి వర్గ విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. రెండు వర్గాలూ జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించారు. గత కలెక్టర్ పీ ప్రశాంతి పాత్రికేయుల విజ్ఞప్తి పై త్రీ మెన్ కమిటీని వేశారు. దీంతో మరో వర్గం రాజకీయ నాయకులను ఆశ్రయించి..ఫైల్ ముందుకు కదలకుండా చేశారనేది ప్రత్యర్థి వర్గీయులు ఆరోపణ. అప్పట్నుంచీ మళ్ళీ కథ మొదటికొచ్చింది. అటు తర్వాత కలెక్టర్ పీ ప్రశాంతి బదిలీ అయ్యారు. ఆమె నియమించిన త్రీ మెన్ కమెటీ లోని అధికారులు బదిలీ అయ్యారు. కొత్త కలెక్టర్ కీర్తి చేకూరి వచ్చారు. ఐ అండ్ పీఆర్వో కొత్తగా వచ్చారు. డీసీఓ కొత్తగా వచ్చారు. అంతా కొత్తవారే. దీంతో.. ప్రెస్ క్లబ్ నుండి తొలగించిన పాత్రికేయులు మళ్ళా ఉద్యమ బాట పట్టారు. వీరికి అన్ని వర్గాల నుంచి మంచి మద్దతు లభిస్తోంది. విచిత్రం ఏమిటంటే.. అటు వర్గంలో ఉన్న చాలామంది పాత్రికేయులు, సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ లో సభ్యులుగా కొనసాగుతున్న వారు సైతం..'మీ న్యాయమైన పోరాటానికి మా మద్దతు ఉంటుందని' ప్రకటించడం పట్ల ఉద్యమ పాత్రికేయులలో మరింత పట్టుదలను, ఉత్సాహాన్ని తీసుకువచ్చింది. ఇటీవల ఉద్యమ పాత్రికేయులు కొందరితో జేఏసీ ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందించుకున్నారు. అధికార అనధికారులను, సీనియర్ జర్నలిస్టులను స్వయంగా కలిసి మద్దతు కోరుతున్నారు. ప్రెస్ క్లబ్ లో జరుగుతున్న పరిణామలను, ఒంటెద్దు పోకడలతో కొందరు వ్యవహరిస్తున్న తీరును మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ తో సహా పలువురు రాజకీయ నాయకుల దృష్టికి ఉద్యమ పాత్రికేయులు తీసుకు వెళ్ళారు.

**అనంతపురం ప్రెస్ క్లబ్ సీజ్ తో..మరింత హుషారు..**

చట్టబద్ధత లేకుండా కొనసాగుతున్న అనంతపురం ప్రెస్ క్లబ్ సీజ్ కు అక్కడి జిల్లా కలెక్టర్ తీసుకున్నట్లే.. రాజమండ్రి ప్రెస్ క్లబ్ కూడా సీజ్ చేసి, తదుపరి చర్యలు చేపట్టాలని ఉద్యమ పాత్రికేయులు డిమాండు చేస్తున్నారు. అనంతపురం కలెక్టర్ నిర్ణయం మాదిరిగానే.. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి, న్యాయం చేయాలని కోరుతున్నారు. గత ఆరేళ్ళుగా ప్రెస్ క్లబ్ కు ఎన్నికలు నిర్వహించకుండా, సక్రమమైన రికార్డులు లేకుండా..అస్తవ్యస్తంగా ఉన్న ప్రెస్ క్లబ్ ను మొదట ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, స్పెషల్ ఆఫీసర్ ను నియమించాలని డిమాండు చేస్తున్నారు. పూర్తి స్థాయిలో సభ్యత్వ సేకరణ ప్రక్రియ నిర్వహించి నిబంధనలు ప్రకారం ఎన్నికలు జరిపించి..గాడి తప్పిన ప్రెస్ క్లబ్ ను సక్రమ మార్గంలో పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఉద్యమ పాత్రికేయులు కోరుతున్నారు.



## జనవరి నెల సామాజిక పెన్షన్లు

### 31వ తేదీనే జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**ఏలూరు, డిసెంబర్, 27(మనసులో మాట)..** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చీ= భరోసాపించను పథకము ఫించన్లు పంపిణీ ప్రభుత్వ ఆదేశంల ప్రకారం నూతన సంవత్సరం కారణంగా 1 వ తేది జనవరి, 2026 పంపిణి చేయవలసిన పెన్షన్లు ను ది. 31.12.2025 వ తేదీన ఉదయం 7 గంటల నుండి పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. చీ= భరోసాపించను పథకము జనవరి,2026 నెల పింఛను చెల్లింపులు 31.12.2025 ఉదయం 7.00 గంటలకు ప్రారంభం అవుతుందని, ఏలూరు జిల్లా లో జనవరి, 2026 నెలలో 2,59,151 మంది ఫించన్ దారులకు 113.68 కోట్ల రూపాయిలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.జిల్లా లో ఫించన్ లు పంపిణీ 31 వ తేదీన 100 శాతం పంపిణీ చేయుటకు చర్యలు తీసుకొనటం జరిగిందని, అనివార్య కారణం ల చేత 31 వ తేదీన తీసుకోని వారికి 2 వ తేదీ న పంపిణీ చేయబడుతుందన్నారు. జిల్లా లో 5039 మంధి సచివాలయ మరియు ఇతర ప్రభుత్వ సిబ్బంది తో ఫించనల పంపిణీకి ఏర్పాటులు చేయడమైనదని, సచివాలయ సిబ్బంది ద్వారా ఉదయం 7.00 గంటల నుండి పించను పంపిణి జరిగే విధముగా చర్యలు తిసుకోనవలసినదిగా డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ను కలెక్టర్ ఆదేశించారు.పింఛను పొందేందుకు పింఛను దారులు వారి సంబంధిత ఇళ్లలో అందుబాటులో ఉండేలా సచివాలయ సిబ్బంది ద్వారా ముందస్తు సమాచారం అందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయరాజును ఆదేశించారు.

## పాట్ హోల్ ఫ్రీ సిటీగా నగరం

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - ఏవీ అప్పారావు రోడ్డులో పనులు పరిశీలన



**రాజమహేంద్రవరం (మనసులో మాట) డిసెంబరు 27:** పాట్ హోల్ ఫ్రీ సిటీగా నగరాన్ని తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అందుకు సంబంధించిన పనులు ఏనాడో ప్రారంభమయ్యాయన్నారు. స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులో జరుగుతున్న గుంతలు పూడ్చే పనులను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో సుమారు 507 పాట్ హోల్స్‌ను దాదాపుగా పూడ్చి వేయడం జరుగుతోందన్నారు. గతంలో కురిసిన అకాల వర్షాలు, తుపానుల కారణంగా ఈ పనుల్లో జాప్యం ఏర్పడిందన్నారు. మూడవ ఫేజ్‌లో నగరంలోని ప్రధాన రహదారుల్లో గుంతలు పూడ్చివేతకు శ్రీకారం చుట్టామన్నారు. నిత్యం రద్దీగా ఉండే నగరంలోని శ్యామలా నగర్ జంక్షన్‌లోని రామాలయం జంక్షన్ నుంచి ఏవీ అప్పారావు రోడ్డు, నందం గనిరాజు జంక్షన్ నుంచి టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, చర్చిపేట (జాంపేట) ఆర్ఓబీ నుంచి రంభ..ఉర్వశి.. మేనక థియేటర్ల డౌన్, క్వారీ సెంటర్ జంక్షన్ నుంచి లాలా చెరువు జంక్షన్ వరకూ ఉన్న రోడ్లతో పాటు నగరంలోని అనేక ప్రాంతాల్లో ఉన్న గుంతలు పూడ్చడం జరుగుతోందన్నారు. ఫోర్త్ ఫేజ్‌లో కూడా ఇంకా చేపట్టాల్సి పనులు టెండర్ స్టేజ్‌లో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎన్ క్యాప్ అనే నిధి ఉందని, దాని ద్వారా నగరంలో జంక్షన్లు, రోడ్ల అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్న కారణంగా సాధ్యమైనంత త్వరగా ఆయా రోడ్లలోని గుంతలను పూడ్చాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అవసరమైన చోట పూర్తి స్థాయిలో రోడ్లు నిర్మించాలని, మొత్తానికి నగరంలో గుంతలు లేని రోడ్లుగా అభివృద్ధి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజా అవసరాలు ఏంటో గుర్తించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ప్రజా ఉపయోగకరమైన పనులు మాత్రమే చేస్తున్నామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో రోడ్లతో పాటు డ్రెయినేజీలు, కల్వర్టులు కూడా నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. ఏది ఏమైనా సంక్రాంతి పండుగలోపు నగరంలోని అన్ని రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి ప్రజలకు ప్రయాణంలో అసౌకర్యం లేకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు, గౌతమీ జీవకారుణ్య సంఘం చెంర్మన్ వర్రే శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం పరిశీలకులు నక్కా చిట్టిబాబు, నాయకులు ఉప్పులూరి జానకి రామయ్య, పందిరి మహా దేవుడు సత్రం డైరెక్టర్ సలాది ఆనంద్, రాజమండ్రి పార్లమెంట్ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, నాయకులు చొప్పెర్ల భద్రరావు, మునిని బాబురావు, యాళ్ల శ్రీను, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు చాపల చిన్నరాజు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## ఏలూరుజిల్లాలో రోడ్డు ప్రమాదానికి ఒకే ఊరికి చెందిన ముగ్గురు మృతి

**ఏలూరు/భీమడోలు 27(మనసులో మాట)..** భీమడోలు మండలం సూరప్పగూడెం సమీపంలో శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో డెకరేషన్ పనులు చేస్తూ జీవిస్తున్న ముగ్గురు యువకులు మృతి చెందారు.ద్వారకాతిరుమల ప్రాంతానికి చెందిన సైదు రఫీ , అదే ప్రాంతానికి చెందిన కొయ్యగూర శ్రీరామ్ బన్నీ , తిమ్మాపురం గ్రామానికి చెందిన మాంద్రాజు చరణ్ 26, ముగ్గురు యువకులు ఫ్లవర్ డెకరేషన్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరు ముగ్గురు కలిసి డెకరేషన్ పువ్వులు హోల్సేల్ గా కొనేందుకు శనివారం తెల్లవారుజామున ఏలూరు వచ్చారు తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.





## మహిళల ఆర్థికాభివృద్ధి... సాధికారత దిశగా అడుగులు

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ రాహుల్ మీనా
- క్వారీ మార్కెట్ సెంటర్లో డీజీ లక్ష్మీ కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:** ప్రజలకు డిజిటల్ సేవలు అందిస్తూ, పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించేలా డీజీ లక్ష్మి పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా వెల్లడించారు. శనివారం క్వారీ మార్కెట్ సెంటర్ వద్ద డీజీ లక్ష్మీ కామన్ సర్వీస్ సెంటర్ ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ రాహుల్ మీనా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. స్వయం సహాయక సంఘం సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి డీజీ లక్ష్మి ఎంతో మంచి అవకాశమన్నారు. ఈ సెంటర్ ద్వారా విద్యుత్తు బిల్లులు, ఆస్తి, నీటి పన్ను, రైలు, బస్సు టికెట్లు, టెలిఫోన్ బిల్లు, కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు, బీమా చెల్లింపులు, వ్యవసాయం, ఆరోగ్యం తదితర 250 రకాల సేవలు పొందవచ్చన్నారు. తొలుత జిల్లాకో మోడల్ సెంటర్ ను ఏర్పాటు చేస్తుండగా.. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి నగరంలోని క్వారీ మార్కెట్ సెంటర్లో ప్రారంభించుకున్నట్లు వెల్లడించారు. త్వరలో మరో 261 సెంటర్లు నగర వ్యాప్తంగా అందుబాటులోకి రానున్నట్లు వివరించారు. మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘం సభ్యులు ప్రజలకు డిజిటల్ సేవలందించి తద్వారా ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో డీజీ లక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టడం జరగిందన్నారు. దీని ద్వారా ప్రతి నెల రూ.30 వేల నుంచి 40 వేలు వరకు ఆదాయం ఆర్జించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే కియోస్క్, ప్రింటర్ తదితర పరికరాల కొనుగోలుకు రూ. 2.92 లక్షల రుణం ఇస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకుని పొదుపు సంఘాల మహిళలు జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, నగర పాలక అధికారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




## కాకినాడ జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు కందుల చిట్టిబాబు ను ఘనంగా సత్కరించిన పాలచర్ల నాగేంద్ర చౌదరి

**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 27..** జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయం వద్ద జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కందుల చిట్టిబాబుకు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించి భగవద్గీత అందించిన భారతీయ ధర్మపరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి. ఈ సందర్భంగా నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ మాకు అత్యంత ఆప్తులు కందుల చిట్టిబాబు జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడిగా జ్యోతుల నవీన్ టీం లో పదవి పొందడం వారి ఇరువురు జిల్లా తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి కాకినాడ జిల్లాలో తెలుగుదేశం పార్టీకి తిరుగులేదు అనే విధంగా పనిచేస్తారని వారి నాయకత్వంలో పంచాయతీలు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు ఎన్నికలు అన్ని కూడా కూటమి పార్టీలు విజయం సాధిస్తాయని ఆశాభావం వ్యక్తం చేసిన నాగేంద్ర చౌదరి ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, కందుల విజయ్, కందుల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

- జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 లోగా..
- పెన్షనర్లు కోసం ఈ నెల 29న జిల్లా ఖజానా కార్యాలయ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం
- జీవన్ ప్రామాణ్, ఫేస్ యాప్ లేదా ఉప ఖజానా కార్యాలయంలో సమర్పణకు అవకాశం
- డీటీఓ ఎన్ సత్యనారాయణ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:** ఆంధ్రప్రదేశ్ సంచాలకుడు, ఖజానా- లెక్కలు (మంగళగిరి) ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు 2026 జనవరి 1 వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వ తేదీ లోగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు (పెన్షన్దారులు, కుటుంబ పెన్షన్ దారులు) తప్పని సరిగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని తూర్పు గోదావరి జిల్లా ఖజానా అధికారి ఎన్ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నిర్ణీత గడువులో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించని పెన్షనర్లకు పెన్షన్ చెల్లింపుల్లో అంతరాయం కలిగే అవకాశం ఉందని తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ సమర్పణకు పలు సౌకర్యవంతమైన మార్గాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పెన్షనర్లు జీవన్ ప్రామాణ్ అప్లికేషన్, జీవన్ ప్రామాణ్ ఫేస్ అప్లికేషన్ లను మొబైల్ ఫోన్ లో డౌన్ లోడ్ చేయటం ద్వారా లేదా సమీపంలోని మీ సేవా కేంద్రం లేదా సంబంధిత ఉప ఖజానా కార్యాలయంలో ప్రత్యక్షంగా వచ్చి లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చని పేర్కొన్నారు. బయోమెట్రిక్ (చేతి వేలిముద్రలు) సరిగా నమోదు కాకపోవడం, ఆరోగ్య సమస్యలు, మంచానికి పరిమితమైన పరిస్థితుల్లో ఉన్న పెన్షనర్లు తమ పరిస్థితిని సంబంధిత ఉప ఖజానా కార్యాలయానికి ముందుగా తెలియజేస్తే, ఖజానా సిబ్బంది స్వయంగా పెన్షనర్ వద్దకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్‌ను ధృవీకరిస్తారని జిల్లా ఖజానా అధికారి సత్యనారాయణ తెలిపారు. ఓటీపీ మొబైల్ ఫోన్ కు పంపడం జరుగుతుందని, కావున సదరు మనుగడలో ఉండేలా చూసుకోవలసి ఉంటుందని తెలియజేశారు. నిర్ణీత సమయంలో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు ఉన్న అవకాశాన్ని ప్రతి ప్రభుత్వ పెన్షనర్ సద్వినియోగం చేసుకుని, నిర్ణీత గడువులో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించి, పెన్షన్ చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఆయన కోరారు. నవంబర్, డిసెంబర్ నెలలో ఇప్పటికే కొంతమంది పెన్షన్ దారులు లైఫ్ సర్టిఫికెట్ లు సమర్పించడం జరిగిందని, అయినా వారు కూడా జనవరి 1 వ తేదీ నుండి ఫిబ్రవరి 28 లోగా పైన పేర్కొన్న విధంగా మరొక సారి లైఫ్ సర్టిఫికెట్ ఆన్ లైన్ ద్వారా గానీ ప్రత్యక్షంగా హాజరై సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 29 మధ్యాహ్నం 3 గంటలకి జిల్లా ఖజానా కార్యాలయం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెన్షన్ లు పొందుతున్న వారితో అవగాహన కల్పించడం కోసం సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందనీ డిటివో సత్యనారాయణ తెలియజేశారు.

# సేవా కార్యక్రమాలే సంతృప్తినిస్తాయి

### స్వర్ణాంధ్రలో లద్దిక విజయభాస్కర్ జయంతి వేడుక - లద్దిక సుబ్బారావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్న సమర్పణ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:** అన్నార్తులకు సేవా కార్యక్రమాలు చేయటం ద్వారా నిజమైన సంతృప్తి కలుగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. స్థానిక లాలా చెరువు సెంటర్లోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లద్దిక మల్లేష్ సోదరుడు లద్దిక విజయభాస్కర్ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గన్ని కృష్ణ హాజరయ్యారు. లద్దిక సుబ్బారావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విజయ భాస్కర్ చిత్ర పటానికి గన్ని కృష్ణతోపాటు పలువురు ప్రముఖులు, బీసీ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. కేక్ కట్ చేసి వృద్ధులకు పంచారు. గన్ని కృష్ణ చేతుల మీదుగా స్వర్ణాంధ్ర వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గన్ని కృష్ణ మాట్లాడుతూ మల్లేష్ సోదరుడు విజయ భాస్కర్ చిన్న వయసులో చనిపోవడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. అతని పుట్టిన రోజును పురస్కరించుకుని మల్లేష్ ఒక మంచి సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇంట్లో జరిగే ఏ కార్యక్రమమైనా దానికి గుర్తుగా సమాజంలో నిరాశ్రయులను ఆదుకునేలా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అవసరమన్నారు. పేదల ఆకలిని తీర్చే విధంగా ఒక మంచి నిర్ణయం తీసుకుని స్వర్ణాంధ్రలో ఈ కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. లద్దిక మల్లేష్ మాట్లాడుతూ సోదరుని మరణం తనకు తీరని లోటన్నారు. ఆయన జ్ఞాపకార్థంగా లద్దిక సుబ్బారావు చారిటబుల్ ట్రస్టు ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ సోదరుని జ్ఞాపకం చేసుకుని ఇలాంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఎస్పీ నామగిరి బాబ్జి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఆకుమర్తి చిన్న, బీసీ నాయకుడు కేకే సంజీవరావు, బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు బర్ల సీతారత్నం, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన, వెంకటేష్ ఫాన్స్ నాయకులు బూర హనుమంతరావు, పితాని కుటుంబరావు, టీడీపీ మైనార్టీ నాయకులు మహబూబ్ జానీ, ఎండి ఉస్మాన్, దూలం ప్రసాద్, గాడాల శీను, గంటాలమ్మ గుడి ప్రెసిడెంట్ మహా లక్ష్మణరావు, కన్నాబత్తుల శ్రీనివాస్, శ్రీనివాస్, అవ్వారి శంకర్, కరాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడజిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు గా చుండ్రు వెంకన్న రావు చౌదరి

### జ్యోతుల నెహ్రూ, నవీన్ లను మర్యాదపూర్వకంగా కలిసిన వెంకన్న చౌదరి



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 27..** కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం వేలంగి గ్రామానికి చెందిన చుండ్రు వెంకన్న రావు చౌదరి జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడిగా నియమితులైన శుభ సందర్భంగా కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ను జగ్గంపేట మండలం ఇర్రిపాక వ్యవసాయ క్షేత్రం లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నవీన్ వెంకన్న రావు చౌదరిని అభినందించి శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ను కలిసి ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వెంకన్న రావు చౌదరి మాట్లాడుతూ నాకు జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన అధినేత చంద్రబాబుకి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కి జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కి, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని నవీన్ నాయకత్వంలో జిల్లాలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధించే దిశగా కార్యకర్తలు అందరూ సమిష్టి కృషితో పని చేస్తామని వెంకన్న రావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్ వి ఎస్ అప్పలరాజు, కోటగిరి మహేంద్ర, బుజ్జి బాబు చౌదరి, గొల్లపల్లి బుజ్జి, వెలుగుల లక్ష రావు, మేడిశెట్టి పట్టాభి, గండి వెంకటేశ్వరరావు, కంటే సత్తిబాబు, వాసిరెడ్డి సత్యనారాయణ, పబ్బినేడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలపై పార్టీలతో సమావేశం

### - జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామ మూర్తి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:** భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణలు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), ఎలెక్టోరల్ మ్యాపింగ్ అంశాలపై తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామ మూర్తి శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలు మేరకు రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా ఓటర్ల జాబితాలపై పరస్పర చర్చలు జరపాలని, సమావేశాల్లో వచ్చిన సూచనలను ప్రస్తుత చట్టపరమైన విధానం మేరకు పరిష్కరించి చర్య నివేదికను కమిషన్‌కు సమర్పించడం జరుగుతుందన్నారు. అందుకు అనుగుణంగా రాజకీయ పార్టీలు కూడా ఈ మేరకు క్షేత్ర స్థాయిలో అధికార యంత్రాంగానికి సహకారం అందించాల్సి ఉందన్నారు. సమావేశంలో ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణలు, డూప్లికేట్ ఓట్లు, ఫీల్డ్ స్థాయి ధృవీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత వంటి అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్ల జాబితా పూర్తిగా తప్పులు లేని విధంగా రూపొందించే దిశగా చర్యలు చేపడతామని డీఆర్వో సీతారామ మూర్తి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ తరఫున ఎంఎస్ఎస్ ప్రసాద్, టీ నవీన్ కుమార్, వైఎస్సార్ సీపీ తరఫున బూత్ ఇన్‌చార్జ్ అడ్వైజర్ టీ దేవదానం, కాంగ్రెస్ పార్టీ తరఫున కే గంగారాజు, ఎస్టీ రామారావు, జనసేన పార్టీ తరఫున పీ రామారావు తో పాటు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడాకారులకు కుల, మత, ప్రాంతీయ బేధాలు ఉండవు

### - మట్టిలో మాణిక్యాల్లా క్రీడాకారులు రాణించాలి
### - దండు సాయి ఆకాశ్ వర్మ మెమోరియల్ నెట్ బాల్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు






**కొత్తపేట (మనసులో మాట )డిసెంబర్ 27..** రావులపాలెం మండలం వెదిరేశ్వరంలో 10వ రాష్ట్రస్థాయి దండు సాయి ఆకాష్ వర్మ మెమోరియల్ నెట్ బాల్ పోటీలను శనివారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి జెండా వందనం చేసి. అనంతరం సాయి ఆకాష్ వర్మ ఆత్మశాంతికి మౌనం పాటించారు. మైదానంలో మార్చ్ ఫాస్ట్,క్రీడాకారులు గౌరవవందనాన్ని చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వెదిరేశ్వరంలో దండు వెంకట సుబ్రమణ్యం వర్మ, సుజాతమ్మ దంపతులు దండు సాయి ఆకాష్ వర్మ మెమోరియల్ టోర్నమెంట్ పేరుతో రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలు ఏర్పాటు చేశారని తెలిపారు. నెట్ బాల్ క్రీడాకారుడిగా రాణిస్తూ, ఎదుగుతున్న తరుణంలో అకాల మరణం చెందడం దురదృష్టమని, ఏకైక కుమారుడిని దూరం చేసుకున్న భారాన్ని సుబ్రమణ్యం వర్మ, సుజాతమ్మలు భరిస్తూనే చిన్న వయసు నుంచే ఆకాష్ వర్మ ఏ నెట్ బాల్ క్రీడ కోసం పరితపించేవారో, ఏ క్రీడ కోసం అయితే కృషి చేసేవారో అటువంటి క్రీడను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో సుబ్రమణ్యం వర్మ రాష్ట్ర స్థాయి పోటీలను ఏర్పాటు చేశారని అన్నారు. 13 జిల్లాల నుండి తరలివచ్చిన క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, బృహత్తరమైన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలకు రంగు, కులం,మతం,జాతి,ప్రాంత బేధాలు లేవని అన్నారు. మట్టిలో మాణిక్యాల లాగా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో వెలుగొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ,ముదునూరి వెంకటరాజు, గుత్తుల రాంబాబు, కొప్పిశెట్టి ప్రసాద్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



### విద్యార్థినులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు

# సద్వినియోగం చేసుకోవాలి

### - బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన బీసీ వెల్ఫేర్ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ సత్యనారాయణ

రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:బీసీ వెల్ఫేర్ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ ఎస్ సత్యనారాయణ శనివారం రాజమహేంద్రవరం గణేష్ చౌక్ వద్ద ఉన్న కళాశాల బాలికల వసతి గృహాన్ని, రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థినులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత, పారిశుధ్యం, భద్రత తదితర అంశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థినుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించి, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వసతి గృహాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.వసతి గృహంలో విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించి, నమోదైన సంఖ్యకు అనుగుణంగా విద్యార్థులు హాజరవుతున్నారా లేదా అన్నదానిపై సమగ్రంగా తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, మెనూ ప్రకారం భోజనం అందుతున్న తీరును పరిశీలించి, వంటగది పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. వసతి గృహ ప్రాంగణంలో శానిటేషన్ నిర్వహణ, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల శుభ్రత, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించేలా అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఎలాంటి నిర్లక్ష్యం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సత్యనారాయణ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి బీ శశాంక, ఏబీసీడబ్ల్యూ ఓలు టీవీ ప్రసాద్, ముత్యాల సుబ్బారావు, హెచ్‌డబ్ల్యూఓలు పాల్గొన్నారు.

## అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసిన మంత్రి కందుల



**నిడదవోలు డిసెంబర్ 27 (మనసులో మాట)..** నిడదవోలు నియోజకవర్గంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు మరియు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేసిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ రాష్ట్ర ప్రభుత్వ సారథ్యంలో, ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రాల్లో సేవలు మరింత పారదర్శకంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందనున్నాయి. పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు అందించే పోషణ మరియు ఆరోగ్య సేవలు మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ స్మార్ట్ ఫోన్లు ఉపయోగపడతాయని అలాగే, అంగన్వాడీ కేంద్రాల్లో తక్షణ ఆరోగ్య అవసరాలకు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు.

## రెస్టారెంట్ ను ప్రారంభించిన మంత్రి కందుల



నిడదవోలు డిసెంబర్ 27 ( మనసులో మాట) నిడదవోలు నియోజకవర్గం నిడదవోలు రూరల్ మండలం సమిశ్రగూడెం గ్రామంలో బాషా ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రెస్టారెంట్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించి వ్యాపారం బాగా జరగాలని అన్నారు. ఈ సందర్భంగా బాషా ను మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు.ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీత ప్రవచనాలు.... శ్రీవివేకానంద



**అనపర్తి, ( మనసులో మాట) డిసెంబరు 27:** ట్రూత్ వివేకామృతం ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో బలభద్రపురంలోని ఎమ్మెస్సార్ ఫంక్షన్ హాల్‌లో గత ఎనిమిది రోజులుగా నిర్వహించబడుతున్న తొమ్మిది రోజుల వార్షికోత్సవ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్న ఈశుభతరుణంలో, ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు శ్రీ వివేకానంద నిర్వా ణ షట్కమ్ లోని సారాంశాన్ని "మానవమస్తకాలయం – మహాశివాలయం " అనే ఆధ్యాత్మిక విద్యను ఉపదేశించి మనమందరమూ నిర్యాణ స్థితినుండి (మృత్యువు అన్న స్థితిని అధిగమించి )-నిర్వాణ స్థితికి (శాశ్వతమైన దైవం అన్నస్థితికి )చేరుకునే అతి సులువైన వేదవిజ్ఞానాన్ని సాధకులకు ప్రబోధించారు. ఈ వేడుకలో భాగంగా శనివారం డిసెంబరు 27వ తేదీన సాయంత్రం 5 గంటల నుండి 8 గంటలవరకూ గురువైన శ్రీ వివేకానంద సర్వులకూ భగవద్గీతలోని అంతరార్థాలను వివరించటానికి, మానవుడిని మాధవుడిగా మలచగలిగే "మహామంత్రోపదేశం– భగవద్గీత" ప్రవచాలను ప్రబోధించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి వందలాది భక్తులు శ్రీ వివేకానంద గారి భగవద్గీత ప్రవచనాలు విని భక్తి పరవశంలో మునిగి తేలారు.భగవద్గీత,"గీతాచార్యులు మనకు అందించిన విలువైన ఆత్మజ్ఞానం అనే ఆస్తి యొక్క దస్తావేజు" లాంటిది అని గురువైన శ్రీ వివేకానంద బోధించారు.



## రేపు జిల్లాలో 'మీకోసం'
# ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా అర్జీల స్థితి తెలుసుకునే అవకాశం
- 9552300009 వాట్సప్ గవర్నెన్స్ 'మన మిత్రా' యాప్ ద్వారా సమర్థవంతంగా పౌర సేవలు
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 29న (సోమవారం) తూర్పు గోదావరి జిల్లాలో జిల్లా కలెక్టరేట్ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల వరకు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక – మీ కోసం" కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించ నున్నట్లు తూర్పు గోదావరి కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వాటికి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టటం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు తమ వినతులను Meekosam.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే నమోదు చేసిన అర్జీల పురోగతి, స్థితిగతులను తెలుసుకునేందుకు 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సమాచారం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, ప్రత్యేక అవసరాలు ఉన్న పౌరులకు అనుకూల వసతులు కల్పించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**వాట్సప్ గవర్నెన్స్ - మన మిత్రా యాప్ ద్వారా పౌర సేవలు..**

ప్రజలకు ప్రభుత్వ సేవలు, పౌర సేవలు మరింత సులభంగా, వేగంగా అందించేందుకు 9552300009 వాట్సప్ గవర్నెన్స్ 'మన మిత్రా' యాప్ ద్వారా 36 ప్రభుత్వ శాఖలకు చెందిన 700 లకు పైగా పౌర సేవలు సమర్థవంతంగా అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ప్రజలు ఈ సేవల ద్వారా సమాచారాన్ని పొందడంతో పాటు వివిధ సేవలను సులభంగా వినియోగించు కోవచ్చన్నారు. ఈ సౌకర్యాలను ప్రజలు విస్తృతంగా ఉపయోగించుకుని ప్రభుత్వ సేవల ప్రయోజనాలను పొందాలని కలెక్టర్ కీర్తి చేకూరి కోరారు.

## పందెం రాయుళ్ళు అరెస్ట్



**జగ్గంపేట (మనసులో మాట) డిసెంబరు 27..** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం బలభద్ర పురం గ్రామంలో గల పామాయిల్ తోటలో కొంత మంది అర్థరాత్రి దాటిన తర్వాత కోడి పందేలు నిర్వహించు చుండగా జగ్గంపేట ఎస్.ఐ రఘునందన్ రావు మరియు సిబ్బంది దాడి చేసి ఆరుగురు పందెం రాయుళ్ళను పట్టుకొని వారి వద్ద నుండి రెండు కోళ్లు ,రెండు కత్తులు మరియు 40, 500 రూ నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగింది.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**రౌతులపూడి, (మనసులో మాట)డిసెంబర్ 27:** ఇటీవలె అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి రౌతులపూడి మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు ఇట్టం శెట్టి అశోక్ ఆర్థిక సహాయం. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఇటువంటి సంఘటన జరగడం చాలా బాధాకరమని సర్వం కోల్పోయిన వారికి మన వంతు సహాయంగా సహాయం అందించాలని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని అలాగే ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లి తగు న్యాయం చేస్తామని అశోక్‌అన్నారు.

# విద్యా సంస్థలలో జూనియర్, యూత్ రెడ్ క్రాస్ సభ్యత్వ విస్తరణకు కార్యాచరణ

- త్వరలో ఇంటిగ్రేటెడ్ మెగా క్యాంపు నిర్వహణ - జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సన్నద్ధం కావాలి
- డీఆర్వో టీ సీతారామ మూర్తి




**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:** తూర్పు గోదావరి జిల్లాలోని జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలలో విద్యార్థులను అధిక సంఖ్యలో జూనియర్ రెడ్ క్రాస్ (జేఆర్సీ), యూత్ రెడ్ క్రాస్ (వైఆర్సీ) సొసైటీలలో సభ్యులుగా నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామ మూర్తి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో డీఆర్వో మాట్లాడారు. జిల్లాలో గల అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల జాబితాను సేకరించి, ఆయా విద్యా సంస్థలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి, విద్యార్థులను జేఆర్సీ, వైఆర్సీ సభ్యులుగా నమోదు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ప్రతి కళాశాల, పాఠశాలలో ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించి, సభ్యత్వ నమోదుకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాకారం అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలలో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ కార్యక్రమాలు, అవగాహనా సదస్సులు నిర్వహించి, విద్యార్థుల్లో సేవా భావనను పెంపొందించాలన్నారు. అలాగే పోటీలు నిర్వహించి బహుమతులు అంద జేయడం ద్వారా రెడ్ క్రాస్ సభ్యత్వం పట్ల చైతన్యం తీసుకురావాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు ఒకటి లేదా రెండు మండలాలను దత్తత తీసుకుని, ఆయా మండలాల్లోని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు జేఆర్సీ, వైఆర్సీ పై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల, పాఠశాలలో నెలకు కనీసం రెండు రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాలు నిర్వహించేలా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో రెడ్ క్రాస్ కార్యక్రమాలు క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విభజన అనంతరం రెడ్ క్రాస్ ఫండ్ వినియోగం, లైఫ్ మెంబర్ షిప్, జేఆర్సీ%-%వైఆర్సీ సభ్యత్వ వివరాలపై సమగ్రంగా సమీక్షించారు.

జిల్లాలోని అన్ని మండలాల్లో సంబంధిత అధికారులు లైఫ్ మెంబర్ షిప్, జేఆర్సీ%-%వైఆర్సీ సభ్యత్వాల పెంపునకు చర్యలు తీసుకోవాలని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు డీఆర్వో తెలియజేశారు. ప్రజా హితం కోసం సామాజిక అంశాలతో కూడిన అంశాలతో రెడ్ క్రాస్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో బ్లడ్ బ్యాంక్ సెంటర్ స్థాపనకు, అలాగే జిల్లా స్థాయిలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. త్వరలో ఇంటిగ్రేటెడ్ మెగా క్యాంపు (కార్నియా సేవలు, బ్లడ్ క్యాంపు తదితరాలు) నిర్వహణ కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ జీ తరుణ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా భావనను చిన్ననాటి నుంచే పెంపొందించడమే రెడ్ క్రాస్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జేఆర్సీ, వైఆర్సీ సభ్యత్వం ద్వారా యువతకు మానవతా విలువలు, విపత్తు సమయాల్లో స్పందించే సామర్థ్యం, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలపై అవగాహన పెరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రతి విద్యా సంస్థ రెడ్ క్రాస్ కార్యకలాపాలను తమ విద్యా కార్యక్రమాల్లో భాగంగా అమలు చేస్తే సమాజానికి గొప్ప సేవ చేసినట్లవుతుందన్నారు. త్వరలో నిర్వహించనున్న ఇంటిగ్రేటెడ్ మెగా క్యాంపు ద్వారా ప్రజలకు విస్తృత స్థాయిలో సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు నిర్వహించబడినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ జీ తరుణ్, వైస్ ఛైర్మన్ డాక్టర్ కేవీ రమణ, కోశాధికారి డాక్టర్ జీఎస్వీపీబీఎస్ మహాలక్ష్మి, మేనేజింగ్ కమిటీ సభ్యులు బీ రామకృష్ణ, బీ పద్మావతి, కలెక్టర్ కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్ కుమార్, డీఈఓ కార్యాలయ సహాయ సంచాలకులు వీ వెంకట రాజు, వీ రాజు, ఎస్వీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిడదవోలు వీ రాజు, కొవ్వూరు ప్రభుత్వ హై స్కూల్ కొవ్వూరు కు చెందిన టీ రామచెల్లయ్య, విద్యార్థులు వై గౌతమ్, వీ మణికంఠ, పీ హేమంత్ వీర నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల అధిక వినియోగంతో భూసారం పై ప్రభావం

- నిర్ణీత పరిణామంలో ఎరువులు, యూరియా వినియోగం ఉండాలి
- సూక్ష్మ పోషకాలు వినియోగం, డ్రోన్ టెక్నాలజీ వినియోగించాలి - రైతులకు అవగాహన అత్యవసరం
- నందరాడ ఆర్ ఎస్ కే, పీహెచ్సీ, అంగన్ వాడి కేంద్రాల సందర్శన - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:** రాజానగరం మండలం నందరాడ ప్యాక్ సొసైటీ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, అంగన్ వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలలో నిర్వహిస్తున్న సేవలు, పనితీరు గురించి సిబ్బందితో వివరంగా సంభాషించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ఎరువులు ఎక్కువగా వినియోగిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నది కేవలం అపోహ మాత్రమేనని, వాస్తవంగా ఉపయోగం కంటే భూమికి నష్టం ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎరువుల అధిక వినియోగం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతుల వివరాలు సేకరించి, ఎరువుల వినియోగంపై సరైన అవగాహన కల్పించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని తెలిపారు. చేను పచ్చగా కనిపించాలనే ఉద్దేశంతో ఎక్కువ మోతాదులో ఎరువులు వినియోగించడం వల్ల జరిగే నష్టాలను అధికారులు రైతులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎరువుల వినియోగాన్ని తగ్గించి, మేలైన దిగుబడులు సాధించేందుకు సూక్ష్మ పోషకాలు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా డ్రోన్ టెక్నాలజీని గ్రూపులుగా సమర్థవంతంగా వినియోగిస్తే ఎరువుల ఖర్చు తగ్గించి మంచి దిగుబడులు సాధించవచ్చని అన్నారు. నందరాడ పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, ఇతర సిబ్బంది వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న సిబ్బంది వివరాలు, వారు నిర్వహిస్తున్న వైద్య సేవలు, పని భారం, ఇతర అనుబంధ కార్యకలాపాలు, రికార్డుల నిర్వహణ పై ప్రశ్నించారు.

అనంతరం నందరాడ అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ కీర్తి చేకూరి అక్కడి చిన్నారులతో మమేకమయ్యారు. పిల్లల పేర్లు, వారి యొక్క స్నేహితుల వివరాలు వారి నుంచి తెలుసుకుంటూ వారిలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఆటలు ఆడించి, పిల్లలు ఆలపించిన జాతీయ గీతాన్ని విని ప్రత్యేకంగా అభినందించారు. చిన్నారుల్లో ఆసక్తి పెంచే క్రమంలో వినూత్నంగా ఆలోచిస్తూ వారికి తగిన ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ కీర్తి చేకూరి తెలియజేశారు. ఈ తనిఖీలలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవ రావు, జిల్లా సహకార అధికారి ఎం వెంకట రమణ, రాజానగరం తహశీల్దార్ దేవి, ఇతర సమన్వయ శాఖల సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కొత్తపేట తెదేపా మండల విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట (మనసులో మాట )డిసెంబర్ 27..** గత ప్రభుత్వం చేసిన అరాచకాలు సరిదిద్ది రాష్ట్రాన్ని ట్రాక్ లో పెట్టడానికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలలు సరిపోయిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. శనివారం కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో జరిగిన తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షునిగా నియమితులైన ముత్యాల బాబ్జి,మీడియా కోర్డినేటర్ గా నియమితులైన రెడ్డి శ్రీనివాస్, ఆలయ పాలకమండలి తదితర పదవులు పొందిన వారిని ఆయన సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో జరిగిన అన్యాయాలు, అరాచకాలకు ఎదురునిల్చి కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేశారని కొనియాడారు.వారందరికీ న్యాయం చేయాలనే తపన ఉందన్నారు. తప్పకుండా న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. 2029లో సైతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య పాలన కారణంగా

రహదారులన్నీ చిన్నాభిన్నం అయ్యాయని, వాటి అభివృద్ధిపై దృష్టి పెట్టడం జరిగిందన్నారు. పుష్కరాలు వస్తున్న సందర్భంగా దేవాలయాల అభివృద్ధికి పాటు పడుతున్నామన్నారు. రూ. 4కోట్లతో మందేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి జరుగుతుందన్నారు. పలివెల ఆలయంలో రాజగోపురం నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, బిల్లకుర్రు శివాలయం నిర్మాణానికి రూ. 1కోటి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు.నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న అందరికీ ముఖ్యమంత్రి సహాయనిధి సాధ్యమైనంత మేర భారీ స్థాయిలో అందిస్తున్నామన్నారు. కొత్తపేటలో రెండు మూడు నెలల్లో సబ్ స్టేషన్ ప్రారంభించుకునే విధంగా పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాస్టర్లకు నెలకు రూ. 5వేల చొప్పున ఒకేసారి రూ. 60వేలు అందించడం జరిగిందన్నారు. ఎమ్ ఎస్ ఎమ్ ఈ సదస్సులు నిర్వహించామని డ్వాక్రా మహిళలు, యువత స్వయం ఉపాధికి సంబంధించిన ఆలోచన చేస్తే సబ్సిడీ రుణం అందేలా అవగాహన కోసం రావులపాలెం లో కార్యాలయం ఏర్పాటు జరిగిందన్నారు. నియోజకవర్గ కేంద్రం అయిన కొత్తపేట అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. డీఎల్డీవో ఆఫీసు వాడపాలెం సచివాలయంలో ఏర్పాటు చేశామన్నారు. డివిజనల్ ఆఫీసు కార్యాలయాల నిర్మాణానికి, తహశీల్దార్ కార్యాలయ నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు.సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో బాగా కష్టపడినా కార్యకర్తలకు ప్రశంసపత్రాలు అందజేశారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ ఐక్యమత్యంతో కల్సి ముందుకు రావాలన్నారు. సర్పంచ్ లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు గెలవాలన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల కోసం ఆలోచించి ముందుకు వెళ్లాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పడితే స్థానిక నాయకులకు, ఎమ్మెల్యేగా తనకు, ముఖ్యమంత్రికి మంచి పేరు వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.



## పల్లెలకు పండుగ తెచ్చిన
# కూటమి ప్రభుత్వం!

**తణుకు డిసెంబర్ 27 (మనసులో మాట)..** ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ 2.0లో విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో తణుకు మండలం, వేల్పూరు గ్రామంలో రూ. 40 లక్షలతో, అదే విధంగా నియోజకవర్గంలో మొత్తం రూ. 3 కోట్లు వీ+బీ–=జు+రా నిధులతో నూతనంగా చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న తణుకు నియోజకవర్గ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మమేకమై, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో కుదేలైన గ్రామీణ వ్యవస్థకు తిరిగి పునరుజ్జీవం కల్పించేందుకు సీఎం శ్రీ చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు.ఈ మేరకు గ్రామాల్లో రోడ్లు, తాగు, సాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు ఈ పల్లె పండుగను నిర్వహించడం మంచి విషయం అని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు.

రెస్టారెంట్ ను ప్రారంభించిన మంత్రి కందుల

నిడదవోలు డిసెంబర్ 27 ( మనసులో మాట) నిడదవోలు నియోజకవర్గం నిడదవోలు రూరల్ మండలం సమిశ్రగూడెం గ్రామంలో బాషా ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రెస్టారెంట్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించి వ్యాపారం బాగా జరగాలని అన్నారు. ఈ సందర్భంగా బాషా ను మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు.ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 19 నుంచి సూర్యారాధన మహోత్సవాలు

- కోటి కుంకుమార్చనకు మహిళలు తరలి రావాలి
- కరపత్రం ఆవిష్కరించిన వడలి కుమార్ శర్మ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:** మాఘమాస దశమ వార్షికంగా జనవరి 19 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం వరకు సూర్యారాధన పూర్వక మహాలక్ష్మీ సహిత ఉచిత సౌభాగ్య కోటి కుంకుమార్చన కోలమూరు హెచ్ పీ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న పద్మాక్షి నగర్ లో వడలి కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు సంకల్పించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా శనివారం కార్యక్రమం జరిగే ప్రదేశంలో కరపత్రాల ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాల నిర్మాణం, కుంకుమార్చనలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కుమార శర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొని భగవదనుగ్రహం పొందాలని కోరారు. ప్రతిరోజు ఉదయం 8 గంటలకు ప్రారంభమై ఉదయం 10 గంటలకు ఉచిత కుంకుమార్చన, 12 గంటల నుంచి సూర్య తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 4 గంటల నుంచి మహాలక్ష్మీ హారీమాలు, సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతులు, నీరాజన మంత్ర పుష్పాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో లభించే సూర్య తీర్థాన్ని స్వీకరించడం వల్ల అనారోగ్యం తొలగి సంపూర్ణ ఆరోగ్యం పొందుతారన్నారు. 25న రథ సప్తమి పర్వదినం రోజున సూర్య కల్యాణం, 1న లక్ష్మీ నారాయణ కల్యాణం, మహా పూర్ణాహుతి, అన్న సమారాధనతో పరిపూర్ణమవుతుందని తెలిపారు. కుంకుమార్చనలో పాల్గొనే మహిళలు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కుమార శర్మ కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్, పీఎల్ఎన్ ప్రసాద్, నాడి జ్యోతిష్యం తాడి కేదారనాథ్, ప్రశాంత్, దేవీ ప్రకాష్, రమేష్, మూర్తి కొండబాలు, సూర్యనారాయణ, వరహాల బాబు, కాలెపు జయ, శ్యామల, నాగేశ్వరి భక్తులు పాల్గొన్నారు.

# జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్ పై అవగాహన



**అయినవిల్లి (మనసులో మాట) డిసెంబరు 27:** జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్ అనేది భారత ప్రభుత్వానికి చెందిన ఒక స్వచ్ఛంద పథకమని ఇది చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు (ఎం ఎస్ ఎం ఇ ఎస్) పద్ధతులను స్వీకరించడానికి ప్రోత్సహిస్తుందని ఏ జెడ్ క్వాలిటీ డెవలప్మెంట్ జిల్లా కోఆర్డినేటర్ పోతుమూడు శేషారత్నం పేర్కొన్నారు. శనివారం అయినవిల్లి మండలం తొత్తరమూడి మహిళా సమైక్య భవనం నందు అయినవిల్లి మండలం ఉత్పత్తుల యజమానులకు జరిగిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మెస్ ఎంఈ పరిశ్రమల ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడానికి వ్యర్థాలను తగ్గించడం శక్తిని ఆదాచేయడం పర్యావరణ ప్రభావాన్ని తగ్గించి పోటీ తత్వాన్ని పెంచడానికి దోహదపడతాయన్నారు. జెడ్ సర్టిఫికేషన్ లక్ష్యాలు నాణ్యతమైన ఉత్పత్తులు సాంకేతికతలను ఉపయోగించి అధిక నాణ్యత కలిగిన ఉత్పత్తుల తయారీకి దోహ పడుతుందన్నారు. అనంతరం క్వాలిటీ ఇన్స్పెక్టర్ రవితేజ మాట్లాడుతూ జడ్ ధ్రువీకరణ స్థాయికి అవసరమైన ప్రమాణాలను నెరవేర్చిన తర్వాత మీరు బ్రోంజ్ సిల్వర్ లేదా గోల్డ్ వంటి ధ్రువీకరణ స్థాయిలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మెరుగైన ఉత్పత్తులు మరియు పరిశ్రమల ద్వారా ప్రపంచ మార్కెట్లు లోకి ప్రవేశించే అవకాశాలు మెరుగుపడతాయన్నారు .ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య డిఆర్డిఏ ఏపీఎం వెంకటేశ్వరరావు సిసి వెంకటలక్ష్మి గంగాభవాని ఉత్పత్తి పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక




# సూర్యుడి నుండి వచ్చే సౌరశక్తిని విద్యుత్తుగా మార్చుకుందాం

**- ఇంటింటా సోలాల్ ప్యానెల్స్ ని అమర్చుకోవాలి**
**- రిటైర్డ్ డి.ఎస్.పి కడలి వెంకటేశ్వరరావు**

**గోకవరం (మనసులో మాట), డిసెంబర్ 27 :** ఇంటింటా సోలాల్ ప్యానెల్స్ ని అమర్చుకోవాలి రిటైర్డ్ డి.ఎస్.పి కడలి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రమైన గోకవరంలోని ది గోకవరం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలకు విద్యుత్ అత్యవసర వనరుగా మారిందని, అవసరానికి సరిపడా విద్యుత్ ఉత్పత్తి చేయడం రానున్న రోజుల్లో కష్టంగా మారుతుందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ విద్యుత్తు ప్రజలకు అందించేందుకు సూర్య ఘర్ పేరుతో ప్రతి ఇంటి పైన సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేందుకు పథకాన్ని రూపొందించారని తెలిపారు. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారుడు తమ ఇంటి పై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేందుకు స్వల్ప వడ్డీకి బ్యాంకు రుణంతో పాటు సబ్సిడీ కూడా లభిస్తుందని సూచించారు. సూర్యుడి నుండి వచ్చే సౌరశక్తిని విద్యుత్తుగా మార్చి మన ఇళ్లలో, వ్యాపారాలలో ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ సోలార్ వినియోగం పట్ల ఆసక్తి పెంచుకుని సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు ఆదా కావడంతో పాటు ఖర్చుతో కూడుకున్న విద్యుత్ వినియోగం కూడా తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ది గోకవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రౌతు పండు, ఉపాధ్యక్షులు పి దుర్గబాబు, సంయుక్త కార్యదర్శి సింహాచలం, ప్రెస్ క్లబ్ ఆఫీస్ ఇన్చార్జ్ ఎం జయరాజు ఇతర ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# మృత్యువుతో పోరాడుతున్న చిన్నారి జస్విక



**అయినవిల్లి (మనసులో మాట) డిసెంబరు 27:** అభం శుభం ఎరగని ఆ చిన్నారికి క్యాన్సర్ అనే మహమ్మారి సోకి మృత్యువుతో పోరాడుతుంది అయినవిల్లి మండలం తొత్తరమూడి జై భీమ్ నగర్ కు చెందిన జనుపల్లి రవికుమార్ ప్రజ్వల కు ఇద్దరు అమ్మాయిలు చిన్నమ్మాయి జస్వికకు క్యాన్సర్ వ్యాధి సోకింది దీంతో ఆ చిన్నారికి బోనుమేరా, కీమో, సర్జరీ లాంటి వైద్యానికి సుమారు 6 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. అయితే తన చిన్నారిని బ్రతికించుకోవడానికి అప్పుచేసి 6 లక్షలు ఖర్చుపెట్టి రవికుమార్ విశాఖపట్నం అగనంపూడి వద్ద ఉన్న హోమి బాబా ఆసుపత్రిలో చికిత్స చేయించాడు. అయినప్పటికీ చిన్నారి పూర్తిగా కోల్పోకుండా ఉండటంలో తల్లిదండ్రులు తల్లడిల్లి పోతున్నారు. రవికుమార్ రోజువారి కూలి పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే పేదరికంలో ఉన్న రవికుమార్ సుమారు 6 లక్షలు అప్పు చేసి చిన్నారికి బోన్ మేరా, ఆపరేషన్ కి మో చేయించినప్పటికీ చిన్నారి జస్విక కోలుకోకపోవడంతో తల్లి ప్రజ్వల రవికుమార్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం అయినవిల్లి తహసిల్దార్ విద్యాపతికి విషయం చెప్పగా వెంటనే స్పందించిన ఆయన రూ. 10వేలు రవి కుమార్ కు అందజేశారు. ఎవరైనా దాతలు తనకు సహాయం చేయాలని రవికుమార్ ఎదరుచూస్తున్నాడు. అతని కాంటాక్ట్ నెంబర్ 8897723775.

# ఘనంగా వారాహి మెటల్ క్రాఫ్ట్ ప్రారంభోత్సవం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 27:** స్థానిక రంగ్రీజుపేటలోని రత్నం పెన్ వర్క్స్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన వారాహి మెటల్ క్రాఫ్ట్ ను ప్రముఖ ఆడిటర్ విశ్వనాథ భాస్కర్ రామ్ శనివారం ప్రారంభించారు. మొదటి కొనుగోలును మాజీ ఏపీఐఐసీ చైర్మన్ శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం చేశారు. గ్రాండ్ డిస్ప్లే ను మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, స్టోర్ ను మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ప్రారంభించారు. ప్రారంభోత్సవం తరువాత జ్యోతి ప్రజ్వలనను ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజా చేశారు. విశిష్ట అతిథులుగా కోట్ల కనకేశ్వరరావు, ఎస్ కుమార్, మాటూరి రంగారావు, డాక్టర్ గ్రంథి అరవిందం, కూర్మదాసు ప్రభాకర్, పొలసానపల్లి హనుమంతరావు, మన్యం ఫణి కుమార్, నందెపు శ్రీనివాస్, యిన్నమూరి ప్రదీప్, బొలిశెట్టి శ్రీనివాస్, వాకచర్ల కృష్ణ, కాలేపల్లి ప్రసాద్, సత్యవరపు గోపాలకృష్ణ, బూర్లగడ్డ సుబ్బారాయుడు, తీగల రాజా, మన్యం నవీన్, కొల్లేపల్లి శేషయ్య, మద్దుల మురళీకృష్ణ, మండవల్లి విస్సు, ఎస్ సూర్యనారాయణ రెడ్డి, ఎస్ భాస్కర రెడ్డి, కే సురేష్ రెడ్డి హాజరు కాగా చేబ్రోలు కృష్ణారావు, చేబ్రోలు సూర్యనారాయణ (సూర్య) ఆహ్వానించారు. నాణ్యమైన మెటల్స్ కు కేరాఫ్ అడ్రస్ గా వారాహి మెటల్స్ ఉంటుందని సూర్యనారాయణ తెలిపారు.

### ఆత్రేయపురం మండలం కూటమి ప్రభుత్వం లో

# సమగ్రంగా అభివృద్ధి చెందుతుంది

**కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం - కూటమి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి**
**తెదేపా మండల విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**కొత్తపేట( మనసులో మాట )డిసెంబర్ 27..** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం ఆత్రేయపురంలో ముదునూరి వెంకటరాజు స్వగృహంలో జరిగిన తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక ఆత్రేయపురం మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. బొబ్బర్లంక - వద్దపర్రు రహదారి పనులు త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని టెంపుల్ టూరిజం లో భాగంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. వచ్చేనెల 11, 12, 13వ తేదీల్లో జరిగే సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆత్రేయపురం పేరు ప్రఖ్యాతలు ఇనుమడించేలా ఈ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. డ్రాగన్ పడవ పోటీలు, ఈత పోటీలు, లొల్ల లాకుల వద్ద ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు జరుగుతుందన్నారు. లొల్లలాకుల పునర్నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో రహదారులు డ్రైనేజీలు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. 2029లో సైతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న అందరికీ ముఖ్యమంత్రి సహాయనిధి అందిస్తున్నామన్నారు. పాస్టర్లకు నెలకు రూ. 5వేల చొప్పున ఒకేసారి రూ. 60వేలు అందించడం జరిగిందన్నారు. ఎమ్ ఎస్ ఎమ్ ఈ సదస్సులు నిర్వహించామని ద్వాక్రా మహిళలు, యువత స్వయం ఉపాధికి సంబంధించిన ఆలోచన చేస్తే సబ్సిడీ రుణం అందేలా అవగాహన కోసం రావులపాలెం లో కార్యాలయం ఏర్పాటు జరిగిందన్నారు. సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో బాగా కష్టపడి పని చేసిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ప్రశంసపత్రాలు అందజేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ ఐక్యమత్యంతో కల్సి ముందుకు రావాలన్నారు. సర్పంచ్ లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు గెలవాలన్నారు. ఆత్రేయపురం మండలం నుంచి పార్టీ పదవులు, దేవాలయాల పాలకమండలి పదవులు పొందిన వారిని సత్కరించారు. పార్టీ కోసం కృషి చేసే ప్రతీ కార్యకర్తకు నాయకునికి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకటరాజు, కాయల జగన్నాథం, ముళ్ళపూడి భాస్కరరావు,మద్దూరి సుబ్బారావు, నాగిరెడ్డి సత్యనారాయణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేయూత రవి సమాజ సేవలు స్ఫూర్తిదాయకం - ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ (మనసులో మాట), డిసెంబరు 27:** ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటూ గత 19 సంవత్సరాలుగా తనకొచ్చిన జీవితంలో కొంత మొత్తాన్ని సమాజానికి ఉపయోగిస్తూ తన తోటి ఉద్యోగ ఉపాధ్యాయులందరితో కలిసి 8 సంవత్సరాల క్రితం చేయూత సంస్థను ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని చేయూత రవిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కొనియాడారు. స్థానిక ఎన్జీఓ హోమ్ లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో చేయూత రవిని ఎమ్మెల్యే కొండబాబు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు కాకినాడ, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గర్భిణీలకు, రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం, తల సేమియా చిన్నారులకి రక్తదానం కార్యక్రమం, తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులకి ఉచిత విద్య- వైద్యం, వసతి భోజన సదుపాయాలతో చిల్డ్రన్ హోమ్ ఏర్పాటు చేయడం సామాన్య విషయమేమీ కాదన్నారు. కట్టు బట్టలతో వచ్చిన వారికి ఉపాధి వచ్చే వరకు కృషి చేయడం, అత్యవసర సమయాల్లో వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహాయం అందించడం, వినికిడి లోపంతో మూగబోతున్న చిన్నారులకి స్పీచ్ థెరఫీ ట్రైనర్లు, ఫిజియోథెరపీ మెషీన్లు భవిత సెంటర్లకు అందించడం, దివ్యాంగులకు జీవనోపాధి కల్పించడం, ట్రై సైకిల్స్, వీల్ చైర్ అందించడం, ఆర్థికంగా వెనుకబడి ఉన్నత భవిష్యత్తు కలిగిన చిన్నారులకి ఉన్నత చదువులు చదివించడం, ఇలా అనేకమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని చేయూత రవికుమార్ ని ఎమ్మెల్యే కొండబాబు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే ఉద్యోగుల పాత్ర కీలకమని, చేయూత రవి లాంటి ఉద్యోగులు ఉండటం కాకినాడ అదృష్టమని, ఉన్నదానిలో దానం చేయడం ఒక అలవాటుగా తను మార్చుకోవడమే కాకుండా తన పరిధిలో ఉన్న వారిని భాగస్వామ్యం చేస్తూ అనేక సేవా కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్నారన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులతో పాటుగా ఎందరికో స్ఫూర్తి గా నిలుస్తున్నారని, భవిష్యత్తు లో ఎటువంటి అవసరం ఉన్నా కూటమి ప్రభుత్వం తరుపున అండగా నిలుస్తామని రవికుమార్ సేవలకు ఎమ్మెల్యే కొండబాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జీ మోహన్ రావు, కార్యదర్శి మూర్తి బాబు, మీనాక్షి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ఆశీర్వాదం, రామానాయుడు, కృష్ణా తదితర ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి మృత్యువాత పడిన రవితేజ మృత దేహాన్ని ఇండియాకి రప్పించిన ఇమిగ్రేషన్ అధికారులు





**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 27:** అమలాపురం రూరల్ మండల పరిధిలోని వన్నెచింతల పూడి గ్రామానికి చెందిన ముంగండ రవితేజ (33) ఉపాధి నిమిత్తం 2025 సెప్టెంబర్ 11 న ఖతార్ దేశానికి వెళ్లి హౌస్ కేరింగ్ వర్క్ ఫ్రీలాన్సర్గా పనిచేస్తూ, అక్కడి నివాస గదిలో గుండెపోటుతో దురదృష్టవ శాత్తూ మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర విషాదానికి లోనయ్యారు. మృతుని కుటుంబం నుంచి సమాచారం అందుకున్న స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు వెంటనే జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ ను సంప్రదించారు. జిల్లా కలెక్టర్ తక్షణమే కొనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ బృందాన్ని మృతుని కుటుంబానికి సహాయం అందించాలంటూ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నోడల్ అధికారి కె. మాధవి, సమన్వయ అధికారి గోళ్ళ రమేష్, సిబ్బంది ఎం.ఎం. సఫియా, కడియాల సత్తి బాబు, బద్రి దుర్గా అమ్మాజీ తదితరులు బాధిత కుటుంబాన్ని కలుసుకుని మృతుని వివరాలు సేకరించారు. అనంతరం భారత రాయ బార కార్యాలయంతో పాటు ఖతర్‌లోని "క్రైస్ట్ ఫర్ నేషన్స్ ది చర్చ్ ప్రతినిధులు శ్రీనివాస్, రాజ్‌కుమార్, విజయ్ చార్లీ, సోలామాన్, రమణ, శశిలతో నిరంతర సమన్వయం జరిపారు. వారి సహకారంతో అవసరమైన పత్రాలు, అఫిడవిట్లు సిద్ధం చేసి, రాయబార కార్యాలయానికి పంపించడంతో అన్ని క్లియరెన్స్ ప్రక్రియలు వేగవంతమయ్యాయి. అనంతరం మృతదేహాన్ని కార్గో విమానంలో హైదరాబాద్‌కు పంపి,అక్కడినుంచి %ూరాచీ=% ఏర్పాటు చేసిన అంబులెన్స్ ద్వారా స్వగ్రామమైన వన్నెచింత లపూడికి గ్రామంలో శనివారం మృతుని తల్లిదండ్రులకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ దుర్ఘటన పై జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తూ, మృతుని కుటుంబ సభ్యులకు ధైర్యం నింపాలని సూచించారు. వలస కార్మికుల సంక్షేమం కోసం కోనసీమ జిల్లాలో ఏర్పాటు చేసిన కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ఈ ఘటనలో చూపిన తక్షణ స్పందన, మానవతా దృక్పథం పట్ల ప్రశంసలు లభిస్తున్నాయి. విదేశాల్లో వలస కార్మికులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడంలో అత్యవసర సమయాల్లో సహాయం అందించడంలో విశ్వసనీయమైన వేదికగా నిలుస్తోందని ఏ లు వ్రు ం నిలుస్తోందని. గతంలో కువైట్, ఇజ్రా యెల్, ఒమాన్ వంటి దేశాల్లో జరిగిన ఘటన ల్లోనూ కే సీ ఎం చూపిన సమన్వయ సామర్థ్యం, సేవా తత్వం, మరియు మానవతా విలువలు ఈ కేంద్రానికి విశేష గుర్తింపును తెచ్చాయి. మానవతా దృక్పథంతో జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ ప్రత్యేక చొరవతో ప్రారంభ మైన ఈ కేంద్రం, జిల్లాలోని వలస కార్మికులు పాలిట ఆపద్భాం ధవుడిగా మారిందని. వలస కుటుంబాల నమ్మకాన్ని గెలుచుకున్న ఈ కేంద్రం, కోనసీమ జిల్లాకు గర్వకారణంగా నిలుస్తోంది.



### జక్కన్న తోట ప్రభల తీర్థం అత్యంత ఘనంగా నిర్వహించడానికి

# ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్**

**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 27 :** జగ్గన్న తోట ప్రభల తీర్థం కోనసీమ ప్రాంతంలో అత్యంత పురాతనమైన, పవిత్ర మైన తీర్థస్థలంగా పేరుగాం చిందనీ వ్యర్థం నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు . 2026 జనవరి 16వ తేదీ శుక్రవారం నిర్వహించే ప్రభల తీర్థానికి అన్ని ఏర్పాట్లు చేసి అంగరంగ వైభవంగా కనుల పండుగగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మండల, క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని జగ్గన్న తోట మోసలపల్లి గ్రామాలలో పర్యటించి ప్రభలు ఎటువైపు నుంచి వస్తాయి ఎటువైపు వెళతాయి అనే మార్గాలను పరిశీలించారు. ప్రభలు సంచరించే ప్రదేశాలలో రోడ్లు పరిశుభ్రంగా గుంతలు లేకుండా చూడాలని సాంప్రదాయ స్నానాలు ఆచరించేలా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాని నరేంద్ర మోదీ మెచ్చిన కొనసీమలో జరిగే ప్రభల తీర్థం ఒక అందమైన, భక్తితో నిండిన అనుభూతి ని స్తుందన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతి నకుండా సకల ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు కోనసీమ ప్రాంతంలో పేరుగాంచిన ప్రభల తీర్థం ఎంతో ఆధ్యాత్మిక ప్రాము ఖ్యత సంతరించుకుంద న్నారు. భక్తులు ఎంతో నమ్మకంతో నిర్వహించుకునే సాంప్రదాయ సాంస్కృతిక పండుగలకు ప్రభుత్వం తరఫున వసతులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. తెలుగు వారికి పంటలు చేతికందే సమయంలో నిర్వహించుకునే అతిపెద్ద పండుగ సంక్రాంతి అని ఈ పండుగ అత్యంత వైభవ వేతంగా అంగరంగ వైభవంగా నిర్వహించుకు నేలా ప్రతి ఒక్కరూ సహకరిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ పి శ్రీకర్ తాహసిల్దార్ చినబాబు వీఆర్వో ప్రసాద్ ఎంపీడీవో మమత సర్పంచ్ ఉమాదేవి ఎంపీటీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జగన్మోహిని కేశవస్వామి ఆలయ అన్నదాన పథకానికి రూ.10 వేలు విరాళం



**కొత్తపేట (మనసులో మాట) డిసెంబర్ 27..** జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేసు స్వామి వేణుగోపాలస్వామి ఆలయ లో నిర్వహించే అన్నదాన పథకానికి విజయవాడకు చెందిన దొరపల్లె అభిజ్ఞాన్, లక్ష్మీ మాధవి దంపతులు రూ. 10 వేలు 116 ఆలయ ఈవో భాగవతుల వెంకటరమణమూర్తికి అందజేశారు. దాతలకు శ్రీనివాస్ ప్రత్యేక దర్శనం చేయించి, వేద పండిట్ ఫణి శర్మ వేద ఆశీర్వచనం స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

# ఓటింగ్ యంత్రాలు తనిఖీ



**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 28:** భారత ఎన్నికల సంఘం ఆదేశా ల మేరకు త్రైమాసిక తనిఖీలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతను మరింతగా బలోపేతం చేస్తూ ఎన్నికల ప్రామాణికతకు భరోసా కల్పిస్తాయని అదే విధంగా రాజకీయ పార్టీల పాల్గొనడం వల్ల పారదర్శకత పెరిగి, అనుమానాలు సందే హాలు తొలగిపోతాయని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు శనివారం స్థానిక ఎయిమ్స్ కళాశాల నందు జిల్లా స్థాయిలో మూడో అంతస్తులో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము ను ఆయన రాజకీయ పార్టీల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఇటువంటి చట్టపరమైన చర్యలు భారత ఎన్నికల వ్యవస్థను మరింత బలపరుస్తాయన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం తనిఖీ ల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ల భద్రతకు తీసుకుంటున్న జాగ్రత్తలను ఆయన సమీక్షించారు. గోడౌన్ వద్ద సీసీ కెమెరా వ్యవస్థ, ఫైర్ సేఫ్టీ, 24 గంటల భద్రతా ఏర్పాట్ల ను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఈవీఎంల భద్రతలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, భద్రతా నిబంధనలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఈవీఎం, వీవీప్యాడ్ల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను తనిఖీ చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈవీఎం, వీవీప్యాట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భారత ఎన్ని కల సంఘం ఆదేశాలమేరకు ప్రతి త్రైమాసికంలో రాజకీయ పార్టీలు ప్రతినిధులతో కలిసి ఈవీఎం, వీవీప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఈవీఎంల గోదాము చుట్టూ ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈ తనిఖీలు పారదర్శకత, భద్రతను నిర్ధారించడానికి నిర్వహిస్తారన్నారు జిల్లా ఎన్నికల అధికారి నేతృత్వంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము తెరవడం, సీల్స్, లాకులు, సీసీటీవీలు, భద్రతా చర్యలు పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో యంత్రాల పరిస్థితి, నిల్వ విధానాలు తనిఖీ చేశారు. అన్ని చర్యలు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా జరిగి, గోదాము కు మళ్లీ సీల్ వేయడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం తరఫున రమణ కుమార్,వైసీపీ తరఫున చిట్టి రాజు,స్థానిక ఇన్చార్జి తహసీల్దార్ గోపాల కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ శివరాజు, ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జాన్ వెస్లీ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 27..** జగ్గంపేట నియోజకవర్గం జగ్గంపేట లో రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ విభాగం ఉపాధ్యక్షుడు మరియు పాస్టర్ కుండా జాన్ వెస్లీ నివాసం వద్ద క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ మంత్రి మరియు మాజీ పార్లమెంట్ సభ్యుడు తోట నరసింహం హాజరయ్యారు.ముందుగా ప్రత్యేక ప్రార్ధన అనంతరం తోట నరసింహం క్రిస్మస్ సందేశాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పబ్లిసిటీ విభాగం జనరల్ సెక్రెటరీ రామకుర్తి జగదీశ్వరరావు (జగాలు) ,కాకినాడ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సాంస్కృతి విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు జగ్గంపేట టౌన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాపవరపు ప్రసాద్ , జగ్గంపేట మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా గారు, కాకినాడ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ జనరల్ సెక్రెటరీ పైడిమల్ల మల్లేష్ , కాకినాడ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం ఉపాధ్యక్షుడు జల్లి ప్రవీణ్ కుమార్ , జగ్గంపేట మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ నెంబర్, మేడిశెట్టి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## జనసంద్రంగా తొలి తిరుపతి క్షేత్రం





**పెద్దాపురం, (మనసులో మాట)డిసెంబర్ 28..** పెద్దాపురం మండలం తొలి తిరుపతి క్షేత్రం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో జనసంద్రంగా మారింది. తొలి తిరుపతి క్షేత్రంలోని శృంగార వల్లభ స్వామి దర్శనాలకు తరలివచ్చిన భక్తుల ద్వారా స్వామికి శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో రెండు లక్షల, 4వేల 714 రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డీ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ కమిటీ చైర్పర్సన్ మొయిళ్ళ సంధ్యా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, రవి ఆచార్యులు శ్రీ భూ సమేత శృంగార వల్లభ స్వామికి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్వయంభూ క్షేత్రమైన శృంగారం వల్లభ స్వామి దర్శనం సర్వశు భకరమని అర్చకులు తెలిపారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని సమర్పించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. స్వయంభూ క్షేత్రంలో శృంగార వల్లభ స్వామిని ప్రతి ఒక్క రు దర్శించి తరించాలని ఈవో శ్రీనివాసరావు కోరారు.

## వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో ఏడవ రోజు భక్తులకు రామా అవతారంలో భక్తులకు దర్శనం



**ఎటపాక( మనసులో మాట), డిసెంబరు 27:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం లోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నారు. శనివారం ఏడవ రోజు భక్తులకు రామ అవతారంలో దర్శనమిచ్చారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలు అలాగే చతిస్గడ్ ఒరిస్సా నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ ఉత్సవాలకు అధికారులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు భద్రగిరి రామనామంతో పులకించిపోయింది.

### జిల్లాలో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాలకు అవసరమైన

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయండి

### - జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 27..** జిల్లాలో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబీ) రోడ్డు అండర్ బ్రిడ్జ్ (ఆర్.యు బీ) నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి ఆర్ఓబీ ఆర్.యు.బీలకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియపై రెవెన్యూ రోడ్డు భవనాలు రైల్వే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం పీఎం గతిశక్తి పథకం కింద రైల్వే లైన్ల మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా కాకినాడ జిల్లాలో పరిధిలో వివిధ ప్రదేశాల్లో రైల్వే లైనులకు అవసరమైన ఆర్ఓబీ, ఆర్.యు.బీ లను నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రాథమిక దశలో వీటి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ఇందుకు రెవెన్యూ, సర్వే రోడ్డు భవనాల శాఖల అధికారులు సంయుక్తగా సర్వే నిర్వహించి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించిన పనులు ఎప్పటికప్పుడు స్టేజ్ అప్డేషన్ జరిగేలా అధికారులు ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లి బాబు, రోడ్డు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ జీ కాంతు, ఈఈ నర్సయ్య, రైల్వే కన్సల్టెంట్ ప్రతినిధి ఉదయభాస్కర్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తంటికొండ దేవస్థాన క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం (మనసులో మాట), డిసెంబర్ 27 :** ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన గోకవరం మండలం తంటికొండ గ్రామంలో కలియుగ దైవంగా వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థాన క్యాలెండర్ ను శనివారం జగ్గంపేట శాసనసభ్యులు టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఆలయ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, ఆలయ కార్య నిర్వహణ అధికారి చల్లా ఉదయ బాబునాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఎమ్మెల్యే జ్యోతుల స్వగృహం లో ఆయనను కలిశారు. ఆలయ పండితులు ఫణి వేదమంత్రాలతో ఎమ్మెల్యే నెహ్రూ కు తంటికొండ స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ చైర్మన్ అచ్చన్నదొర, ఈఓ చల్లా ఉదయ బాబు నాయుడు ఎమ్మెల్యే నెహ్రూ కు స్వామివారి పట్టు వస్త్రాలు అందించి, నూతన సంవత్సర క్యాలెండర్ ను ఎమ్మెల్యేకు అందించారు. దేవస్థాన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆవిష్కరించి, కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అభివృద్ధి కమిటీ డైరెక్టర్ లు బొట్టా రామకృష్ణ, చింతల నాగు, వల్లూరి ప్రసాద్, ఆలయ గుమస్తా చిన్ని, గోకవరం మండల టిడిపి మీడియా కోఎంఆర్డినేటర్ కొంగరపు రాజు పాల్గొన్నారు

## మత్తు పదార్థాల దుష్పరిమాణాలపై ఎల్ఈడి తెరపై అవగాహన



**పిఠాపురం, ( మనసులో మాట) డిసెంబరు 27:** నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పిఠాపురం సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్రీ జి. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా ఎస్పీ శ్రీ బిందు మాధవ్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, కాకినాడ అడిషనల్ ఎస్పి పాటిల్ దేవరాజ్ మనిష్ గారి పర్యవేక్షణలో శనివారం పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బి. కొత్తూరు గ్రామంలో 'డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం' నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, గంజాయి, సారా, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ప్రాణాంతక నష్టాలను ప్రజలకు వివరించారు. గంజాయి సాగు, విక్రయం లేదా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత వీటి బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. గ్రామాల్లో గంజాయి వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం రూరల్ ఎస్సై జానీ బాషా, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



**పిఠాపురం,( మనసులో మాట) డిసెంబరు 27:** బాల్యవివాహాలు సాంఘిక దురాచారమని,చట్టరీత్యా నేరమని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ సమితి కౌన్సిలర్ బి దుర్గారాణి తెలిపారు. పిఠాపురం మండలం కందరాడ గ్రామంలో జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ,బాలల హక్కుల పరిరక్షణ విభాగం,మండల న్యాయ సేవాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను జిల్లా బాలల హక్కుల కౌన్సిలర్ బి దుర్గారావు క్షుణ్ణంగా వివరించారు. బాల్య వివాహ ముక్త భారత్ అనే క్యాంపెయిన్ 27 నవంబర్ 2025 నుండి 8 మార్చ్ 2026 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ఈ కార్యక్రమాన్ని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహ నిరోధ చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తిగా వివాహం చేయరాదని అన్నారు బాల్యవివాహాలు ఒక సాంఘిక దురాచారం వాటిని ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ముఖ్యంగా బాలికలు అతి జాగ్రత్తతో వ్యవహరించాలన్నారు ప్రేమ పేరుతో వేధించే వారి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రుల నుండి మంచి చెడుల మధ్య బేధాలు తెలుసుకోవాలన్నారు. బాలికలు ఇతరుల నుండి బహుమతులు ఎట్టి పరిస్థితుల్లోని స్వీకరించరాదన్నారు. బాలలపై లైంగిక వేధింపులకు గురి చేసే వారిలో అత్యధికంగా పరిచయం ఉండి వారికి నమ్మకమైన వారీగా ఉంటూ లైంగిక దాడులకు పాల్పడుతున్నారని కావున బాలలు బాలికలు అంతా కూడా తల్లిదండ్రుల సమక్షంలోనే ప్రతి విషయాన్ని తెలియపరుస్తూ అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలన్నారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు సమాచారం ఉన్నట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ను సంప్రదించాలన్నారు. ఏదైనా అనుకోని ఆపద సంభవించినట్లయితే 112 పోలీస్ హెల్ప్ లైన్ కు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్యవివాహ చట్టరీత్యా నేరమని విద్యార్థినీ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.
ఈ కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానల్ లీగల్ అడ్వకేట్లు ఏ గీత, కే సత్యవేణి లు గ్రామ సచివాలయ మహిళా కార్యదర్శి బి సావిత్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని

# యధావిధిగా అమలు చేయాలి

### సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు



**ఎటపాక (మనసులో మాట), డిసెంబరు 27:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం పేరు మార్చడమే కాదు దాని స్వభావాన్ని దెబ్బతీస్తూ గ్రామీణ ఉపాధికి , గ్రామీణ అభివృద్ధికి కేంద్రం తూట్లు పొడుస్తుందని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు అన్నారు. శనివారం తుమ్మల నగర్ లో సోందే రామారావు అధ్యక్షతన సిపిఎం మండల కమిటీ సమావేశనికి హాజరైన మర్లపాటి నాగేశ్వరావు మాట్లాడుతూ వామపక్షాల కృషితో 2005లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ పేదల ఉపాధి కోసం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందని, నేడు అది చట్టంగా అమలవుతుందన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 90%, రాష్ట్ర ప్రభుత్వం 10% భరిస్తూ గ్రామాల్లో వందరోజులపాటు కచ్చితంగా ఉపాధిని కల్పిస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిననాటి నుండి ఉపాధి హామీ పథకంపై విషం కక్కుతోందని, కానీ నేడు ఉపాధి హామీ పథకం ఉసురు తీసారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాదిమందికి ఉపాధి తగ్గి, గ్రామపంచాయతీల అభివృద్ధి కుంటుపడుతుందని దీనికి ఉపాధి హామీ కార్మికులంతా ఏకమై నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు. అలాగే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు పిలుపునిస్తామని , మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం తిరిగి యధావిధిగా కొనసాగే వరకు మా పోరాటం ఉంటుందని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కాక అర్జున్ దొర, మండల కమిటీ సభ్యులు పులుసు బాలకృష్ణ, పూనెం వెంకట్రావు, సవలం రాము, గద్దల హుస్సేన్, జంగిలి సంపత్ పాల్గొన్నారు.



### కోడి కత్తులు తయారిదారుల పై

# పోలీసులు దాడులు

- ముగ్గురు నిందితులు అరెస్ట్
- కొత్తపల్లి కామరాజుపేట గ్రామాల్లో 200 కోడి కత్తులు స్వాధీనం

**గోకవరం (మనసులో మాట), డిసెంబర్ 27 :** కోడి కత్తులు తయారిదారుల పై పోలీసులు దాడులు చేసి ముగ్గురు నిందితులు అరెస్ట్ చేసి 200 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్న సంఘటన శనివారం గోకవరం మండలం లో జరిగింది. దీనికి సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోరుకొండ సి.ఐ. ఎస్.వి.వి.ఎస్ మూర్తి మాట్లాడుతూ గోకవరం మండలం కొత్తపల్లి, కామరాజుపేట గ్రామాల్లో కోడి కత్తులు తయారీ దారుల పై దాడులు చేసి కొత్తపల్లి గ్రామానికి చెందిన చేదులూరి వీరబాబు, సూరంపూడి కోటేశ్వర రావు ఏ లింగయ్య తో పాటు కామరాజుపేట గ్రామానికి చెందిన వేములూరి నాగేశ్వరరావుని అదుపులోనికి తీసుకొని, వారి వద్ద నుండి 200 కోడికత్తులు, కత్తుల తయారీకి ఉపయోగించే రెండు మోటర్ మిషన్ లు, రేకులు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సి.ఐ. ఎస్.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు.

**సంక్రాంతి పండుగ లో సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి**

రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు నివారించుటకు ఈ దాడులు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామ పెద్దలు, ప్రజలు సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని, ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సి.ఐ. ఎస్.వి.వి.ఎస్ మూర్తి హెచ్చరించారు. ఈ దాడుల్లో గోకవరం ఎస్సై వి.ఎన్.వి. పవన్ కుమార్, మహిళ ఎస్సై బి.నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

## బస్వా రామ్మూర్తి సేవలు చిరస్మరణీయం



**పిఠాపురం, ( మనసులో మాట) డిసెంబరు 27:** పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో మాజీ సర్పంచ్, నిస్వార్థ ప్రజాసేవకుడు స్వర్గీయ బస్వా రామమూర్తి విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమం శనివారం చిత్రాడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గతంలో రోడ్డు విస్తరణ పనుల కారణంగా తొలగించిన ఈ విగ్రహాన్ని, గ్రామస్తులందరూ స్వచ్ఛందంగా ఏకమై ప్రముఖ శిల్పి కాగితాల కృష్ణ చేత నూతనంగా తయారు చేయించి తిరిగి ప్రతిష్టించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రామమూర్తి వారసులు మాట్లాడుతూ. స్వాతంత్ర్యానికి పూర్వం నుండి చిత్రాడ గ్రామానికి సుమారు నాలుగు పర్యాయాలు సర్పంచిగా సేవలు అందించిన రామమూర్తి, తన సొంత ఆస్తిని సైతం ప్రజల కోసం వెచ్చించిన మహోన్నత నాయకుడని కొనియాడారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ సమానంగా చూస్తూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచిన ఆయన వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బస్వా రామమూర్తి వారసులు బస్వా ప్రకాష్ రావు, బస్వా గంగరాజు, మాజీ సర్పంచ్ బస్వా శ్రీనివాస్, పీబీసీ చైర్మన్ బస్వా నాగ పత్తులు, బస్వా చిట్టిబాబు (చిట్టిబాబు ఎంటర్ప్రైజెస్), పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం గ్రామస్తులు ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.

### యూరియా అధిక ధరలకు అమ్మితే

# అపరాధమే

**పిఠాపురం, ( మనసులో మాట) డిసెంబరు 27:** పిఠాపురం మండలంలోని పలు ప్రైవేట్ ఎరువుల దుకాణాలను, రైతు సేవా కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. విజయకుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను, యూరియా లభ్యతను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రతి దుకాణం, రైతు సేవా కేంద్రం వద్ద యూరియా నిల్వలు, ధరల వివరాలతో కూడిన లభ్యత బోర్డులను రైతులకు కనిపించేలా బహిర్గతంగా ప్రదర్శించాలని డీలర్లను ఆదేశించారు. ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరలకే విక్రయించాలని, అంతకంటే ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అవసరమైన మేర యూరియాను సొసైటీలు మరియు డీలర్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు తమ సాగునీటి కొరత గురించి అధికారుల దృష్టికి తీసుకురాగా, వెంటనే నీటిపారుదల శాఖ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని విజయకుమార్ హామీ ఇచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమలో పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు స్వాతి, మండల వ్యవసాయ అధికారి వై.వి. గంగాధర్ స్థానిక రైతులు పాల్గొన్నారు.






## ఈ నెల 30న సామర్లకోటలోరాష్ట్రీయ సూర్య బలిజి సంఘం వెబ్సైట్ ప్రారంభం

**ఐ.పోలవరం, ( మనసులో మాట) డిసెంబర్ 27..** సూర్య బలిజ కులస్తుల కుల గణనపై ఈనెల 30వ తేదీన సామర్లకోటలో రాష్ట్రీయ సూర్య బలిజి సంఘం నేతృత్వంలో ప్రత్యేక వెబ్సైటును ప్రారంభం కానున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఉభయ రాష్ట్రాల్లో ఉన్న సూర్య బలిజి కులస్తుల గణాంక వివరాలను తెలియజేసేందుకు ఈ వెబ్సైట్ను ప్రారంభించనున్నారు. డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు రాష్ట్రీయ సూర్య బలిజ సంఘం డాట్ కామ్ పేరిట వెబ్సైట్ ప్రారంభమవుతుంది. ఈనెల 30వ తేదీన సామర్లకోటలో లీడర్ గారి తోట, గణపతి నగర్, పెద్దాపురం రోడ్డులో గల శ్రీదేవి ప్రశాంతి నిలయంలో ఈ కార్యక్రమాన్ని చేపడతారు.రాష్ట్రీయ సూర్య బలిజి సంఘం అధ్యక్షులు పితామహుడు గూడూరు వెంకట మోహన్ రావు వెబ్సైట్ను ప్రారంభించగా, జ్యోతి ప్రజ్వలన సూర్య బలిజ సంఘం ప్రతినిధి మన్నారి శ్రీనివాసు సుధాకర్ చేస్తారు. వెబ్సైట్ లాంచింగ్ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సూర్య బలిజి సంఘం అధ్యక్షులు, ప్రముఖ సీనియర్ న్యాయవాది ఏలూరి సుబ్రమణ్యం శ్రీకారం చుడతారు. వెబ్సైట్లో ఫస్ట్ రిజిస్ట్రేషన్ ను ఆముదాల వలస కు చెందిన నెల్లూరు సూర్యప్రసాదరావు చేస్తారు. ఈ కార్యక్రమానికి ఉభయ రాష్ట్రాలకు చెందిన సూర్య బలిజ కులస్తుల తో పాటు ఉభయగోదావరి జిల్లాలతో పాటు సూర్య బలిజ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా సూర్య బలిజ సంఘం ప్రతినిధి ప్రముఖ న్యాయవాది అల్లు భాస్కరరావు పిలుపునిచ్చారు.

## జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై బాబి

### నిరుద్యోగ భృతి 3 వేల రూపాయలు ఈ జనవరి నుంచి ఇవ్వాల్సిందే




**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 27..** కాకినాడ జిల్లా కాకినాడ అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కాకినాడలో ఆర్టీవో సెంటర్ సర్పవరం జంక్షన్ కోకిల సెంటర్ చార్మినార్ సెంటర్ పలుచోట్ల ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సామూహిక భిక్షాటన చేయడం జరిగింది దీనిని సిపిఐ సీనియర్ నాయకులు కోమర్తి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై బాబి మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ జనవరికి రెండవ వచ్చిన జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని అధికారంలోకి రాకముందు 20 లక్షలు ఉద్యోగాలు వేల రూపాయలు ఇస్తామని అధికారంలోకి వచ్చాక ఆ ఊసే మరిచారని అన్నారు ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం లేక 3 వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మించి మోసం చేశారు అలాగే వాలంటీర్స్ కి పదివేల రూపాయలు ఇస్తామని అధికారంలోకి వచ్చాక వారిని పూర్తిగా తొలగించారని విమర్శించారు ఈ జనవరికి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని లేకుంటే 2026 నిరుద్యోగుల సంవత్సరం పోరాటాల సంవత్సరంగా మిగిలిపోతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎం వీరబాబు. ఈ మధుబాబు బోండా మైకేల్ దుర్గ లోవరాజు ధర్మరాజు అనిల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# కాకినాడ జిల్లా ఏపీ ఎన్జీజీఓ ఎన్నికలు ఏకగ్రీవం

**- రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వనమాడి పిలుపు**
**- జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా గుద్దటి,మూర్తిలు ఎన్నిక**





**కాకినాడ( మనసులో మాట) డిసెంబర్ 27..** కాకినాడ జిల్లా ఏపిఎన్జీజీవో అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షుడిగా గుద్దటి రామ్మోహన్ రావు, కార్యదర్శిగా పిఎన్కే వివిఎస్ మూర్తిబాబులు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చోడగిరి శ్రీనివాసరావు ప్రకటించారు. శనివారం కాకినాడలోని ఏపీఎన్జీజిఓ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్జీజీవో కాకినాడ జిల్లాకు చెందిన 17 పోస్టులకు గాను నామినేషన్లు దాఖలు కావడంతో వారందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా గుద్దటి రామ్మోహన్ రావు అసోసియేట్ అధ్యక్షుడిగా మట్టపర్తి వెంకటేశ్వరరావు ఉపాధ్యక్షులుగా సరెళ్ల చంద్రరావు కెవిఎన్వి ప్రసాద్ పి పాండురంగారావు ఎంఎన్ సత్యనారాయణ ఆర్ జయకృష్ణ మహిళా ఉపాధ్యాక్షురాలుగా ఎస్వీ భారతి, కార్యదర్శిగా పిఎన్కెవివిఎస్ మూర్తి బాబు ఆర్గనైజింగ్ సెక్రటరీగా వై రామకృష్ణ జాయింట్ సెక్రటరీలుగా బి శ్రీనివాసరావు ఎన్ వీరబాబు టి చార్లెస్ పాల్ ఎస్-ఎల్ పరిమళ్ కుమార్ టి వెంకటరమణ మహిళా సెక్రటరీగా మహిళా జాయింట్ సెక్రటరీగా వి విజయలక్ష్మి, కోశాధికారిగా వై పద్మ మీనాక్షిలు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. నూతన కార్యవర్గమంతా సంఘ ఉద్యోగుల సమక్షంలో పదవీ బాధ్యతలు చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యవర్గం పదవీకాలం మూడేళ్ల పాటు ఉంటుందని లేదా ఎన్నికలు జరిగేంత వరకు కొనసాగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు అందించారు. నూతన కార్యవర్గం ఉద్యోగులందరూ సీఎం చంద్రబాబు చేస్తున్న రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని సూచించారు. కాకినాడ నగరంలో నగరాభివృద్ధి ఉద్యోగుల సహకారం ఉండాలని కోరారు. తన వంతు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కొండబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి ఎన్వి రామారావు పర్యవేక్షణ అధికారిగా ఏ.రంజిత్ కుమార్ నాయుడులు వ్యవహరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఆచంట రామారాయుడు బూరిగ ఆశీర్వాదం రాష్ట్ర ట్రెజరీస్ అకౌంట్స్ ఉద్యోగుల అధ్యక్షులు పాము శ్రీనివాస్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ కార్యదర్శి వేపకాయల వెంకటకృష్ణ, జిల్లా విద్యాశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మొండి రవికుమార్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం ఇన్చార్జ్ అధ్యక్షుడు కడలి శేషగిరిరావు, రాష్ట్ర పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్వివి రమేష్, కూటమి నాయకులు కటకం శెట్టి సత్య ప్రభాకర్, మట్టా ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్రావు, మూర్తిబాబులు మాట్లాడుతూ తమను వరుసగా మూడోసారి ఎన్నికలలో విజయానికి సహకరించిన ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల అభివృద్ధికి తను వంతు ఎనలేని కృషి చేస్తానని చెప్పారు. ఇదేవిధంగా కాకినాడ జిల్లా ఉద్యోగులు అందరూ తమకు సహకరించాలని వారు కోరారు.



# పిఠాపురం లో సంచలనం రేపుతున్న అధికార పార్టీ నేతల కాల్ రికార్డింగ్ లు

**- ఎవరు ఆ ఇద్దరు నేతలు?**
**- అధికార పార్టీకి చెందిన ఇరువురు నేతల పంపకాలలో తేడా రావడంతో ఒకరి లోపాలను మరొకరు సామాజిక మాధ్యమాల వేదికగా బయటపెట్టుకున్న వైనం**
**- ఎఫ్ కే పాలెం జల్లూరు మధ్య నిర్మాణం చేపడుతున్న లేఅవుట్ యాజమాన్యం నుండి భారీగా ముడుపులు అందుకున్నట్లు సమాచారం.**



**పిఠాపురం, (మనసులో మాట) డిసెంబరు 27:** పిఠాపురం మండలం ఎఫ్.కె పాలెం గ్రామంలో గత రెండు రోజులుగా అధికార పార్టీ నేతల కాల్ రికార్డింగ్లు సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్నాయి. ఎఫ్.కె పాలెం జల్లూరు గ్రామాల మధ్య నూతనంగా నిర్మాణం చేపడుతున్న లేవుట్ వ్యవహారాలపై సంభాషణ కు సంబంధించి ఆడియోలు బయటపడిన వైనం.

ఇటీవల పిఠాపురం మండలంలోని ఎఫ్ కె పాలెం గ్రామ శివారులోని సుమారు 5.92 ఎకరాల భూమిలో కొందరు వ్యక్తులు లేఅవుట్ చేశారు.లేఅవుట్ నిర్వాహకులను కొంతమంది స్థానిక అధికార పార్టీ నేతలు డబ్బు కోసం ఒత్తిడి చేసినట్లు సమాచారం.వీరిలో ఒక నాయకుడు పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి,పార్లమెంట్ స్థాయి ప్రజాప్రతినిధి పేర్లను ప్రస్తావిస్తూ ముడుపులు ఇవ్వాలని డిమాండ్ చేశారని అయితే ఉన్నత స్థాయి నేతలు ఆ ముడుపులను తిరస్కరించినట్లు సమాచారం.దాంతో ఆ స్థానిక నాయకుడు అధికార పార్టీ నేతల నుంచి,అధికారుల నుంచి గాని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తానే అన్ని చూసుకుంటానని లేఅవుట్లో తనకు స్థలం కేటాయించి,ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని నిర్వాహకులపై ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది.ఈ ప్రతిపాదనకు నిర్వాహకులు అంగీకరించడంతో శంకుస్థాపన కార్యక్రమం కూడా జరిగినట్లు సమాచారం.అయితే ఈ విషయం వెలుగులోకి రాగానే మరో స్థానిక అధికార పార్టీ నాయకుడు, గ్రామ ఉప సర్పంచ్ తనకి కూడా లేఅవుట్లో వాటా ఇవ్వాలని కోరినట్టు రూ.6 లక్షలకు బేరం కుదిరినట్లు ప్రచారం జరిగింది.ఈ వ్యవహారానికి సంబంధించిన ఆడియో క్లిప్పింగ్ బయటకు రావడంతో కొత్త వివాదం రేగింది. ఇరువురు నేతలు ఒకరిపై మరొకరు గుర్రుగా వారి బాగోట్టాను బయట పెట్టుకోవడంతో విషయం బయటకు పొక్కింది. తాజాగా ఆ గ్రామానికి చెందిన ఓ నేత కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(కూడా) నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీకి ఇవ్వాల్సిన పది శాతం స్థలాన్ని లే ఔట్ వాళ్ళు కేటాయించలేదని, నిబంధనల ప్రకారం లేఅవుట్ లలో నిర్మాణాలు సాగలేదని కాబట్టి అధికారులు దానిమీద చర్యలు తీసుకోవాలని పాడా అధికారులకు ఫిర్యాదు చేశారు.తాను ఎటువంటి డబ్బు లేదా స్థలం తీసుకోలేదని, లేఅవుట్ ద్వార పంచాయతీకి రావాల్సిన హక్కులు సాధించే వరకు తాను పోరాడుతానని ఆయన స్పష్టం చేశారు.కూటమి నేతలు అక్రమాలకు తమ ప్రభుత్వంలో తావులేదని బహిరంగంగా చెబుతుంటే, మరో వైపు పిఠాపురం నియోజకవర్గంలో ఇదే తరహా చర్యలు చోటు చేసుకోవడం ప్రజల్లో ఆశ్చర్యం రేపుతోంది.

# ఆదర్శ ప్రాయుడు బాదం మాధవరావు



**పిఠాపురం, మనసులో మాట డిసెంబరు 26:** సామాజిక వేత్త,వితరణ శీలి, ప్రముఖ దాత దివంగత బాదం మాధవరావు 87 వ జయంతి వేడుకలు స్థానిక శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంధాలయంలో ఘనంగా నిర్వహించారు. పీఠికాపుర సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ , మహబూబ్ నగర్ జిల్లా అడిషనల్ కలక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాదం మాధవరావు వంటి నిస్వార్థ పరులు సమాజాభివృద్ధికి ఎంతైనా అవసరమన్నారు.వారి పేరు మీద సాహితీ పురస్కారం పొందడం తనకు మరింత గౌరవాన్ని కలిగిస్తుందని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గ్రంధాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు మాట్లాడుతూ పిఠాపురం పట్టణ అవసరాలకు అనుగుణంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిన మాధవరావు చిరస్మరణీయులని అన్నారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిధులుగా విచ్చేసిన విశ్రాంత తహసీల్దార్, ఆస్వాదన సాహితీ సంస్థ కార్యదర్శి కొరుప్రోలు గౌరినాయుడు మాట్లాడుతూ లలిత కళలపై మాధవరావుకున్న శ్రద్ధా భక్తులను కొనియాడారు. సంగమేశ్వర సంగీత సమాఖ్య అధ్యక్షులు గట్టి కృష్ణ దేవరాయలు,సాహితీవేత్త సోమయాజులు, విశ్రాంత ప్రభుత్వ ఉన్నతోద్యోగి వెన్నపు చక్రధరరావు తదితరులు మాధవరావు సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ప్రముఖ సాహితీ వేత్త,చరిత్ర పరిశోధకులు ర్యాలి ప్రసాద్ నిర్వహించిన జాతీయ స్థాయి పద్యకవితా పురస్కారాన్ని డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డికి ప్రదానం చేశారు.కార్యక్రమాన్ని బాదం మాధవరావు సోదరులు వితరణ శీలి బాదం సూర్య ప్రకాష్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అల్లవరపు నగేష్, పెమ్మరాజు రామచంద్రరావు, కోమనపల్లి అప్పారావు,కెవిఎస్ ప్రసాద్, చింతపల్లి సింహాద్రి, పిఠాపురం పట్టణ ప్రముఖులు,విద్యార్థులు పాల్గొన్నారు.



## సర్పంచ్ వీర రాఘవ సినిమా స్క్రిప్ట్ కి పూజలు



**ఐ. పోలవరం,( మనసులో మాట) డిసెంబర్ 27..** ప్రేమ, వినోదం, యాక్షన్, తోకూడుకున్న వైవిధ్యభరితమైన 1980 నాటి పరిస్థితుల సన్నివేశాలతో చిత్రీకరిస్తున్న సర్పంచ్ వీర రాఘవసిమిమా స్క్రిప్ట్ కి సినీ బృందం మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. డాక్టర్ బి.ఆర్ కోనసీమ జిల్లా పరిసర ప్రాంతాల్లో సినిమాకు తగ్గట్టుగా అనుకూలమైన గ్రామీణ ప్రాంత వాతావరణం దొరికినట్లు సినిమా డైరెక్టర్, ప్రొడ్యూసర్ ఆరు తెలిపారు. ప్రధాన పాత్రలలో ప్రముఖ సినీ నటుడు దిల్ రమేష్, అపరంజిత తోపాటు లోపాటు పలువురు ప్రముఖులు తారాగణంలో జనవరి చివరి నాటి నుండి సినిమా షూటింగ్ మొత్తం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ చేయనున్నట్లు తెలిపారు. సినిమా ప్రారంభకాలం నుండి నిర్విరామంగా పనులు జరుగుతున్నాయని స్వామి వారి అనుగ్రహముతో చిత్రం నిర్విఘ్నంగా పూర్తయ్యి అఖండ విజయం సాధించాలని వేడుకొన్నట్లు తెలిపారు.

## మున్సిపల్ పాఠశాలలో నో బ్యాగ్ డే



**పెద్దాపురం (మనసులో మాట) డిసెంబర్ 28..** కాకినాడ జిల్లా సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి, వారి ప్రతిభను మరింత మెరుగుపరిచేందుకు మండల విద్యాశాఖ అధికారులు పుల్లయ్య, శివరామ కృష్ణయ్య, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సహకారంతో ప్రత్యేక కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. శనివారం నో బ్యాక్ డే సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంస పత్రాలు కూడా అందించినట్లు తెలిపారు. ఒత్తిడి లేని మంచి విద్య కోసం విద్యార్థులకు నిర్వహించిన నో బ్యాగ్ డే కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శివకుమార్, యాదిద్య, సైదునిషా బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్ఎఫ్ఐ కల్చలర్ ఫెస్ట్




**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 27..** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) శనివారం స్థానిక అంబేద్కర్ భవనంలో ఘనంగా నిర్వహించారు.విద్యార్థులలో పెరుగుతున్న అసాంఘిక భావాలను ఒత్తిడిని తగ్గించడానికి విద్యార్థులకు సామాజిక బాధ్యత పెంచడానికి ఎస్.ఎఫ్.ఐ ఒక బాధ్యతగా ఈ కల్చరల్ ఫెస్ట్ నిర్వహించడం జరిగిందని, ప్రస్తుతం ఉన్న సమాజంలో ఉన్న దుష్ప్రభావాల నుంచి విద్యార్థులను దూరం చెయ్యాలని విద్యార్థులను మంచి మార్గం వైపు నడిపేల విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసే ఉద్దేశంతోనే ఎస్.ఎఫ్.ఐ ఈ కల్చరల్ ఫెస్ట్ నిర్వహించడం జరిగిందని ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.లోవరాజు ఎం.గంగా సూరిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో 8 నెలల వయసున్న పిల్లల నుండి 20 సంవత్సరాల వయసున్న విద్యార్థులు వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి సుమారు 500 మంది పాల్గొన్నారని క్లాసికల్ డాన్స్ లు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామాలపై వ్యాసరచన వాకృత్వం చిత్రలేఖనం మరియు చెస్ రన్నింగ్ లాంగ్ జంప్ హై జంప్ వంటి పోటీలను నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఆదివారం కూడా ఈ ఫెస్ట్ కొనసాగుతుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్.ఎఫ్.ఐ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ సభ్యులు కాకినాడ నగర కమిటీ సభ్యులు ఎస్.ఎఫ్.ఐ నాయకులు తల్లి తండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
ఆదివారం 28 డిసెంబర్ 2025


# తిరుమలలో భక్తులకు టీటీడీ కీలక సూచన

**తిరుమల (మనసులో మాట ):** తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. వరుస సెలవుల కారణంగా రద్దీ పెరిగింది. పెరిగిన రద్దీకి అనుగుణంగా టీటీడీ నిర్ణయాలు తీసుకుంటోంది. తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు జరగనున్న వైకుంఠద్వార దర్శనాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసారు.

ఇదే సమయంలో కొత్త సంవత్సరం కావటంతో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దీంతో, ఈ సమయంలో దర్శనంకు వచ్చే భక్తులకు టీటీడీ కీలక సూచన చేసింది.

వైకుంఠ ద్వార దర్శనం కోసం వచ్చే భక్తులకు టీటీడీ ఈవో సింఘాల్ కీలక సూచనలు చేసారు. ఈ పది రోజులు కూడా పవిత్రమైనవే, వాటిలో ఏరోజు స్వామివారిని దర్శించుకున్నా ఒకే రకమైన ప్రతిఫలం లభిస్తుందని సింఘాల్ చెప్పారు. వైకుంఠ ద్వార దర్శనాల కోసం మొదటిసారి ఈ-డిప్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. మొదటి మూడు రోజుల దర్శనాలకుగాను దేశ వ్యాప్తంగా 1,89,000 మంది భక్తులకు పూర్తి పారదర్శక విధానంలో టోకెన్లు జారీ చేశామని తెలిపారు. టోకెన్లు పొందినవారు నిర్దేశిత సమయంలోపు తిరుమలకు చేరుకుంటే రెండు గంటల్లోనే శ్రీవారి దర్శనాన్ని పూర్తిగా చేయిస్తామని సింఘాల్ అన్నారు. ఈ మేరకు మూడు ప్రవేశమార్గాలను కూడా సిద్ధం చేశామన్నారు.

కేటాయించిన సమయానికి వచ్చే భక్తులకు క్యూలైన్‌కు దగ్గరగా ఉన్న ప్రవేశమార్గం ద్వారా లోపలికి పంపుతామని వెల్లడించారు. సమయాని కంటే ముందుగా వచ్చేవారిని మరో రెండు ప్రవేశమార్గాల గుండా క్యూలైన్‌లోకి తీసుకుని వారికి కేటాయించిన సమయంలోనే దర్శనానికి పంపే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఏకాదశికి ముందు 29వ తేదీన మాత్రం పరిమిత సంఖ్యలో టికెట్లు జారీ చేసి, వారికి అదేరోజు దర్శనాలు ముగిసేలా చూస్తామని సింఘాల్? అన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్?లో కలిపి 7,70,000 మందికి పది రోజుల్లో శ్రీవారి దర్శనం కల్పించనున్నామని ఈవో వెల్లడించారు. 182 గంటల్లో 164 గంటలు సామాన్యభక్తులకే కేటాయించామని తెలిపారు. మిగిలిన సమయం మాత్రమే వీఐపీలు, వీవీఐపీలకు కేటాయించామన్నారు.

రైతులకు ఏపీ ప్రభుత్వం న్యూ ఇయర్ కానుక - మరో హామీ అమలు..!!

ఈ పది రోజుల్లో ప్రివిలేజ్ దర్శనాలు, బ్రేక్ దర్శనాలను మాత్రం పూర్తిగా రద్దు చేశామని చెప్పారు. నేరుగా వచ్చే ప్రముఖులకే దర్శనం ఉంటుందన్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కేంద్రంలో ఉదయం 8 నుంచి రాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తామని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. దాదాపు 16 రకాల అన్నప్రసాదాలు, పానీయాలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వసతికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. తిరుమలలో భద్రత నిమిత్తం పోలీసు విభాగం నుంచి 2400, టీటీడీ విజిలెన్స్ నుంచి 1100 మంది సిబ్బందిని నియమించామని వెల్లడించారు. టీటీడీకి అనుబంధంగా ఉన్న ఆరు లక్షల మంది శ్రీవారి సేవకుల సాయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఈవో పేర్కొన్నారు.


# రాజీ కుదిరింది మాధవీలతను ఆహ్వానిస్తాం

**- తాడిపత్రిలో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న జేసీ**
**- మూడు రోజుల పాటు కొనసాగనున్న సెలెబ్రేషన్స్ - భద్రతపై పూర్తిగా దృష్టి సారిస్తామని వెల్లడి**

**తాడిపత్రి (మనసులో మాట):** తాడిపత్రిలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ నేత, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సిద్ధమవుతున్నారు. మూడు రోజుల పాటు కొనసాగే న్యూఇయర్ వేడుకలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. ఈ వేడుకలకు సినీ నటి మాధవీలతను ఆహ్వానించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ సమీపంలో మీడియాతో మాట్లాడిన జేసీ ప్రభాకర్‌రెడ్డి... పెన్నానది ఒడ్డున ఉన్న పార్కును వేడుకల వేదికగా ఎంపిక చేసినట్లు చెప్పారు. గతేడాది ఇదే పార్కులో జరిగిన న్యూఇయర్ వేడుకలపై మాధవీలత చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద దుమారాన్ని రేపిన సంగతి తెలిసిందే. అయితే ఆ అంశంలో ఇరువర్గాల మధ్య రాజీ కుదిరిందని, అందుకే ఈసారి ఆమెను ఆహ్వానించాలని నిర్ణయించామని జేసీ తెలిపారు. అయితే రావడం పూర్తిగా ఆమె ఇష్టమేనని అన్నారు.న్యూఇయర్ వేడుకలను అన్ని వర్గాల ప్రజలు ఆస్వాదించేలా ప్రత్యేకంగా ప్లాన్ చేసినట్లు ఛైర్మన్ వివరించారు. డిసెంబర్ 29న చిన్నపిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని, కుటుంబ సమేతంగా హాజరవ్వొచ్చని తెలిపారు. 30న యువతను ఆకట్టుకునే కార్యక్రమాలు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 31న పెద్దల కోసం ప్రత్యేకంగా వేడుకలు ఉంటాయని వెల్లడించారు. 29, 30 తేదీల్లో అన్ని వయసుల వారు హాజరయ్యేలా అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు.వేడుకల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తామని జేసీ తెలిపారు. ప్రజలు సహకరించి వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.







# టాటా అంటే టోటల్!

**రతన్ టాటా పుట్టినరోజు**
**28.12.1937**

చిన్నప్పటి నుంచి ఆ పేరు వింటేనే
అదోలాంటి థ్రిల్లు.. పులకించే దిల్లు..
రతన్ టాటా..
పేరులోనే మ్యాజిక్.. సక్సెస్ మ్యూజిక్..!
గుండుసూది మొదలు
విమానం వరకు.. టాటా ఉత్పత్తులు
ఉండాలన్నది రతన్ లక్ష్యం..ఇంటింటా టాటా వస్తువులే
ఆ విజయాలకు సాక్ష్యం..!
ఈ కామర్స్ లో పడకుండా డీలా.. స్నాప్ డీల్..
సామాన్యుడి అమృతం టీ
అక్కడా లేదు పోటీ.. నగరాల్లో రవాణా..
లేదనుకోకు టికానా.. టాటా పెట్టుబడితో
సిద్ధమైన ఓలా. క్షణాల్లో ఎదుటనిలిచే
రంగీలా.. చైనా ఫోను క్సియోమి
పోను పోను చలనఫోన్ల రంగంలోనూ టాటా
సంచలనం..
టాటా ల్యాండ్..డొకోమో.. అదిరిపోయిన ప్రోమో..
రియల్ లోనూ ఓ చేయి.. ఆ రంగంలో నెస్ట్అవే దే
ఇప్పుడు పైచేయి.. తదనంతరం జెనిపై సొంతం..
సేవ చేయడమే ఆసాంతం..
సీనియర్ సిటిజన్ల జీవనం ప్రశాంతం..
అందుకోసమే మొదలైంది
గుడ్ ఫెల్లోస్.. రతన్ నీడలో
హాయిగా పెద్దోళ్ల టైంపాస్..!
సామాన్యుడి కారుగా
అప్పుడెప్పుడో అనుకున్న మారుతి..
ఇప్పుడు ధర చూస్తే పోయే మతి..
రతన్ మస్తిష్క వర్క్ షాపులో
రూపు దిద్దుకున్న నానో..
ఈడేరిన సగటు భారతీయునికారు కల..
ఇప్పుడైతే మరింత సొగసుగా..
రోడ్డుపై ఇంకాస్త దర్జాగా..!
రతన్ టాటా.. వ్యాపారంలో దిగ్గజమైతే
బుద్ధిలో వారిజం.. సాయపడ్డమే ఇజం...
ఇది నిజం.. సొంత లాభం
కొంత మానుకుని పొరుగువాడికి సాయపడవోయ్..
దానమంటే నిదానం కాదు.. అది టాటాజీ విధానం!
మందు తయారీకి నో.. సరదా సరదా సిగిరెట్టు
కాలేదెపుడు టాటా వారి పనిముట్టు..
మంచితనమే పాలసీ..సంస్కారమే లెగసీ..!
ఆయన.. సామాన్యుల్లో సామాన్యుడు
ఉద్యోగుల్లో సద్యోగి.. మనుషుల్లో దేవుడు.. ధన్యజీవుడు..!

**సురేష్ కుమార్ ఇ**
**9948546286, 7995666286**

# గూడూరు తిరిగి నెల్లూరు జిల్లాలోనే కొనసాగింపు

**- కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలపైనా స్పష్టత**
**- సీఎం చంద్రబాబు నిర్ణయంపై సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హర్షం**

**నెల్లూరు (మనసులో మాట ):** గూడూరు నియోజకవర్గంతో పాటు కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి స్పందిస్తూ... ప్రభుత్వ తాజా నిర్ణయం గూడూరు ప్రజలతో పాటు ఎమ్మెల్యే సునీల్ కుమార్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రజలందరిలో ఆనందం నింపిందన్నారు. 2024 ఎన్నికల



సమయంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చారని కొనియాడారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను, వారి అభిప్రాయాలను కూటమి ప్రభుత్వం గౌరవించిందని పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో జరిగిన అస్తవ్యస్త జిల్లాల విభజనతో నెల్లూరు జిల్లా ప్రజలు తీవ్రంగా నష్టపోయారని సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీసిటీ, షార్, పులికాట్ సరస్సు, మేనకూరు సెజ్ వంటి కీలక ప్రాంతాలతో పాటు వెంకటగిరి పోలేరమ్మ, సూళ్లూరుపేట చెంగాళమ్మ వంటి ప్రముఖ దేవస్థానాలను కూడా కోల్పోయామని గుర్తుచేశారు. ఇప్పుడు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపడంతో రామాయపట్నం పోర్టు కూడా చేజారిపోతోం దన్నారు. ఇలాంటి తరుణంలో గూడూరును, మూడు మండలాలను నెల్లూరులోనే కొనసాగించాలనే నిర్ణయం తీవ్ర నిరాశలో ఉన్న ప్రజలకు పెద్ద ఊరటనిచ్చిందని సోమిరెడ్డి అభిప్రాయపడ్డారు.

### దళిత కాలనీల్లో మినరల్ వాటర్ ప్లాంట్ల

# ఏర్పాటుకు మొదటి ప్రాధాన్యత

**- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**

నంద్యాల జిల్లా పరిధిలోని ఎస్ సి, ఎస్టీ, బి సి, మైనారటీ ప్రజలు అధికంగా ఉండే దళిత కాలనీలలో తన ఎంపీ నిధులచే నిర్మాణం చేసే మినరల్ వాటర్ ప్లాంట్లకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, స్కూల్లు, ప్రభుత్వం ఆసుపత్రులు, ఆర్ టీ సి బస్టాండ్లతో పాటు నిరుపేదలు అధికంగా ఉన్న కాలనీ లలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి శుద్ధి చేసిన మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.



శనివారం నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పగిడ్యాల రోడ్డులోని బైరెడ్డి నగర్, సి ఎస్ ఐ పాలెం, సంతగేటు స్కూల్ సమీపంలో, ప్రభుత్వం ఆసుపత్రి ఆవరణలో, ఆర్ టీ సి కొత్త బస్టాండ్ ఆవరణలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీ నిధులు రూ. 35 లక్షలతో నూతంగా మినరల్ వాటర్ ప్లాంట్లు నిర్మాణం పూర్తి చేసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ప్రజల ప్రజల దాహార్తిని తీర్చేందుకు, ఎంపీ నిధులు ఎక్కువ ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా మినరల్ వాటర్ ప్లాంట్ల వద్ద క్యూ పద్ధతి, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. శుద్ధి చేసిన మంచినీరుతో ఎక్కువ రోగాలు దూరం అవుతాయని, కలుషిత నీటికి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ చాంద్ బాషా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, రైల్వే జోనల్ వినియోగదారుల సలహా కమిటీ మెంబర్ నాగేశ్వరావు, మురళీధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రఘు రామిరెడ్డి టి.డీ.పి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళితులపై దమనకాండ

**అధికార అండతోనే ఈ అరాచకాలా? న్యాయం జరిగే వరకు ఆగని బహుజన పోరాటం!**

**తాడిమర్రి డిసెంబర్ 27 (మనసులో మాట)..** మండలం పుల్లపల్లి గ్రామంలో దళితులైన ధనుంజయ, పార్వతి కుటుంబాలపై జరిగిన హత్యాయత్నం ఘటన నాగరిక సమాజాన్ని తలదించుకునేలా చేసింది. నిందితులకు మంత్రి సత్యకుమార్ అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు, పోలీసుల సమక్షంలోనే వారు స్వేచ్ఛగా తిరగడం ప్రజాస్వామ్య వ్యవస్థకే పెను సవాల్‌గా మారింది.రాజ్యాంగం కల్పించిన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నివారణ చట్టం1989 ప్రకారం స్టేషన్ బెయిల్ కూడా లభించని ఈ ఘోరమైన కేసులో, నిందితులను రిమాండ్ పేరుతో ఇంటికి పంపడం చట్టాన్ని అపహాస్యం చేయడమే. ఇది బాధిత దళిత కుటుంబాలపై మరోసారి జరిగిన న్యాయహత్యగా భావించాల్సి ఉంటుంది.బాధితుల ఫిర్యాదులనుపక్కనపెట్టి, పోలీసులు సొంతంగా కథలు అల్లుతున్న తీరు వెనుక ఎవరి ఒత్తిళ్లు పనిచేస్తున్నాయో ప్రజలకు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. చట్టాన్ని రక్షించాల్సిన వ్యవస్థే నిందితులను రక్షించేలా వ్యవహరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.ఈ ఘటనపై డీఎస్పీ తీరును తీవ్రంగా ఖండిస్తూ, తక్షణమే నిందితులను జైలుకు పంపి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోకపోతే బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ గారు మరియు ఇతర నాయకులు హెచ్చరించారు.అణగారిన వర్గాల ప్రాణాలకు రక్షణ లేని చోట ఉద్యమం తప్పదని, నిందితులకు శిక్ష పడే వరకు ఈ పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలోబహుజన చైతన్య వేదిక వ్యవస్థాపకులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ గారు,గౌరవ అధ్యక్షులు బాబు ప్రసాద్ గారు,ట్రెజరర్ రామాంజనేయులు గారు,మారుతి గారు,ఉమ్మడి అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య గారు పాల్గొన్నారు.





**ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలికకు**

# రూ. లక్ష నగదు బహుమతి

**పలమనేరు డిసెంబర్ 27 (మనసులో మాట) :** పలమనేరు పట్టణంలో లోని మధు అండ్ శ్రీ వాణి విద్యా సంస్థలలో కాలేజ్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగిందని కళాశాల కరస్పాండెంట్ కె .కృష్ణమూర్తి రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కళాశాలకు చెందిన పూర్వపు విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో అత్యున్నతమైన స్థానంలో ఉన్నటువంటి విద్యార్థులను ఆహ్వానించడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ కృష్ణమూర్తి రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులందరూ రాబోవు పరీక్షలు దృష్టిలో ఉంచుకొని పరీక్షలు బాగా రాసి అత్యున్నతమైన ప్రతిభ కనపర్చాలని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత కాలంలో పోటీ తత్వం ఉన్నందువలన తల్లిదండ్రులను అధ్యాపకులను గౌరవించి వారు చెప్పిన మార్గాలలో నడుచుకోవాలని తెలిపారు. అదేవిధంగా అతిథులుగా వచ్చినటు వంటి పూర్వపు విద్యార్థులు అందరూ విద్యార్థులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసినటు వంటి అతిథులందరిని కళాశాల కరస్పాండెంట్ కృష్ణమూర్తి రెడ్డి, సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గత సంవత్సరం కళాశాలకు చెందిన విద్యార్థినిని ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభను కనపరిచిన సీ.ఈ.సీ గ్రూప్ కు చెందిన ప్రీతి 490 / 500 మార్కులు సాధించిన ఈమెకు ఒక లక్ష రూపాయలు నగదును కళాశాల కరస్పాండెంట్ కృష్ణమూర్తి రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి.పి శ్రీవాణి, వైస్ ప్రిన్సిపల్స్,ఆనంద్ రెడ్డి, గోపినాథ్ రెడ్డి , సుబ్రమణ్యం రెడ్డి, అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కాలువ పల్లె జలాశయాన్ని సందర్శించిన కమిషనర్ రమణారెడ్డి



**పలమనేరు డిసెంబర్ 27( మనసులో మాట):** పలమనేరు పురపాలక సంఘ పరిధిలోని కాలువ పల్లె జలాశయాన్ని, ఎద్దుల సంత వాటర్ ప్లాంటును మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలువ పల్లె జలాశయం పూర్తిస్థాయిలో నిండడం వలన పురపాలక సంఘ పరిధిలో మరింత మెరుగైన స్వచ్ఛమైన నీటిని అందించుటకు తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. పట్టణంలోని ఎద్దుల సంత వీధిలో వాటర్ ప్లాంట్ లో జరుగుతున్న పనులను పర్యవేక్షించడం జరిగిందన్నారు. పారిశుధ్య నీటి సరపర రోజువారి తనిఖీల్లో భాగంగా నిరంతరంగా పంప్ హౌస్ ను ఈ ఎల్ ఎస్ ఆర్ ట్యాంకును నీటి బోరులో ఉన్న నీటి సామర్థ్యాలను నీటి లభ్యతలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయవలెనని తెలిపారు. క్లోరిన్ టెస్ట్ ( ఆర్ సి టెస్ట్)ను చేసి ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలని సూచించారు. పైప్ లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టవలెనని నీటిని వృధా చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి,డి వైఈ ఈ సురేష్ బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ స్నేహప్రియ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన**

# వెబ్ సైడ్ డెవలప్మెంట్ పోటీలు

**- విజయం సాధించిన టీమ్ కు నగదు బహుమతులు**



**పలమనేరు డిసెంబర్ 27( మనసులో మాట) :** పట్టణ సమీపంలోని మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 24 అవర్స్ వెబ్ సైడ్ డెవలప్మెంట్ పోటీలు జరిగాయి సాఫ్ట్వేర్ కు సంబంధించిన ఈ వెబ్సైట్ డెవలప్మెంట్ ప్రారంభమైనది. ఏదైనా ఒక అంశంపై వెబ్సైట్ ను రూపొందించడం ఈ పోటీ ప్రధాన ఉద్దేశం ఈ పోటీలలో వివిధ ఇంజనీరింగ్ కళాశాల ల కు చెందిన 30 టీములు పాల్గొన్నాయి. వివిధ అంశాల పైన వారు డెవలప్మెంట్ చేసిన వెబ్ సైట్ ను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతి మధుసూదన్ రెడ్డి ఏ ఐ అండ్ టీఎస్ హెల్త్ మేనేజ్మెంట్ సిస్టం, నవీన్ సాయి అకౌంట్ మేనేజ్మెంట్ ద్వితీయ ఎఐ అండ్ డి ఎస్, మహేశ్వర్ రెడ్డి క్రాప్టో కరెన్సీ ఫోర్త్ ఇయర్ సిఎస్ సి, మొదటి బహుమతికి 8వేలు, రెండవ బహుమతికి 5000, మూడవ బహుమతి కి 3000 నగదు బహుమతులను అందజేశారు. మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాల బెంగళూరుకు చెందిన వాలో స్వేర్ ఏ వన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, కలసి సంయుక్తంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం రవీంద్రబాబు, చైర్మన్ ఎం ఆర్ సునీల్, డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, లోకేష్, శరవన్, సీఈఓ నాగిరెడ్డి, హెచ్ ఓ డి లు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
ఆదివారం 28 డిసెంబర్ 2025


# ఇష్టానుసారంగా జీహెచ్ఎంసీ డీలిమిటేషన్

**రాజకీయ పార్టీల అభిప్రాయాలకు విలువలేదా : తలసాని**



**హైదరాబాద్, డిసెంబరు 27:** జిహెచ్ఎంసిలో డీలిమిటేషన్ పేరుతో ప్రభుత్వం, అధికారులు ఇష్టానుసారంగా డివిజన్లు ఏర్పాటు చేశారని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతి నిధులు, రాజకీయ పార్టీలు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా, కౌన్సిల్ సమావేశాల్లో అభ్యంతరాలు తెలిపినా పట్టించుకోలేదని విమర్శించారు. హడావుడిగా డివిజన్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో ఎవరికి అర్థం కావడం లేదన్నారు. ఇకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాటతీరు మార్చుకోవాలని, స్థాయికి తగినట్లు హుందాగా వ్యవహరించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హితవు పలికారు. శనివారం సికింద్రాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో 19 మంది లబ్దిదారులకు షాదీముబారక్ (15), కళ్యాణ లక్ష్మి (4) ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆచరణ సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయకుండా వాటిని ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు ఎప్పుడు నిర్మిస్తారని పేదలు అడుగుతున్నారని వీటికి సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్లు టి.మహేశ్వరి, దీపికా, తహసీల్దార్ పాండు నాయక్, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హరికృష్ణ, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు పాల్గొన్నారు.



# పంచాయతీ ఎన్నికలు ప్రారంభం మాత్రమే

- సెమీ ఫైనల్ ఫైనల్ ముందున్నయ్
- పంచాయతీలకు మీ అబ్బ సొమ్ము ఇవ్వడం లేదు
- గ్రామాలను పడావు పెట్టిన ఘనత రేవంత్‌ది
- మళ్లీ కేసీఆర్ సీఎం కావాలన్నదే జనం మాట
- ఒక్క భాషలో తిడితే.. మూడు భాషల్లో తిడుతా
- మహబూబాబాద్ సర్పంచ్‌ల సభలో కేటీఆర్

**మహబూబాబాద్, డిసెంబరు 27:** రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలు క్వార్టర్ ఫైనల్ మాత్రమేనని, సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు మున్ముందు ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా కూడా అద్భుత ఫలితాలు సాధించాలని సూచించారు. మహబూబాబాద్‌లో సర్పంచ్‌లో సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలె, కేసీఆర్ మళ్లీ సీఎం కావాలె' అన్నది మనందరి కోరిక, ఈ రాష్ట్ర ప్రజల అందరి కోరిక అని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలే సెమీఫైనల్. ఆ తర్వాత 2028 అసెంబ్లీ ఎన్నికలు ఫైనల్ అన్నారు. ఈ అన్ని దశల్లో అద్భుత ఫలితాలు సాధిస్తూ ఫైనల్‌లో విజయం సాధించాలని పిలుపునిచ్చారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నదే మనందరి కోరిక. ఈ రాష్ట్ర ప్రజల అంద రి కోరిక. ఎందుకంటే పాడై పోయిన వ్యవసాయాన్ని బాగుచేసింది కేసీఆర్. రైతులకు రైతుబంధు ఇచ్చింది కేసీఆర్' అని గుర్తుచేశారు. గ్రామ పంచాయతీలకు ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులు ఎవని అత్త సొమ్ము కాదని కేటీఆర్ అన్నారు. మీ పంచాయతీకి నిధులు ఇవ్వం అని బెదిరిస్తారని, ఆ నిధులు ఎవని అబ్బ సొత్తో, అత్త సొమ్మో కాదని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచి వచ్చిన సర్పంచ్ సోదరులారా.. ఇప్పుడు మీ మీద ఒత్తిడి ఉంటది. మీ ఎమ్మెల్యే మీకు నిధులు ఇయ్యనంటడు. మీకు ఇందిరమ్మ ఇళ్లు ఇయ్య నంటడు. మిమ్మల్ని ఇబ్బంది పెడుతడు. కానీ నేను ఒక్కటే చెబుతున్నా.. మీమీ గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు ఎవరి అబ్బ సొత్తో, ఎవరి అత్త సొమ్మో కాదు. అది ప్రభుత్వ సొమ్ము' అని చెప్పారు. గ్రామంలో మీదే పవర్. పంచాయతీకి వచ్చే నిధులను ఏ ఎమ్మెల్యే, ఏ ఎంపీ అడ్డుకోలేడు. అడ్డుకునే ప్రయత్నం చేసినా అది చెల్లదని తెలిపారు. 'రేవంత్‌రెడ్డీ.. నీకు నేను ఒక్క టే చెబుతున్నా. నీకు ఒక్క భాష మాత్రమే వచ్చు. నాకు 3 భాషలు వచ్చు. నువ్వు తిట్టాలనుకుంటే ఒక్క టే భాషల తిడుతవ్. నేను తలుచుకుంటే నిన్ను మూడు భాషలల్ల తిడుత ఏమనుకుంటున్నవో అని హెచ్చరించారు.. ఇక్కడున్న మా అక్కలను, అన్నలను అడిగి గోర్మాటి భాషల కూడా తిడుత. లంబాడ సోదరుల భాష నేర్చుకుని అండ్ల గూడా తిడుత అన్నారు.

# జర్నలిస్టుల అరెస్ట్ దారుణం

**కాంగ్రెస్ ఏడో గ్యారెంటీ ఇదేనా**

**ప్రభుత్వం తీరుపై మండిపడ్డ కేటీఆర్**

**హైదరాబాద్, డిసెంబరు 27:** ప్రజల గొంతుక అయిన జర్నలిస్టులను అరెస్టు చేయడం, నిర్బంధించడం కాంగ్రెస్ నిరంకుశత్వానికి నిదర్శనమని.. ప్రజాస్వామిక పరిరక్షణ అంటూ కాంగ్రెస్ ఇచ్చిన 7వ గ్యారంటీ ఇదేనా? అని కేటీఆర్ ప్రశ్నించారు. జర్నలిస్టుల సమస్యలపై శాంతియుతంగా వినతి పత్రాలు ఇచ్చేందుకు వెళ్లిన జర్నలిస్ట్ నేతలను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది కేవలం నేతల అరెస్టు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే జర్నలిస్టుల గొంతును పోలీసు బలగాలతో నొక్కేసే కుట్ర అని ఆయన విమర్శించారు. కొత్త జీవో సాకుతో జర్నలిస్టుల అక్రిడిటేషన్లలో కోత విధించడం ద్వారా ప్రభుత్వం వారి ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం నిరంకుశత్వానికి నిదర్శనమని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజలను మభ్య పెట్టేందుకు వచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ప్రజాస్వామిక పరిరక్షణ పేరుతో ఇచ్చిన ఏడవ గ్యారెంటీ అంటే జర్నలిస్టులను అరెస్టు చేయడమేనన్నారు. క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేయాల్సింది పోయి, ఉన్న వాటిని తొలగించడం ద్వారా ప్రభుత్వం వారి ఉపాధిని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్ట్ ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని అన్నారు. మారుతి సాగర్, రమేశ్ హజారి, యోగానంద్, విష్ణువర్ధన్ రెడ్డి, రమణ కుమార్, కడకంచి వెంకట్ వంటి కీలక నేతలను అరెస్ట్ చేయడం దారుణం అన్నారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను, నిర్బంధాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ, అక్రిడిటేషన్ల పునరుద్ధరణ కోసం సాగే పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# నకిలీ గాంధీల మాటలు నమ్మరు

**మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శలు**



**హైదరాబాద్, డిసెంబరు 27:** దేశంలో నకిలీ గాంధీల మాటలు ఎవరు నమ్మే పరిస్థితిలో లేరని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీ పేరు లేకుంటే నకిలీ గాంధీలకు మనుగడ ఉండదని భయపడుతున్నారని విమర్శించారు. మహాత్మాగాంధీపై సోనియాగాంధీ కుటుంబా నికి చిత్తశుద్ధి ఉంటే వారి హయంలో గాంధీ పేరుతో ప్రవేశ పెట్టిన పథకాల శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 150 పథకాల్లో రెండు, మూడు పథకాలు మాత్రమే కాంగ్రెస్ గాంధీ పేరు పెట్టిందని ఆరోపిం చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగే హింసపై కాంగ్రెస్ కనీసం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు రఘునందన్ రావు. 'తండ్రి ఈవీఎంలు ప్రవేశపెడితే కొడుకు దాన్ని వ్యతిరేకిస్తాడు. మీరు గెలిస్తే ఈవీఎంలు పని చేస్తున్నట్లా.. మేము గెలిస్తే పని చేయనట్లా?. ఇదెక్కడి సంస్కృతి ? రాహుల్ గాంధీకి తండ్రి అంటే గౌరవం, విశ్వాసం లేదు. ముక్కలైన కాంగ్రెస్.. దేశాన్ని ముక్కలుగా చేయాలని చూస్తోంది. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు , కంప్యూటర్ ఆపరేటర్‌లకు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఇంకెవరికి పైసలు ఇవ్వదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నుంచి పంచాయతీలకు రూపాయి అందడం లేదు. లోకల్ అడ్మినిస్ట్రేషన్ అనే పదానికి అర్థం లేకుండా కాంగ్రెస్ చేసింది. గతంలో కాంగ్రెస్ సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. మల్లికార్జున ఖర్గే ముందు.. మీ సొంత రాష్ట్రంలో పంచాయతీ చూసుకోండి. అక్కడ రేపు ఎన్నికలు వస్తే ఏమవుతుందో అది చూసుకోండి' అని రఘునందన్ రావు విమర్శించారు.

# చలి పంజా

**తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చలి**



**పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు**

**31వరకు తీవ్రమైన చలి పరిస్థితులు**

**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**

**హైదరాబాద్, డిసెంబరు 27:** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత రోజురోజుకూ ప పెరుగుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. దీంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గత పదేళ్లలో ఎక్కువ రోజులు తీవ్రమైన చలి కమ్ముకున్నది ఈసారి శీతాకాలంలోనే అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దాదాపు నెల రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు బాగా తక్కువగా నమోదవుతున్నాయి. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఆరేడు డిగ్రీలకు పడిపోతు న్నాయి. హైదరాబాద్‌లోనూ ఈసారి చలి తీవ్ర త చాలా ఎక్కువగా ఉంది.ఇంట్లో వెచ్చగా, బ యట చలిగా ఉంటే.. ఆ తర్వాత ఇంట్లో చలి వేస్తోంది, బయటికెళితే మాత్రం కాస్త ఉపశమ నం అనిపిస్తోంది. శీతల గాలులు, మన ఇళ్ల గోడలే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నా రు. ఉత్తర వాయవ్య దిశ నుంచి వీస్తున్న శీతల గాలులతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. దీనితో ఇళ్ల కాంక్రీటు గోడలు, శ్లాబులు రాత్రంతా చల్లబడి చలి పెరుగుతోంది. ఇళ్ల గోడలు, శ్లాబ్ నుంచి రోజంతా చల్లదనం వెలువడుతోంది. దీనితో ఇంట్లో చలివేస్తోంది. పై అంతస్తు, ఆపైన ఉండే వారికి శీతలగాలుల ప్రభావంతో మరింత ఎక్కువగా చలి ఉంటోంది. మరోవైపు ఆకాశంలో మేఘాలు లేకపోవడంతో, గాలిలో తేమశాతం తక్కువగా ఉంటుండటంతో సూర్యకిరణాలు నేరుగా దూసుకొస్తున్నాయి. సూర్యాస్తమయం వరకు ఈ ప్రభావం ఉంటోంది. తర్వాత మళ్లీ బయట చలిపెరుగుతోంది. ఇళ్లలో వెచ్చగా ఉంటోంది. హెచ్‌సీయూ, పటాన్‌చెరు, గచ్చిబౌలి, రాజేంద్రనగర్ వంటి శివారు ప్రాంతాల్లో 6–8 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.తెలంగాణలో జనవరి రెండో వారం నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు 13 డిగ్రీలు, ఆపైన నమోదవుతాయని వాతావరణ వివరాలు, ముందస్తు అంచనాలు అందించే 'స్కైమెట్ ' వెబ్‌సైట్ అంచనా వేసింది. మరో వాతావరణ వెబ్‌సైట్ ఆక్యువెదర్.. జనవరి తొలివారం తర్వాత చలి నుంచి ఉపశమనం ఉంటుందని, నెలాఖరుకల్లా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18–19 మధ్యకు చేరుతాయని పేర్కొంది. ఈనెల 31వరకు తీవ్రమైన చలి పరిస్థితులు కొనసాగుతాయని.. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరో 3–4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ నిపుణులంతా చెబుతున్నారు. సాధారణంగా 12 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు కాంక్రీటు గోడలు, శ్లాబులు ఆ చల్లదనానికి పెద్దగా ప్రభావితం కావు. అంతకన్నా ఎంత తగ్గుతూ పోతే.. అంతగా చల్లబడి, 'ప్రభావం అంతగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు 8, 9 డిగ్రీలకు తగ్గిపోతే... గోడలు, శ్లాబు నుంచి తర్వాతి రోజంతా చల్లదనం వెలువడుతూనే ఉంటుంది. దానితో బయటికంటే ఇంట్లో చలి ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది వానలు ఎక్కువగా కురవడం, ఉత్తర వాయవ్య దిశ నుంచి వీస్తున్న శీతల గాలులతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. గత పదేళ్లలో అతి తక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు, ఎక్కువ రోజులు కొనసాగడం ఈసారే చూస్తున్నాం. మరో 10 రోజుల వరకు చలి తీవ్రత కొనసాగే అవకాశం ఉంది. సంక్రాంతి తర్వాత రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం 15 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటోంది.

# దళితుల భూమిని దౌర్జన్యంగా లాక్కుంటారా

**దుందిబీ నదిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల ఇసుకదోపిడీ**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**నాగర్ కర్నూల్ ,డిసెంబరు 27:** మెడికల్ కాలేజీకి 40 ఎకరాల దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కాంట్రాక్టర్లకు అడ్వాన్స్‌డ్ కల్చర్‌ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చారని ఆక్షేపించారు. దుందిబీ నదిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు చేశారు. ఈమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిది డైవర్షన్, కరప్షన్ పాలన అని విమర్శలు చేశారు. శనివారం నాగర్ కర్నూలు జిల్లాలోజాగృతి జనం బాటలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టకి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత. అభివృద్ధి అవకాశాలు అందరికీ సమానంగా రావాలని సూచించారు. సామాజిక తెలంగాణ సాధనకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని పరుగులు పెట్టించినట్లుగా పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. నల్ల మట్టి తీసేందుకు రైతుల వద్ద తీసుకున్న900 ఎకరాల భూమిని వారికి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో డిండి ప్రాజెక్ట్‌కి నీటిని తరలించలేదని.. ప్రభుత్వం మారిన కూడా ఇంకా సర్వేలే జరుగుతున్నాయని కవిత విమర్శించారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# డ్రగ్స్ కేసులో నిర్లక్ష్యం ఎందుకు?

- అకున్ సబర్వాల్‌ను తిరిగి నియమించండి
- మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌ను విచారించండి
- రాష్ట్ర ప్రభుత్వం తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం




**హైదరాబాద్, డిసెంబరు 27:** రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసులను తీవ్రంగా పరిగణించడంలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పండుగలు, నూతన సంవత్సర వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితమవుతు న్నారని ఆక్షేపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అ కున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈమేర కు డ్రగ్స్ కేసులపై బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పండుగల అప్పుడే డ్రగ్స్ కేసులు నమోదు చేస్తారా? అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో నాటి డ్రగ్స్ కేసు విచారణ ఏమైంది? అని నిలదీశారు. అనేకమంది సెలబ్రిటీల పేర్లు బయటకు వచ్చాయి కదా? ఏం చేశారని ప్రశ్నించారు. తమతోపాటు కేసీఆర్ కుటుంబ సభ్యులు కూడా డ్రగ్స్ తీసుకున్నారని.. గతంలో నిందితులు వాంగ్మూలం ఇచ్చారు కదా అని గుర్తుచేశారు. శనివారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు బండి సంజయ్. నిందితుల వాంగ్మూలం ఆడియో, వీడియో రికార్డు చేశారని తెలిపారు. తమ కుటుంబ సభ్యుల భవిష్యత్ నాశనమవుతుందనే భయంతోనే.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ కేసు నీరుగార్చారని ఆరోపించారు. అకున్ సబర్వాల్‌ను డ్రగ్స్ కేసు నుంచి ఎందుకు తప్పించారని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, వీడియో స్టేట్‌మెంట్స్‌ను నాటి సీఎస్ సోమేశ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నారని ప్రస్తావించారు. గతంలో సేకరించిన ఆధారాలు ఏమయ్యాయని నిలదీశారు. ఈ విషయంలో సోమేశ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలని అన్నారు. డ్రగ్స్ కేసులో ఈగల్ టీమ్ లీగల్‌గా విధులు నిర్వహిస్తోందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈగల్ టీమ్‌లో కొంతమంది డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారని ఆరోపణలు చేశారు. అకున్ సబర్వాల్‌కి తిరిగి డ్రగ్స్ కేసు బాధ్యతలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈగల్ టీమ్ వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్‌ను విచారించాలని అన్నారు. ఈగల్ టీమ్‌లో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు మాత్రం డ్రగ్స్ పెడ్లర్లతో రాజీపడుతున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే.. అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి 'డ్రగ్స్ కేసు' విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు.

# ఆన్‌లైన్ గేమ్స్ బారిన మరో యువకుడు బలి

**డబ్బులు పోగొట్టుకోవడంతో ఆత్మహత్య**

**మేడ్చల్, డిసెంబరు 27:** జిల్లాలోని సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డ రవీందర్ (24) అనే యువకుడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసైన రవీందర్ అందులో పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన మరణానికి ఎవరూ బాధ్యులు కారంటూ వీడియో రికార్డ్ చేశాడు. ఆపై రవీంద్ తన గదిలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రవీందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా.. గత కొద్దిరోజులుగా రవీందర్ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ ఆర్థికంగా నష్టపోయాడు. నష్టాలు పూరించేందుకు స్నేహితులు, తెలిసిన వారి వద్ద నుంచి భారీగా నగదును అప్పుగా తీసుకుని మరోసారి ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లో పెట్టుబడులు పెట్టాడు. అయితే ఎంత పెట్టుబడి పెట్టినా అతడికి లాభాలు రాకపోగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలోనే సూసైడ్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆత్మహత్యకు ముందు రవీందర్ ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశాడు. ఆన్‌లైన్ గేమ్స్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయానని వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నానని, తనలా ఇంకెవరూ మోసపోవద్దంటూ స్నేహితులను కోరాడు. తన చావుకు ఎవరూ బాధ్యులు కాదంటూ వీడియో రికార్డ్ చేసిన అనంతరం గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవీందర్ ఆర్థిక సమస్యలతో



ఎక్కడెక్కడ అప్పులు చేశాడు, ఎంత మేరకు నష్టపోయాడు, సూసైడ్‌కు పూర్తి కారణాలు ఏంటి అనేదానిపై సూరారం పోలీసులు ఆరా తీస్తున్నారు.

# నిజామాబాద్‌లో రెచ్చిపోయిన దోపిడీ దొంగలు

**ఏటీఎంలను కట్ చేసి భారీగా నగదు దోపిడీ..**

**రంగంలోకి దిగిన పోలీసులు..**

**నిజామాబాద్, డిసెంబర్ 27:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో దోపిడి దొంగలు రెచ్చిపోయారు. ముఖాలకు మాస్కులు ధరించి, చేతులకు గ్లౌజులు పెట్టుకొని ఏటీఎంలు లూటీ చేశారు. శనివారం తెల్లవారు జామున కారులో వచ్చిన దుండగులు.. గ్యాస్ కట్టర్ల సహాయంతో ఏటీఎంలను కట్ చేసి అందులోని నగదు దోచుకుపోయారు. నగరంలోని ఆర్యనగర్, సాయినగర్ ఏటీఎంలలో భారీ చోరీ జరిగింది. ఏటీఎంలను గ్యాస్ కట్టర్‌తో తెరిచి దుండగులు నగదు లూటీ చేశారు. సాయినగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో సుమారు రూ.9 లక్షలు చోరీ చేశారు. ఆర్యనగర్‌లోని డీసీబీ ఏటీఎంలో దాదాపు రూ.30 లక్షలు ఎత్తుకెళ్లారు. గ్యాస్ కట్టర్ వాడినప్పుడు మరికొంత నగదు మంటల్లో కాలిపోయింది. ఐదుగురు సభ్యుల ముఠా దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా కేసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాలను కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర పరిశీలించారు. నిజామాబాద్ టౌన్ 4 పోలీస్ స్టేషన్ పరిధిలోని పాంగ్రా బ్రాంచ్‌కు సంబంధించిన డెవలప్‌మెంట్ క్రెడిట్ బ్యాంక్ ఏటీఎంలోకి ప్రవేశించిన దుండగులు గ్యాస్ కట్టర్ సహాయంతో మెషిన్ ను కట్ చేసి సుమారు రూ. 25 లక్షలు దోచుకున్నారు. అలాగే నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్ని చౌరస్తా వద్ద గల ఎస్‌బీఐ ఏటీఎంలోనూ చోరీకి పాల్పడ్డారు. ముందుగా ఏటీఎం సెంటర్‌లో ఉన్న సీసీ కెమెరాలపై స్ప్రే చేసి రికార్డు కాకుండా జాగ్రత్త పడ్డ దుండగులు.. దాదాపు 10 లక్షల వరకు దోచుకుపోయినట్లు తెలిసింది. ఈ రెండు ఘటనా స్థలాలను కామారెడ్డి ఎస్పీ, ఇన్‌చార్జి సీపీ ఎం.రాజేశ్ చంద్ర పరిశీలించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించిన అనంతరం.. రెండు బ్యాంకుల మేనేజర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దోపిడీ జరిగిన ఏటీఎం లోపలి, పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీని సేకరించి, విశ్లేషించాలని ఇంచార్జి సీపీ



ఆదేశించారు. అలాగే క్లూస్ టీమ్, సాంకేతిక నిపుణులు, స్థానిక పోలీసు బృందాలతో దర్యాప్తు చేస్తున్నారు. ఏటీఎంల దోపిడీతో అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం నిఘా కట్టుదిట్టం చేశారు. జిల్లాలోకి వచ్చే, పోయే పాయింట్లలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.

# మహిళా కమిషన్ విచారణకు నటుడు శివాజీ

**తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన నటుడు**

**కావాలనే కొందరు దుష్ప్రచారంపై ఆగ్రహం**

**హైదరాబాద్, డిసెంబరు 27:** నటుడు శివాజీ బుద్ధభవన్‌లో మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. హీరోయిన్స్‌ను ఉద్దేశించి శివాజీ చేసిన అభ్యంతర వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్ వివరణ ఇవ్వాలని శివాజీకి నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో విచారణకు హాజరైన శివాజీ.. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. శివాజీ స్టేట్‌మెంట్‌ను మహిళా కమిషన్ రికార్డ్ చేసుకుంది. ఇప్పటికే ఈ అంశంపై సోషల్ మీడియా వేదికగా శివాజీ క్షమాపణలు చెప్పారు. అనుకోకుండా మాటలు దొర్లాయని మహిళా కమిషన్ ముందు శివాజీ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుం టామని నటుడు చెప్పినట్లు సమాచారం. అయినప్పటికీ మహిళా కమిషన్ మాత్రం.. ఆ వ్యాఖ్యలపై వివర ణ ఇవ్వాల్సిందే అంటూ నటుడికి నోటీసులు ఇచ్చింది. దీంతో శివాజీ వ్యక్తిగతంగా విచారణకు హాజరై.. మహిళా కమిషన్‌కు వివరణ ఇచ్చారు. అయితే తనకు బాగా కావాల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదని నటుడు శివాజీ అన్నారు. నేను ఏం తప్పు చేశానని నా మీద ఇంత కోపం. ఎవరు ఎలాంటి దుస్తులు వేసుకుంటే నాకేంటి? ఇంతకు ముందు ఇలాంటి వ్యాఖ్యలు ఎవరూ చేయలేదా? వారి మీద ఇలానే మాట్లాడారా? నేను ఎవరినీ నొప్పించాలని మాట్లాడలేదు. ఇటీవల చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో మాట్లాడేటప్పుడు తప్పులు దొర్లాయి. నాతో కెరీర్ మొదలు పెట్టిన వారికి నాపై కోపం ఉంది. నా వ్యాఖ్యల తర్వాత నన్ను ఇబ్బంది పెట్టాలని కొందరు జూమ్ మీటింగ్ పెట్టుకుని చర్చించారు. నాకు బాగా కావాల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదు. సలహాలు ఇవ్వటం మానుకోవాలని నాకు అర్థమైందని శివాజీ అన్నారు.

# పేద పిల్లలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

**ఎన్టీఆర్ట్ ట్రస్ట్ ఎడ్యుకేషన్ వార్షికోత్సవంలో చంద్రబాబు**

**హైదరాబాద్, డిసెంబరు 27:** పేద పిల్లలకు అండగా ఉండాలనే ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ వార్షికోత్సవంలో సీఎం మాట్లాడారు. గండిపేటకు వస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. ఒకప్పుడు పార్టీ ప్రధాన కార్యాలయం ఇక్కడ ఉండేది. ఒకప్పుడు రాజకీయ నేతలకు శిక్షణ ఇచ్చే కేంద్రం ఇది. ఇప్పుడు అదే స్థలంలో పిల్లలకు చదువు నేర్పుతున్నారు. రకరకాల కారణాల వల్ల చాలామంది పిల్లలు అనాథలుగా మారేవారు. ఆ పిల్లలకు పెద్ద దిక్కుగా ఉండాలనే ఈ విద్యాసంస్థలకు శ్రీకారం చుట్టాం. ఆ నాడు నాటిన చిన్న మొక్క.. ఇవాళ పెద్ద వృక్షంగా తయారైంది. ఈ విద్యాసంస్థను సమర్థంగా నిర్వహిస్తున్న ఘనత భువనేశ్వరిదే. గ్రూప్-1 పోస్టులకు ఇక్కడి నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఐఐటీలు, ఎన్ఐటీల్లో 29 మంది సీట్లు సంపాదించారు. ఇప్పుడు పలు చోట్ల 1,641 మంది పిల్లలు చదువుతున్నారు. చిన్న పాఠశాల నుంచి ఇంటర్, డిగ్రీ కాలేజీ వరకుఈ సంస్థ ఎదిగింది. నా చొరవ వల్లే ఉన్నతవిద్యకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ మారింది. ఎవరైనా వ్యవసాయం, వ్యాపారం ద్వారా సంపాదించాలనే హెరిటేజ్ పెట్టాం. మొదట్లో హెరిటేజ్ బాధ్యతలు తీసుకునేందుకు భువనేశ్వరి ఒప్పుకోలేదు. తర్వాత హెరిటేజ్‌ను సమర్థంగా నిర్వహించే స్థాయికి ఆమె చేరారు. ఆరోజు హైటెక్‌సిటీ కట్టి ఐటీని ప్రోత్సహించాను. ఈరోజు మళ్లీ డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్ వ్యాలీ, క్వాంటమ్ కంప్యూటర్స్, గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్, డ్రోన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీకి చిరునామాగా ఏపీని తయారు చేయాలని నెక్స్ట్ జెనరేషన్‌కు వెళ్లాం. టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాం' చంద్రబాబు అన్నారు.



# ఏడాది తరువాత పోలీసుల చార్జ్‌షీట్

**సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో 23మందిపై అభియోగాలు..**

**ఏ11గా నటుడు అల్లు అర్జున్**

**హైదరాబాద్, డిసెంబర్ 27:** సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఏడాది తరవాత ఛార్జిషీట్ దాఖలు చేసి, మొత్తం 23 మందిపై అభియోగాలు మోపారు. ఛార్జిషీట్‌లో ఏ-11గా సినీ నటుడు అల్లు అర్జున్ పేరు చేర్చారు. 2024 డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల సమయంలో పుష్ప-2 బెనిఫిట్ షో కోసం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్దకు వచ్చిన చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయడంతో రేవతి(35) అనే మహిళతోపాటు ఆమె కుమారుడు శ్రీతేజ(9) కింద పడిపోయి జనం కాళ్ల మధ్య నలిగిపోయారు. ఇద్దరూ తీవ్ర గాయాలతో స్పృహ తప్పారు. వెంటనే పోలీసులు వారిని పక్కకు తీసుకెళ్లి సీపీఆర్ చేశారు. హుటాహుటిన ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తల్లి మృతిచెందారు. కుమారుడి పరిస్థితి విషమంగా ఉండటంతో నిమ్స్‌కు తరలించారు. పుష్ప-2 సినిమా చూసేందుకు మొత్తం నలుగురు కుటుంబ సభ్యులు రాగా.. తల్లి కుమారుడు తొక్కిసలాటలో చిక్కుకున్నారు. వారిలో తల్లి మృత్యువాతపడటం విషాదాన్ని నింపింది. తొక్కిసలాటలో మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

# మాసబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసు దర్యాప్తు

**పరారీలో నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్**

**హైదరాబాద్, డిసెంబరు 27:** మాసబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. మాసాబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసులో ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం ఈగల్ టీమ్, పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసులో ఈ నెల 17న ట్రూప్ బజార్‌కు చెందిన నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్విని అరెస్టు చేశారు. వారిని విచారించగా అమన్‌ప్రీత్ పేరు బయటకు వచ్చింది. ఈ ఇద్దరు వ్యాపారుల నుంచి అతడు డ్రగ్స్ కొన్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. ఇద్దరు వ్యాపారుల నుంచి 43 గ్రాముల కొకైన్, ఎండీఎంఏ స్వాధీనం చేసుకుంది. గతేడాది కూడా అమన్‌ప్రీత్ సైబరాబాద్ పోలీసులకు పట్టుబడ్డాడు. మరోవైపు నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్వికి మరో నలుగురు వ్యక్తులు డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈకేసులో నిందితుడు ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ పరారీలో ఉన్నాడు. హీరోయిన్ సోదరుడి కోసం ఈగల్ టీం, మాసబ్ ట్యాంక్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ట్రూప్ బజార్‌కు చెందిన నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్విల అరెస్టుతో నటి సోదరుడు పేరు బయటకు వచ్చిన విషయం తెలిసిందే. పట్టుబడ్డ ఇద్దరు వ్యాపారులకు నలుగురు రెగ్యులర్ కస్టమర్లు సప్లై చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇద్దరు వ్యాపారవేత్తల నుంచి నటి సోదరుడు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు బయటపడింది. వ్యాపారవేత్తల నుంచి 43 గ్రాముల కొకైన్, ఎండీఎంఏ డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే టాలీవుడ్, బాలీవుడ్‌లో మంచి గుర్తింపు ఉన్న ప్రముఖ నటి సోదరుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. కాగా.. న్యూఇయర్ వేడుకల సందర్భంగా ఈగల్ టీం హైదరాబాద్ వ్యాప్తంగా దృష్టి సారించింది. డ్రగ్స్ నివారణకు ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఇటీవల డిసెంబర్ 19న మాసబ్ ట్యాంక్ వద్ద ట్రూప్‌బజార్‌కు చెందిన ఇద్దరు వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు తరచుగా డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతని కోసం పోలీసులు వెతుకుతున్నారు. కాగా.. గత సంవత్సరం కూడా డ్రగ్స్ కేసులో సైబరాబాద్ పోలీసులకు నటి సోదరుడు పట్టుబడిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా మరోసారి డ్రగ్స్ వ్యవహారంలో ఇరుక్కోవడం సంచలనంగా మారింది.

# ఐఏఎస్‌లకు కేంద్రం వార్నింగ్

**వివరాలు సమర్పించకపోతే చర్యలు**

**కేంద్ర, రాష్ట్ర సెక్రటరీలు, సీఎస్‌లకు ఆదేశాలు**

**ఢిల్లీ, డిసెంబర్27:** నిర్దేశిత గడువు లోపల తమ ఆస్తుల వివరాలు(ఇమ్మూవబుల్ ప్రాపర్టీ రిటర్న్ ఉఐపీఆర్) సపర్పించకపోతే కఠిన చర్యలు తప్పవని ఐఏఎస్‌అధికారులకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. 2025 క్యాలెండర్ సంవత్సరానికి సంబంధించిన ఆస్తుల వివరాలను తప్పనిసరిగా జనవరి 31, 2026లోపు స్పారో ఆన్‌లైన్ మాడ్యూల్‌లో సమర్పించాలని స్పష్టం చేసింది. డిసెంబర్ 23, 2025న డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం సమర్పించాలని, గడువు తర్వాత ఆన్‌లైన్ మాడ్యూల్ ఆటోమేటిక్‌గా మూసివేయబడుతుందని తెలిపింది. ఈ గడువులోగా వివరాలు సమర్పించని అధికారులకు విజిలెన్స్ క్లియరెన్స్ నిరాకరణ, ప్రమోషన్లు నిలిపివేయడం, క్రమశిక్షణ రాహిత్యం వంటి కఠిన చర్యలు తప్పవని కేంద్రం హెచ్చరించింది. గతంలో ఆన్‌లైన్ ఫైలింగ్ పెరిగినప్పటికీ, ఇకపై గడువును కచ్చితంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర సెక్రటరీలు, చీఫ్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధన ఆల్‌ఇండియా సర్వీసెస్(కండక్ట్) రూల్స్, 1968 ప్రకారం అమలులో ఉందని, పారదర్శకత, అక్రమ సంపాదన నివారణకు ఇది కీలకమని డీఓపీటీ పేర్కొంది. అధికారులు తప్పనిసరిగా గడువులోగా ఆస్తుల వివరాలు సమర్పించాలని సూచించింది.

# సిద్దిపేట జిల్లాలో పులి సంచారం

**అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక**

**సిద్దిపేట, డిసెంబరు 27:** సిద్దిపేట జిల్లాలో పులి సంచారంతో జనం బిక్కుబిక్కుమంటున్నారు. మిరుదొడ్డి మండలం అందె, కొండాపూర్, తొగుట మండలం వరదరాజుపల్లి, గోవర్ధనగిరి ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్టు అటవీ అధికారులు గుర్తించారు. పాద ముద్రల ఆధారంగా పులి సంచారాన్ని గమనించిన అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పులి సంచరిస్తున్న విషయం తెలియగానే ఈ ఊళ్లకు పక్కనే ఉన్న గోవర్ధనగిరి, ముత్యంపేట్, మిరుదొడ్డి మండలం అందె, కొండాపూర్ గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పులి సంచరిస్తున్న ప్రాంతాల ప్రజలకు పులి సంచారంపైన ఫారెస్ట్ అధికారి సందీప్ కుమార్ మాట్లాడుతూ.. నిన్న ఇక్కడ పులి కాలి ముద్రలు కనిపిస్తున్నాయని సమాచారం వచ్చిందని.. దీంతో సిద్దిపేట రెంజ్ సిబ్బంది, మా సిబ్బంది అనుమానస్పదమైన స్థలాన్ని వెతకడం జరిగింది. ఇది మన వరదరాజుపల్లి శివారులో ఒక పోలంలో అనుమానస్పదంగా పాదముద్రలు కనిపించాయి. నిన్న రాత్రి నుండి దర్యాప్తు చేయడం జరిగిందని.. దాని కదలికలు ఇక్కడే కనిపించాయని.. మేము మూడు టీంలుగా ఏర్పడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయడం జరిగిందన్నారు. ఇక్కడి నుంచి సిద్దిపేట మండలం తోర్నాల గ్రామం దిక్కు పోయినట్టు ఉందని అక్కడ కుడా పాద ముద్రలు కనిపిస్తున్నాయని తెలిపారు. పులితో అందరూ జాగ్రత్తగా ఉండాలని రైతులు పొలాల కాడికి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తమ జీవాలను సాయంకాలం తమవెంటే ఇంటికి తీసుకరావాలని ఆయన చెప్పారు.

# హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 164వ వారం అన్నదానం

- నిరాటంకంగా కొనసాగుతున్న సేవా యజ్ఞం
- చైర్మన్ కొండ విజయ్ కుమార్ సేవలు అభినందనీయం





**శేరిలింగంపల్లి, డిసెంబర్ 27 (మనసులో మాట):**

సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలనే మానవతా దృక్పథంతో హోప్ ఫౌండేషన్ చేపట్టిన అన్నదాన కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతోంది. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం 164వ వారం అన్నదాన కార్యక్రమాన్ని శేరిలింగంపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యురాలు అన్నె అపర్ణ పాల్గొని స్థానికులతో కలిసి పేదలకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు భేష్ అని కొనియాడారు. అన్నదానానికి పెద్ద సంఖ్యలో ప్రజలు విచ్చేసినప్పటికీ, ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా సభ్యులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని, అందరికీ కడుపునిండా అన్నం పెట్టి ఆకలి తీర్చడం గొప్ప విషయమని ప్రశంసించారు. క్రమం తప్పకుండా అన్నదానం నిర్వహిస్తున్న చైర్మన్ కొండ విజయ్ కుమార్‌తో పాటు సహకరిస్తున్న సభ్యులను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపితే రూ. 10 వేల జరిమానా

- గజ్వేల్‌లో 14 మందికి మొత్తం రూ. 1.40 లక్షల ఫైన్
- ప్రమాదాల నివారణకే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- స్పష్టం చేసిన ట్రాఫిక్ సీఐ మురళి, ఎస్ఐ నిరేష్




**గజ్వేల్, డిసెంబర్ 27 (మనసులో మాట):**

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్షతో పాటు భారీ జరిమానాలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. గజ్వేల్ పట్టణ పరిధిలోని పిడిచెడ్ రోడ్, క్యాసారం ఎక్స్ రోడ్, తూప్రాన్ రోడ్, ముట్రాజ్ పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ సీఐ మురళి, ఎస్ఐ నిరేష్ తమ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షించగా 14 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. వీరిని శనివారం గజ్వేల్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సి. మనివీర్ ఎదుట హాజరుపరచగా.. విచారణ జరిపిన న్యాయమూర్తి ఒక్కొక్కరికి పది వేల రూపాయల చొప్పున, మొత్తం 14 మందికి రూ. 1,40,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మురళి, ఎస్ఐ నిరేష్ మాట్లాడుతూ.. కేవలం రోడ్డు ప్రమాదాలను నివారించేందుకే ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌కే కాకుండా, రోడ్డుపై వెళ్లే అమాయక వాహనదారులకు కూడా ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ జరిమానాలు విధించడం ద్వారా వాహనదారుల్లో మార్పు వస్తుందని, ప్రజలు బాధ్యతయుతంగా వ్యవహరించాలని కోరారు.



## రామనామ స్మరణతోనే మనశ్శాంతి

**నాచారానికి భద్రాచల ముక్కోటి ఆహ్వానం**

**భక్తిరత్న రామకోటి రామరాజుకు ఘన సన్మానం**

**ఆధ్యాత్మిక సేవలు అమోఘం: ఆలయ చైర్మన్ రవేందర్ గుప్త**

**గజ్వేల్, డిసెంబర్ 27 (మనసులో మాట):**

శ్రీరామ నామ స్మరణతోనే సకల శుభాలు, మనశ్శాంతి కలుగుతాయని 'భక్తిరత్న' జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు రామకోటి రామరాజు అన్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నర్సింహా స్వామి దేవస్థానాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భద్రాచలంలో జరగనున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆలయ చైర్మన్ రవేందర్ గుప్తతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్‌కు ముక్కోటి ఉత్సవాల ప్రత్యేక ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రవేందర్ గుప్త మాట్లాడుతూ.. భద్రాచలం దేవస్థానం నుండి ముక్కోటి ఆహ్వానాన్ని రామకోటి రామరాజు ద్వారా అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నిరంతరం రాముని సేవలో గడుపుతున్న రామరాజు ఆధ్యాత్మిక సేవలు అమోఘమని కొనియాడారు. అంతకుముందు రామరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు జగన్నాథ చార్యులు, కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, గోలి కిష్టయ్య, సుధాకర్, ముత్యాలు, రాజా నర్సింగరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే కృత్రిమ అవయవాల పంపిణీ

- మంత్రి కొండా సురేఖ
- ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ కాళ్ల పంపిణీ శిబిరం ప్రారంభం



**వరంగల్, డిసెంబర్ 27:** దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కృత్రిమ అవయవాల పంపిణీ దోహదపడుతుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం వరంగల్ కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ ఫంక్షన్ హాల్‌లో ఆలయ ఫౌండేషన్, భగవాన్ మహావీర్ వికలాంగుల సహాయ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ కాళ్ల పంపిణీ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి సేవలను కొనియాడారు. సొంత ఊరిలో ఆసుపత్రి నిర్వహణ, యువతకు ఉపాధి కల్పన, విద్యా వికాసం వంటి సామాజిక కార్యక్రమాలు చేపడుతూ గత 12 ఏళ్లుగా సేవలందిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇచ్చే కృత్రిమ అవయవాలు కొంత బరువుగా ఉంటాయని, కానీ ఈ ట్రస్ట్ ద్వారా అందజేసే పరికరాలు నాణ్యతతో పాటు తేలికగా ఉండి దివ్యాంగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. అవసరమైన వారికి హైదరాబాద్‌లోని మహావీర్ సొసైటీలో ఉచిత వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేయడం శుభపరిణామమన్నారు. ఈ శిబిరం ద్వారా సుమారు 150 మందికి కృత్రిమ అవయవాలను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ఐఏఎస్ అధికారిగా బిజీగా ఉన్నప్పటికీ నరహరి తన సొంత రాష్ట్రంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని, దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఐఏఎస్ నరహరి మాట్లాడుతూ.. తన మిత్రులు, కుటుంబ సభ్యులు, మహావీర్ ట్రస్ట్ సహకారంతో ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆదర్శ సెంట్రింగ్ యూనియన్ ఆర్థిక బాసట



**గజ్వేల్, డిసెంబర్ 27 (మనసులో మాట):**

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ (పల్లెపహాడ్) గ్రామానికి చెందిన సింగారం (గూడూరి) మల్లయ్య (80) అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుమారుడు రాజు సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సహచర కార్మికుడి తండ్రి మరణవార్త తెలుసుకున్న 'ఆదర్శ సెంట్రింగ్ యూనియన్ అసోసియేషన్' సభ్యులు తక్షణమే స్పందించారు. రాజు నివాసానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి, తమ వంతు సహాయంగా రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. మల్లయ్య మృతి ఆ కుటుంబానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారికి తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఆదర్శ సెంట్రింగ్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులు కప్ప చంద్రం, ఉపాధ్యక్షుడు మన్నె నర్సింలు, క్యాషియర్ గడ్డం స్వామి, సభ్యులు సూరారం రాజు, పెద్దమాతర కనకయ్య, గూడూరు స్వామి, ఎర్ర భాస్కర్, గూడూరి రాజు, గూడూరి పోశయ్య, గూడూరి బాబు, గూడూరు మహేష్, గూడూరి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

**సర్పంచ్ రజిత**

**తిగుల్ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా సామూహిక సీమంతాలు**




**జగదేవపూర్, డిసెంబర్ 27(మనసులో మాట):**

పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తిగుల్ గ్రామ సర్పంచ్ కుడుదుల రజిత అన్నారు. సిద్ధిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజిత మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పకుండా తీసుకోవాలన్నారు. సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా జన్మిస్తారని వివరించారు. అలాగే ఆరేళ్ల లోపు పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లులను కోరారు. అనంతరం నూతన సర్పంచ్ రజితను అంగన్వాడీ టీచర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రుక్మిణి, ఆయా బాలమణి, గర్భిణులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## ఇండ్ల పైనుంచి వెళ్తున్న 11 కేవీ వైర్ల తొలగింపు

**మంత్రి లక్ష్మణ్ కుమార్ చొరవతో తీరిన సమస్య**

**హర్షం వ్యక్తం చేసిన బొంకూర్ గ్రామస్తులు**



**గొల్లపెల్లి, డిసెంబర్ 27 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం బొంకూర్ గ్రామంలో ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలోని పలు నివాసాల పైనుంచి 11 కేవీ విద్యుత్ వైర్లు వెళ్తుండటంతో ప్రమాదకరంగా మారిందని, వీటిని తొలగించాలని గ్రామస్తులు సర్పంచ్ శిరీష శ్రీనివాస్‌కు విన్నవించారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు సర్పంచ్ వెంటనే ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన మంత్రి.. తక్షణమే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో రంగంలోకి దిగిన విద్యుత్ శాఖ అధికారులు శనివారం ఇండ్ల పైనుంచి ఉన్న 11 కేవీ వైర్లను తొలగించారు. దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కావడంతో గ్రామ సర్పంచ్ శిరీష శ్రీనివాస్, గ్రామస్తులు మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాలో చైనా మంజాపై నిషేధం

**అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తప్పవు: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**గొల్లపెల్లి, డిసెంబర్ 27 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లావ్యాప్తంగా చైనా మంజా (నైలాన్ దారం) వినియోగంపై పూర్తి నిషేధం విధించినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్పష్టం చేశారు. పక్షులు, ప్రజల భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఎవరైనా చైనా మంజాను విక్రయించినా, కొనుగోలు చేసినా, లేదా గాలిపటాలు ఎగురవేయడానికి ఉపయోగించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా చైనా మంజా విక్రయాలు జరుగుతున్నట్లు గానీ, నిల్వ ఉంచినట్లు గానీ తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇందుకోసం 87126 72000 నంబర్‌కు గానీ, డయల్ 100 కి గానీ ఫోన్ చేయాలని సూచించారు. ప్రజలు అందించే సమాచారం ఎంతో విలువైనదని, అది ఒక ప్రాణాన్ని కాపాడవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# తిగుల్ నూతన సర్పంచ్‌కు సన్మానం

**ఆదర్శ గ్రామం దిశగా కృషి చేయాలి: దేవి రవీందర్**

**సర్పంచ్ రజిత, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డికి అభినందనలు**



**జగదేవపూర్, డిసెంబర్ 27 (మనసులో మాట):**

సిద్ధిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన కుడుదుల రజిత, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డిలను రైతుబంధు సమితి మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ శనివారం ఘనంగా సన్మానించారు. వారికి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దేవి రవీందర్ మాట్లాడుతూ.. తిగుల్ లాంటి పెద్ద గ్రామపంచాయతీలో భారీ మెజార్టీతో రజిత గెలవడం అభినందనీయమన్నారు. గ్రామ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తూ, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని, తిగుల్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేయాలని సూచించారు. రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లయ్య, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ భూమయ్య, గ్రామ నాయకులు మల్లారెడ్డి, మహేందర్ రెడ్డి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ న్యూరో హాస్పిటల్ క్యాలెండర్ ఆవిష్కరణ

**అత్యాధునిక వైద్య సేవలే లక్ష్యం: న్యూరాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి**




**గజ్వేల్, డిసెంబర్ 27 (మనసులో మాట):**

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని 'గజ్వేల్ న్యూరో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్' ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ భాను చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గజ్వేల్, దాని పరిసర ప్రాంతాల ప్రజలకు గజ్వేల్ న్యూరో హాస్పిటల్ అత్యాధునిక సౌకర్యాలతో నాణ్యమైన వైద్య సేవలను అందిస్తోందన్నారు. న్యూరో విభాగానికి సంబంధించి అన్ని రకాల అధునాతన వైద్య పరికరాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే హాస్పిటల్‌లో 24 గంటల పాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది యాదగిరి, కరుణాకర్, నవీన్, శ్రీకాంత్, మధు, గిరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధి

**రూ. 17 కోట్లతో పనులకు శ్రీకారం**

**దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల అమలు: మంత్రి**



**మహబూబాబాద్, డిసెంబర్ 27:** పట్టణాలతో సమానంగా గ్రామాల అభివృద్ధి జరగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లాలో పర్యటించిన మంత్రి.. మరిపెడ, డోర్నకల్ మండలాల్లో సుమారు రూ. 17 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మరిపెడ మండల కేంద్రంలోనూ, మహబూబాబాద్ కలెక్టరేట్ వద్ద రూ. 42.28 లక్షలతో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు నూకల రామచంద్రా రెడ్డి కాంస్య విగ్రహాలను మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూకల రామచంద్రా రెడ్డి భూస్వామి అయినప్పటికీ ఆ దర్పం చూపించకుండా ప్రజల మనిషిగా బతికారని కొనియాడారు. తన ఆస్తులను కాపాడుకోవడం కోసం కాకుండా, భావితరాలకు ఉపయోగపడేలా రెవెన్యూ చట్టంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని గుర్తు చేశారు. ముఖ్యంగా లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చడం కోసం క్యాబినెట్‌లో పోరాడి సాధించిన మహానుభావుడు నూకల అని ప్రశంసించారు. ఆయన జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు పోరిక బలరాం నాయక్, రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మురళీ నాయక్, కోరం కనకయ్య, ఎమ్మెల్సీలు తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, బస్వరాజు సారయ్య, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, సీతారాం నాయక్, సురేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, నూకల కుటుంబ సభ్యులు రాధిక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆకుల శ్రీనివాస్

# ఆకస్మిక మృతి

**వైద్య ఆరోగ్య శాఖకు తీరని లోటు: జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**పార్థివ దేహానికి నివాళులర్పించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు**



**రాయికల్, డిసెంబర్ 27 :**

జగిత్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆకుల శ్రీనివాస్ శనివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ వార్త జిల్లా వైద్య యంత్రాంగంలో తీవ్ర విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.. డాక్టర్ శ్రీనివాస్ నివాసానికి చేరుకున్నారు. ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య రంగంలో డాక్టర్ శ్రీనివాస్ అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. బాధ్యతాయుతమైన అధికారిగా మంచి గుర్తింపు పొందిన ఆయన మరణం జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు తీరని లోటని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజ గౌడ్ కూడా భౌతికకాయానికి నివాళులర్పించి, నివాళి ఘటించారు. శనివారం ఉదయం ఈ విషాద వార్త తెలియగానే వివిధ స్థాయిల అధికారులు, వైద్య సిబ్బంది పెద్ద ఎత్తున ఆయన ఇంటికి చేరుకున్నారు. మానవీయ విలువలతో, సేవాభావంతో విధులు నిర్వహించిన వ్యక్తిగా డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఎప్పటికీ గుర్తుండిపోతారని సహచర అధికారులు, సిబ్బంది కన్నీటి పర్యంతమయ్యారు.

# వర్కింగ్ జర్నలిస్టులను విభజించొద్దు

- డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి
- డెస్క్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ డిమాండ్
- హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున నిరసన, వినపత్రం అందజేత




**హైదరాబాద్ డిసెంబర్ 27:** వర్కింగ్ జర్నలిస్టులను అక్రెడిటేషన్లు, మీడియా కార్డుల పేరుతో విభజించొద్దని డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ(డీజేఎఫ్టీ) రాష్ట్ర అధ్యక్షులు బాదిని ఉపేందర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే మస్తాన్, కోరారు. డెస్క్ జర్నలిస్టులకు పాత పద్ధతిలోనే అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం లక్డీకాపూల్లోని హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ పత్రికలకు చెందిన డెస్క్ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు తీసేసి, మీడియా కార్డులు ఇవ్వడం సరికాదన్నారు. ఇది జర్నలిస్టుల పట్ల వివక్ష చూపినట్లు అవుతుందని స్పష్టం చేశారు. రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు కలిస్తేనే జర్నలిజం అవుతుందని చెప్పారు. మీడియా కార్డుల పేరుతో డెస్క్ జర్నలిస్టులను రెండో గ్రేడ్ వారిగా మార్చొద్దని చెప్పారు. అలాగే జీవో నంబర్ 252ను సవరించాలని, (స్పో), సినిమా, ఫీచర్స్, వెబ్, కల్చరల్, బిజినెస్, కార్టునిస్టులకు గతంలో లాగా అక్రెడిటేషన్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ కదిరవన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కేవీ రాజారామ్, డీజేఎఫ్‌టీ కోశాధికారి నిసార్, జాయింట్ సెక్రటరీ విజయ తదితరులు పాల్గొన్నారు.

**టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే, ఎస్జాట్ మద్దతు**

డీజేఎఫ్‌టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమానికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, రాష్ట్ర నాయకులు రాజశేఖర్, హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ప్రధాన కార్యదర్శి జగదీశ్ తదితరులు మద్దతు తెలిపారు. ఎస్జాట్ తదితర జర్నలిస్టు సంఘాలు సైతం మద్దతు ప్రకటించాయి.



# ఎవరూ ఆందోళన చెందొద్దు

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ**

డెస్క్ జర్నలిస్టులకూ గతంలోలాగే అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేలా చూస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ) ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు శనివారం మహబూబాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. వారి వెంట టీడబ్ల్యూజేఫ్ నేతలు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా వారు డెస్క్ జర్నలిస్టులకు సైతం అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అలాగే డెస్క్ జర్నలిస్టుల పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి వినతులపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ డెస్క్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడతానని వెల్లడించారు. జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మంత్రిని కలిసిన వారిలో డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ)కమిటీ కన్వీనర్ కాంకూరి వెంకటేశ్వరరావు, కోకన్వీనర్లు కేతిరెడ్డి అచ్చిరెడ్డి, వంశీ, శాబాదు కరుణాకర్ రెడ్డి జెడ్, టీ డబ్ల్యూ జె ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# డెస్క్ జర్నలిస్టులు ఏం పాపం చేశారు?

**మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు**

**హైదరాబాద్, డిసెంబర్ 27:** సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఇవాళ ఆయన సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి డైరెక్టర్ గౌతమ్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఆర్థిక స్థితిని దెబ్బతీసేలా వ్యవహరిస్తూ, ప్రైవేటీకరణకు దారితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. సంస్థలో విద్యుత్ బకాయిలు భారీగా పేరుకుపోయాయని, ప్రభుత్వ సంస్థలైన డిస్కాంలు, జెన్కో నుంచి రూ.42 వేల కోట్లకు పైగా బకాయిలు రావాల్సి ఉండగా, వాటిని చెల్లించకపోవడం వల్ల సంస్థ ఆర్థికంగా ఇబ్బందులు పడుతోందని విమర్శించారు. ప్రభుత్వమే సింగరేణికి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అలా చేయకపోతే కార్మికుల జీతాలు, సంక్షేమంపై ప్రభావం పడుతుందని హరీశ్ రావు అన్నారు.సింగరేణి నిధులతో ఫుట్ బాల్ మ్యాచ్ లాకార్మికులు జీతాల కోసం ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి నిధులతో ఫుట్బాల్ మ్యాచ్లు ఆడుతున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల హైదరాబాద్లో జరిగిన లియోనల్ మెస్సీ ఫుట్బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్కు రూ.100 కోట్ల సింగరేణి నిధులు ఉపయోగించారని ఆరోపించారు. కార్మికుల బోనస్ విషయంలోనూ తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి రూ.6,394 కోట్ల నికర లాభం సాధించినా, బోనస్ కోసం కేవలం రూ.2,360 కోట్లనే పరిగణించి 34 శాతం ఇవ్వడం ద్వారా కార్మికులను మోసం చేశారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొత్తం లాభంపైనే బోనస్ ఇచ్చేవారని, ఇప్పుడు 50 శాతం కోత విధించారని ఆయన అన్నారు. ఇంకా, తెలంగాణలో పేదలకు సొంత ఇళ్లు కల్పించే ఇందిరమ్మ ఇళ్ల పథకం ఏమైందో తెలియడం లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఫుట్బాల్ మ్యాచ్లపై విచారణ చేస్తామని.. అక్రమాలకు పాల్పడిన వారిని జైలుకు పంపుతామని హరీశ్ రావు హెచ్చరించారు.

అక్రెడిటేషన్ కార్డుల విషయంలో డెస్క్ జర్నలిస్టులు ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ఆందోళనకు




దిగారని హరీశ్ రావు అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కల్పిస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి.. తమ హక్కుల కోసం పోరాడుతున్న జర్నలిస్టులను అరెస్ట్ చేయించడం దుర్మార్గమని అన్నారు. వెంటనే అందరినీ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారు 26 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చామని, రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ఇచ్చామని గుర్తు చేశారు. కానీ, నేడు కాంగ్రెస్ సర్కారు వచ్చాక అక్రెడిటేషన్ కార్డులను ఏకంగా 10 వేలకు తగ్గించారని కామెంట్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.252ను వెంటనే సవరించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# జన్నారంలో యథేచ్ఛగా ఇటుక బట్టీల దందా!

నిబంధనలకు పాతర..

అధికారుల అండదండలు?

- విద్యుత్ చౌర్యం.. ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఆర్డీవో, కలెక్టర్ వెంటనే స్పందించాలి: స్థానికుల డిమాండ్

ఆదిలాబాద్, డిసెంబర్ 27 (మనసులో మాట):

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో ఇటుక బట్టీల వ్యాపారం 'మూడు పువ్వులు ఆరు కాయలు'గా సాగుతోంది. ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేసి, అధికారుల కనుసన్నల్లోనే వందలాది అక్రమ బట్టీలు వెలుస్తున్నాయని, ప్రధాన రహదారుల పక్కనే ఈ దందా సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అనుమతులు నిల్.. విద్యుత్ చౌర్యం ఫుల్

మండల వ్యాప్తంగా సుమారు 100కు పైగా ఇటుక బట్టీలు ఎలాంటి అనుమతులు లేకుండానే కొనసాగుతున్నాయి. బట్టీల నిర్వహణకు, యంత్రాలను నడిపేందుకు నిర్వాహకులు కరెంటును యథేచ్ఛగా చౌర్యం చేస్తున్నారు. వ్యవసాయానికి, గృహ అవసరాలకు వినియోగించాల్సిన విద్యుత్తును కమర్షియల్ అవసరాలకు మళ్లిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

### నాణ్యత శూన్యం

రోజుకు వేల సంఖ్యలో ఇటుకలను ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే, ఈ ఇటుకల తయారీలో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థానిక నాయకులు మండిపడుతున్నారు. నాణ్యత లేని ఇటుకల వల్ల భవిష్యత్తులో భవన నిర్మాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ బట్టీలపై మండల అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వారి సహకారంతోనే ఈ దందా నడుస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు లేని బట్టీలను సీజ్ చేసి, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై, వారికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





# అడవిని కాపాడుకుందాం

వెదురు ఉత్పత్తులతో ఆర్థికంగా ఎదుగుదాం

నాయకపుగూడెంలో అలంకరణ వస్తువుల కేంద్రం ప్రారంభం

తాడోబా స్ఫూర్తితో వెదురు వస్తువుల తయారీ: అటవీ అధికారులు

ఆదిలాబాద్, డిసెంబర్ 27(మనసులో మాట):

అడవిపై భారం తగ్గించి, ప్రత్యామ్నాయ ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని అటవీ శాఖ అధికారులు పిలుపునిచ్చారు. శుక్రవారం తాళ్ళపేట్ ఎఫ్ఆర్వో సుష్మా రావు సిబ్బందితో కలిసి ఇందన్ పల్లి పరిధిలోని నాయకపుగూడెంలో వెదురు వస్తువుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మల్లాపూర్ మహిళలు తయారు చేసిన అలంకరణ వస్తువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని తాడోబా అభయారణ్యం సందర్శన అనుభవంతో స్థానికులు వెదురుతో ఆకర్షణీయమైన వస్తువులు తయారు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వెంకట్, దేవేందర్ సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. అటవీ సంపద రక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని, కలప స్మగ్లింగ్, వేటగాళ్ల సమాచారం అందించాలని కోరారు.


# హుస్నాబాద్ టు హైదరాబాద్ స్కేటింగ్

బర్త్ డే వేడుకల కోసం.. 7 గంటల్లో 150 కి.మీ ప్రయాణం

స్నేహితులను కలిసేందుకు ఇంటర్ విద్యార్థి రాజ్ కుమార్ సాహసం

సిద్దిపేట, డిసెంబర్ 27 (మనసులో మాట):

పుట్టినరోజు నాడు స్నేహితులను కలుసుకునేందుకు హుస్నాబాద్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి రాజ్‌కుమార్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నాడు. హుస్నాబాద్ నుంచి హైదరాబాద్ వరకు సుమారు 150 కిలోమీటర్ల దూరాన్ని స్కేటింగ్‌పై ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. కేవలం 7 గంటల వ్యవధిలో గమ్యస్థానాన్ని చేరుకున్నాడు. సిద్దిపేట - హైదరాబాద్ రహదారిపై స్కేటింగ్ చేస్తూ వెళ్తున్న యువకుడిని చూసి వాహనదారులు, స్థానికులు అభినందించారు. స్నేహితులపై ఉన్న ఇష్టంతోనే ఈ సాహసం చేశానని రాజ్‌కుమార్ తెలిపారు.



# జన్నారంలో నట్టల నివారణ మందుల పంపిణీ

చలికాలంలో అప్రమత్తత అవసరం: పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్



ఆదిలాబాద్, డిసెంబర్ 27(మనసులో మాట):

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. శనివారం రోటిగూడ, చింతలపల్లి గ్రామాల్లో సుమారు 3,200 గొర్రెలు, 800 మేకలకు అధికారులు ఉచితంగా మందులు వేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ మాట్లాడుతూ.. చలికాలంలో జీవాలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నట్టల నివారణ మందుల వల్ల జీవాల్లో రోగనిరోధక శక్తి పెరిగి, ఆరోగ్యంగా బరువు పెరుగుతాయని, తద్వారా రైతులకు మంచి లాభాలు వస్తాయని తెలిపారు. గ్రామాలకే వచ్చి మందులు వేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

అలంపూర్ శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



ఆదిలాబాద్, డిసెంబర్ 27 (మనసులో మాట):

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రసిద్ధ అలంపూర్ జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అష్టాదశ శక్తిపీఠాల్లో 5వదైన ఈ క్షేత్రంలో ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం పండితులు ఆమెకు తీర్థప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి వైకుంఠపురంలో ముక్కోటి ఏకాదశికి భారీ ఏర్పాట్లు

- 2 లక్షల మందికి దర్శన భాగ్యం: ప్రధాన అర్చకులు

సంగారెడ్డి, డిసెంబర్ 27 (మనసులో మాట):

సంగారెడ్డి శ్రీ వైకుంఠపురం ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఈ ఉత్సవాల్లో సుమారు రెండు లక్షల మంది భక్తులకు దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేశామని ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉదయం 4 గంటల నుంచే భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో ఏకాదశి ఉత్సవాలు, జనవరి 11న స్వామి వారి రథయాత్ర, 13న కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



# స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్‌గా బానేష్

కామన్‌పల్లి వాసికి అరుదైన గౌరవం..

ఘనంగా సన్మానించిన నేతకాని కుల సంఘం



ఆదిలాబాద్, డిసెంబర్ 27 (మనసులో మాట):

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కామన్‌పల్లి గ్రామానికి చెందిన బానేష్ జాడికి అరుదైన గౌరవం దక్కింది. ఆయన సామాజిక సేవలను గుర్తించి 'ది స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజేషన్' వరంగల్ జిల్లా కమిషనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా జన్నారం మండల నేతకాని కుల సంఘం నాయకులు బానేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. తమ ఊరి బిడ్డకు జిల్లా స్థాయి పదవి రావడం గర్వకారణమని గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు తన వంతు కృషి చేస్తానని బానేష్ ఈ సందర్భంగా తెలిపారు.

# రాహుల్ ప్రధాని అయితేనే 'విశాఖ ఉక్కు'కు రక్షణ

ఏపీ నుంచి 20 మంది ఎంపీలను గెలిపించండి: జగ్గారెడ్డి




సంగారెడ్డి, డిసెంబర్ 27 (మనసులో మాట):

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావడమే ఏకైక మార్గమని తెలంగాణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. 2029లో ఏపీ నుంచి కాంగ్రెస్‌కు 20 మంది ఎంపీలను గెలిపిస్తే ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవచ్చన్నారు. రూ. 2.50 లక్షల కోట్ల విలువైన ఈ ఆస్తిని ప్రధాని మోడీ కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్లాంట్‌ను రక్షించడంలో జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. విభజనను వ్యతిరేకించిన వ్యక్తిగా తనకు ఏపీలో మాట్లాడే హక్కు ఉందని, రెండు రాష్ట్రాల సీఎంలు చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

# లక్ష్మీదేవిపల్లి అభివృద్ధికి సహకరిస్తా

ఎమ్మెల్యే హరీష్ రావు హామీ



సిద్దిపేట, డిసెంబర్ 27(మనసులో మాట):

నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామాభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు హామీ ఇచ్చారు. శుక్రవారం గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పోతుల రమేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, యువకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. యువత సెల్‌ఫోన్లు, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, వారి దృష్టిని చదువు వైపు మళ్లించేందుకు గ్రామంలో లైబ్రరీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన హరీష్ రావు, గ్రామానికి కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నేతలు

కండువాలు కప్పి ఆహ్వానించిన ఎంపీ, ఎమ్మెల్యే



ఆదిలాబాద్, డిసెంబర్ 27 (మనసులో మాట):

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలో బీఆర్ఎస్‌కు గట్టి దెబ్బ తగిలింది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. వీరికి ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రధాని మోడీ నాయకత్వం, బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




కులానికి ప్రత్యేక పాఠశాల అవసరమా అనేది సంక్లిష్టమైన ప్రశ్న. దీనికి ఒకే సమాధానం లేదు. ప్రభుత్వ పాఠశాలలు అందరికీ సమాన విద్యను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, కుల వివక్ష, ఆర్థిక అసమానతలు, సామాజిక అడ్డంకులను అధిగమించడానికి కొన్ని వర్గాల కోసం ప్రత్యేక విద్యా కార్యక్రమాలు అవసరమని ఒక వాదన, మరోవైపు, కుల ఆధారిత విభజన సామాజిక సమైక్యతను దెబ్బతీస్తుందని, కుల వివక్షను అంతం చేయాలంటే అందరూ కలసి చదువుకోవాలని, కుల వివక్షకు వ్యతిరేకంగా పుస్తకాల్లో పాఠ్యాంశాలు ఉండాలని మరికొందరు వాదిస్తారు. ఆర్థికంగా వెనుకబడిన, చారిత్రకంగా అణగారిన కులాల వారికి ఉన్నత కులాలతో సమాన అవకాశాలు లభించవు. వారికి ప్రత్యేక పాఠశాలలు మెరుగైన విద్యను అందించి, సామాజికంగా పైకి రావడానికి సహాయపడతాయి. కుల ఆధారిత వివక్ష, అసమానతలను పాఠశాలల్లో ఎదుర్కొంటున్న విద్యార్థులకు, వారి సంస్కృతి, అవసరాలకు అనుగుణంగా విద్యను అందించడానికి ప్రత్యేక సంస్థలు అవసరం. కానీ కులాల వారీగా పాఠశాలలు విడదీయడం సామాజిక విభజనను మరింతగా పెంచుతుంది. అందరూ కలసి చదువుకుంటేనే సామాజిక సంబంధాలు మెరుగవుతాయి. విద్య ప్రభుత్వ బాధ్యత. ఇది కులం, మతం చూడకుండా అందరికీ సమానంగా అందించాలి. కుల వివక్షను పాఠశాలల్లో నిర్మూలించాలి. కానీ కులాల వారీగా పాఠశాలలు తెరవడం దానిని ప్రోత్సహించినట్లు అవుతుంది.

# చట్టబద్ధ వివక్ష..!

## కులాల వారీగా పాఠశాలలు విడదీయడం సామాజిక విభజనను పెంచుతుంది

### సమిష్టి విద్యార్జనతోనే 'కుల వివక్ష' నిర్మూలన సాధ్యం అప్పుడే సామాజిక సంబంధాలు మెరుగవుతాయి

**సమ్మిళిత విద్యా వ్యవస్థను నిర్మించడం సామాజిక సమానత్వానికి, దేశాభివృద్ధికి ముఖ్యం**

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాటలు అనుసరణీయం, హర్షణీయం:



**మేడవరపు రంగనాయకులు**

"భారత దేశంలో కుల వివక్ష యొక్క ఒక సాధారణ రూపం అంటరానితనం. దీనిని భారత కొత్త రాజ్యాంగం నిషేధించింది. 1954లో విద్యా మంత్రిత్వ శాఖ విద్యా సంస్థలలో 20 శాతం స్థానాలను ఎస్సీలు, ఎస్టీలకు రిజర్వ్ చేయాలని సూచించింది. అవసరమైన చోట ప్రవేశానికి కనీస అర్హత మార్కులను 5 శాతం సడలించే నిబంధనను విధించింది. 1982లో ప్రభుత్వ రంగంలో ప్రభుత్వ-సహాయక విద్యా సంస్థలలో వరుసగా 15 శాతం, 7.5 శాతం ఖాళీలను ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రిజర్వ్ చేయాలని పేర్కొనబడింది.1979లో సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడిన తరగతుల పరిస్థితిని అంచనా వేయడానికి మండల్ కమిషన్ స్థాపించినప్పుడు గణనీయమైన మార్పు ప్రారంభమైంది. 1931 జనాభా లెక్కల నుండి డేటాను ఉపయోగించింది. తద్వారా సమూహం యొక్క జనాభా 52 శాతంగా అంచనా వేయబడింది. 1980లో కమిషన్ నివేదిక కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సేవలు, ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి 27 శాతం రిజర్వ్ కోటా వర్తింపజేయాలని సిఫార్సు చేసింది. ఇంత ఉదారత ఉన్నవాళ్ళు ఎందుకు వారిని జనసమూహం నుండి వేరుచేస్తూ మాలపేట, మాదిగ పేట అంటూ పిలుస్తున్నారో అర్థం కాదు. ఇక పాఠశాల స్థాయిలోనే అందరూ సమానమే అనే సీటు ఇస్తే కుల ప్రస్తావన రాదు కదా! ముందు కుల నిర్మూలన రాజ్యాంగబద్ధంగా జరపకుండా దానిని నాశనం చేయలేం. కుల, మత, వర్గ సమూహంతో నూతన సమాజాన్ని స్థాపించలేం. సమానత్వ హక్కు (ఆర్టికలు 1418), స్వేచ్ఛా హక్కు (ఆర్టికల్ 1922) అంటూ ఊదరగొట్టే ఆర్టికల్ అన్ని హక్కులు అంటే వ్యక్తిగత మంచికి, సమాజ మంచికి అవసరమైన స్వేచ్ఛా భారత రాజ్యాంగం ప్రకారం హామీ ఇవ్వబడిన హక్కులు అని అర్థం చేసుకునే దాకా ఆ సవరణలు పార్లమెంటరీ వ్యవస్థ ఆలోచించే దాకా ఈ కుల వ్యవస్థ అస్వస్థతని భరించక తప్పదు. కుల, మత, వర్గ వైరుధ్యాల మధ్య ఏ నూతన సమాజాన్ని నిర్మించలేమని తెలుసుకుంటే ఒక మార్పుకు నాంది పలికిన వారు అవుతారు"



భారతదేశంలో కుల వివక్షను అంతం చేయడానికి, అందరికీ సమాన విద్యను అందించడానికి ప్రభుత్వం, సామాజిక సంస్కర్తలు కృషి చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కుల వివక్షకు వ్యతిరేకంగా పాఠ్యాంశాలను చేర్చాలని కోర్టులు ఆదేశిస్తున్నాయి. ఇది విద్యా వ్యవస్థలో సామాజిక మార్పు తీసుకురావడానికి ఒక ప్రయత్నం. మొత్తం మీద, ప్రత్యేక పాఠశాలలు కొన్ని వర్గాలకు తాత్కాలికంగా సహాయపడవచ్చు.. కానీ దీర్ఘ కాలంలో, అన్ని కులాల వారు కలిసి చదువుకునే సమగ్ర విద్యా వ్యవస్థను నిర్మించడం సామాజిక సమానత్వానికి, దేశాభివృద్ధికి ముఖ్యం అని చాలా మంది విద్యా వేత్తలు, నిపుణుల అభిప్రాయం. సమీకృత గురుకులాలు ఏర్పాటు చేసి అందులో ఆర్థిక స్థితిగతుల ఆధారంగా రిజర్వేషన్ల కల్పించి అడ్మిషన్లు ఇవ్వాలి. అప్పుడు అవి సమాజ సమీకృత శిబిరాలుగా మారుతాయి. కులాల వారీగా గురుకులాలు ఉంటే ఈ సమాజం ఎప్పటికీ సమీకృతం కాదు. దీన్ని గ్రహించే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమ్మిళిత పాఠశాలలను ప్రారంభించబోతుంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఇలాంటి పాఠశాలలు ప్రారంభిస్తే బాగుంటుంది అనేది సమసమాజ హితులు కోరుకుంటున్న విషయం. అయితే ఇటీవల ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ పార్టీకి సంబంధించిన కార్యక్రమంలో మాట్లాడుతూ "దేశంలో కుల, మత రాజకీయాలు పెరిగిపోయాయి. మనమంతా వాటిలో మునిగిపోయాం. కులం, వర్గాల వారీగా విద్యా వ్యవస్థలు ద్వారా వాటిని మనమే చిన్న పిల్లలలో పెంచిపోషిస్తున్నాం. కుల నిర్మూలన జరగాలని ఒక వైపు కోరుకుంటూ మరో వైపు వాటిని ప్రోత్సహించడం మంచిది కాదు..అందరూ కలిసి చదువుకునే రోజులు రావాలని బలంగా కోరుకుంటున్నాను"..అన్నారు. నిజంగా ఈ వ్యాఖ్యలు అభినందనీయం, అనుసరణీయం. ప్రభుత్వాలు తలుచుకుంటే సాధ్యమే అన్నారు తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడవరపు రంగనాయకులు. కులాల వారీగా, మతాల వారీగా విభజించి పాలించడానికి అలవాటు పడ్డ రాజకీయ నాయకుల్లో ఈ మార్పు అంత సులభం కాకపోవచ్చు అనే సందేహాన్ని వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ వచ్చాక భారతీయులలో జాతీయ భావం పెరుగుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కాబట్టి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నేతలలో ఈ భావన కలిగి నిజాయితీగా అమలు కోరుకుంటే పెద్ద కష్టమేమీ కాదని, కూటమి ప్రభుత్వం గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకుంటే మంచి సమాజాన్ని త్వరలోనే చూడొచ్చునని రంగనాయకులు అశాభావం వ్యక్తం చేశారు.



## కుల, మత, వర్గ వివక్షతలేని లౌకిక రాజ్యాంగం

కుల, మత, వర్గ వివక్షత లేని లౌకిక రాజ్యాంగం మనది అని చెప్పుకుంటూనే కులానికొక్క యూనియన్, మతానికొక్క చిహ్నం, వర్గానికి ఒక జెండాను ప్రభుత్వ రిజిస్ట్రేషన్స్ ద్వారా ఆమోదిస్తున్నారు. కానీ, జననం అయిన రోజు నుండే కులాన్ని ఆ బిడ్డకు టాగ్‌చేసి ధృవ పత్రం పొందుతాం. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జాయిన్ అయ్యే ముందే దాని వాడకాన్ని మొదలు పెడతాం. వర్ణ వ్యవస్థ రద్దు చేశాం.. కుల వ్యవస్థని పోషిస్తాం. ఇది ఓటు బ్యాంకు రాజకీయమని తెలిసినా దానిని పట్టుకుని కులానికి ఒక కార్పోరేషన్ పెట్టి వారిని చంకనెత్తించుకుంటాం. ఇది చట్టబద్ధ వివక్షత కాదా? అనేదే ఇప్పుడు సమసమాజ హితులు సంధిస్తున్న ప్రశ్న. ఒక నిమ్న జాతి వాడిని తిడితే..వెంటనే అట్రాసిటీ యాక్టు కవచం ఉంటుంది. అదే కులం పేరుతో వాడు ఇతర కులాలను తిడితే ఏ చట్టం వాడికి ముందు నడవదు. రిజర్వేషన్ల వ్యవస్థ పెట్టినప్పటినుంచి దాని అమలుపై అనేక అనుమానాలున్నాయి. కులాలు మారి ఎస్టీలుగా చేరినవారు..కొందరు క్రిస్టియానిటీ మతం తీసుకున్నవాళ్ళు వీరి మీద ఏ విధమైన చర్యలూ కనబడవు.

చిన్నప్పటినుంచే వాడిని ఇతరుల నుంచి వేరు చేస్తూ ఎస్టీ, బిసి, ఎస్సీ పాఠశాలలు పెట్టడం, అలాగే వారికి వసతి గృహాలు ఏర్పాటుచేయడం ఈ రాజ్యాంగ వ్యవస్థలో సర్వసాధారణమైంది. మరి ఇవ్వన్నీ రాజ్యాంగబద్ధమేనా? మరికాస్త లోతుల్లోకి వెళితే.....రిజర్వేషన్ల నాంది ప్రస్తావన తెలుసుకోవచ్చు. రిజర్వేషన్ అనేది భారత దేశంలో బ్రిటిష్ రాజ్ కాలంలో స్థాపించబడిన ఒక నిశ్చయాత్మక చర్య వ్యవస్థ. భారత రాజ్యాంగంలోని నిబంధనల ఆధారంగా, ఇది కేంద్ర ప్రభుత్వం, భారత దేశంలోని రాష్ట్రాలు, భూ భాగాలు "సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పౌరులకు" ఉన్నత విద్య ప్రవేశాలు, ఉద్యోగం, రాజకీయ సంస్థలు మొదలైన వాటిలో నిర్దిష్ట శాతాన్ని రిజర్వ్ కోటాలు లేదా సీట్లను కేటాయించడానికి అనుమతిస్తుంది. దాని నుండి రిజర్వేషన్ అమలు ప్రభావంపై భారీ చర్చలు, వివాదాలకు దారి తీసింది. ఇది రాజకీయ పార్టీల అజెండాలను, సామాజిక సమూహాల చర్యలను గణనీయంగా రూపొందిస్తుంది. ఆర్థికంగా వెనుకబడిన వారికి అనుకున్నంత ప్రయోజనం ఏనాడూ కల్గించలేకపోయారు. బ్రిటిష్ రాజ్‌లో స్వాతంత్ర్యానికి ముందు కొన్ని కులాలు, ఇతర వర్గాలకు అనుకూలంగా కోటా వ్యవస్థలు ఉన్నాయి. ఉదాహరణకు 1881, 1891లో వివిధ రకాల సానుకూల వివక్షత కోసం డిమాండ్లు చేయబడ్డాయి. కొల్హాపూర్ రాచరిక రాష్ట్ర మహారాజు ఛత్రపతి షాహు (అకా రాజర్షి షాహు మహారాజ్ ), బ్రాహ్మణేతర, వెనుకబడిన తరగతులకు అనుకూలంగా రిజర్వేషన్లను ప్రవేశపెట్టాడు. వీటిలో ఎక్కువ భాగం 1902లో అమల్లోకి వచ్చాయి. అతను అందరికీ ఉచిత విద్యను అందించాడు. వారు దానిని పొందడాన్ని సులభతరం చేయడానికి అనేక హాస్టళ్లను ప్రారంభించాడు. ఈ విధంగా చదువుకున్న వ్యక్తులు తగిన ఉపాధి పొందేలా చూసుకోవడానికి కూడా అతను ప్రయత్నించాడు. తరగతి రహిత భారత దేశం, అంటరానితనాన్ని రద్దు చేయాలని అతను విజ్ఞప్తి చేశాడు. అతని 1902 చర్యలు విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లను సృష్టించాయి. 1918లో, బ్రాహ్మణ ఆధిపత్యాన్ని పరిపాలనలో విమర్శిస్తున్న అనేక బ్రాహ్మణేతర సంస్థల ఆదేశం మేరకు, మైసూర్ రాజా నల్వాడి రాజ వడియార్ తన దివాన్ ఎం విశ్వేశ్వరయ్య వ్యతిరేకతను అధిగమించి ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యలో బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్లను అమలు చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేశాడు. దీనికి నిరసనగా ఆయన రాజీనామా చేశారు. 1921 సెప్టెంబరు 16న, మొదటి జస్టిస్ పార్టీ ప్రభుత్వం మొదటి కమ్యూనల్ గవర్నమెంట్ ఆర్డర్‌ను ఆమోదించింది. తద్వారా భారత శాసనసభ చరిత్రలో రిజర్వేషన్లను చట్టబద్ధం చేసిన మొదటి ఎన్నికైన సంస్థగా అవతరించింది. అప్పటి నుండి ఇవి దేశ వ్యాప్తంగా ప్రామాణికంగా మారాయి. 1927లో మద్రాస్ ప్రెసిడెన్సీ బ్రాహ్మణేతర హిందువులకు 44 శాతం, బ్రాహ్మణులు, ముస్లింలు, క్రైస్తవులు, ఆంగ్లో-ఇండియన్లకు 16 శాతం, షెడ్యూల్డ్ కులాలకు 8శాతం రిజర్వేషన్లు కల్పించింది. జూన్ 1932లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బ్రిటన్ ప్రధాన మంత్రి రామ్సే మెక్‌డొనాల్డ్ , ముస్లింలు, సిక్కులు, భారతీయ క్రైస్తవులు , ఆంగ్లో-ఇండియన్లు, యూరోపియన్లకు ప్రత్యేక ప్రాతినిథ్యం కల్పించాలని కమ్యూనల్ అవార్డును ప్రతిపాదించారు. దాదాపుగా షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాలు వంటి వెనుకబడిన తరగతులకు, వారు మాత్రమే ఓటు వేయగల నియోజకవర్గాల నుండి ఎన్నికల ద్వారా భర్తీ చేయడానికి అనేక సీట్లను కేటాయించారు. 1942లో షెడ్యూల్డ్ కులాలు మొదటి సారిగా కేంద్ర సేవలు, ఇతర సౌకర్యాలలో 8.5 శాతం రిజర్వేషన్లను పొందాయి. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు అనుకూలంగా, 1980ల తర్వాత ఇతర వెనుకబడిన కులాలు అనుకూలంగా, 2019లో జనరల్ కేటగిరీలోని పేదలకు అనుకూలంగా కొన్ని ప్రధాన కార్యక్రమాలు జరిగాయి. దేశం యొక్క నిశ్చయాత్మక కార్యాచరణ కార్యక్రమం 1950లో ప్రారంభించబడింది.

# బాక్సింగ్‌డే టెస్ట్‌లో ఇంగ్లండ్‌దే గెలుపు!

## యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ ఎట్టకేలకు విజయం
## 14 ఏళ్ల నిరీక్షణ తర్వాత విక్టరీ
## రెండు రోజుల్లోనే ముగిసిన టెస్టు మ్యాచ్



యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ ఎట్టకేలకు విజయం సాధించింది. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరిగిన బాక్సింగ్ డే టెస్టులో ఆస్ట్రేలియాపై ఇంగ్లాండ్ నాలుగు వికెట్ల తేడాతో నెగ్గింది. 175 పరుగుల లక్ష్యంతో దిగిన ఇంగ్లాండ్ ఆరు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (37 పరుగులు), (బెన్ డకెట్ 34 పరుగులు), జాకబ్ బెథెల్ (40 పరుగులు) రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్కాట్ బోలాండ్, రిచర్డ్‌సన్, మిచెల్ స్టార్క్ తలో 2 వికెట్లు పడగొట్టారు.పూర్తిగా బౌలర్ల ఆధిపత్యం నడించిన ఈ మ్యాచ్ రెండు రోజుల్లోనే ముగిసింది. 14 ఏళ్ల సుదీర ్ఘ నిరీక్షణ తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్ గెలిచింది. 2010-11లో చివరిసారిగా ఆసీస్ గడ్డపై ఇంగ్లండ్ గెలుపొందింది.175 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఇంగ్లండ్ 32.2 ఓవర్లలో 6 వికెట్లకు 178 పరుగులు గెలుపొందింది. జాకోబ్ బెతెల్(46 బంతుల్లో 5 ఫోర్లతో 40), బెన్ డకెట్(26 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 34), జాక్ క్రాలీ(48 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 37) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్, జై రిచర్డ్‌సన్, స్కాట్ బోలాండ్ రెండేసి వికెట్లు తీసారు. అంతకుముందు ఓవర్-నైట్ స్కోర్ 4-0తో ఆసీస్ రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో 34.3 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తొలి ఇన్నింగ్స్‌లో 42 పరుగుల ఆధిక్యం కలుపుకొని ఇంగ్లాండ్‌కు 175 పరుగుల టార్గెట్‌ను నిర్దేశించింది. తొలి ఇన్నింగ్స్‌లో మొదట ఆస్ట్రేలియా 152 పరుగులకు ఆలౌట్ కాగా, ఇంగ్లాండ్ 110 రన్స్‌కు కుప్పకూలింది. దీంతో ఈ టెస్టులో తొలి రోజే 20 వికెట్లు కూలాయి. ఇక రెండో రోజూ బౌలర్ల ఆధిపత్యం కొనసాగడంతో రెండు రోజుల్లోనే టెస్టు మ్యాచ్ ముగిసింది.ఈ టెస్టు మ్యాచ్‌లో బౌలర్ల జోరు కొనసాగింది. ఇరుజట్లలోని పేసర్లు నిప్పులు చెరిగారు. బౌలర్లదే ఆధిపత్యంగా సాగిన ఈ టెస్టులో ఇరు జట్లలోని ఏ బ్యాటర్ కూడా 50ం స్కోర్ చేయలేదు. తొలుత ఆసీస్‌ను ఇంగ్లాండ్ బౌలర్లు టంగ్, అట్కిసన్, బ్రెండన్ కార్స్, బెన్ స్టోక్స్ కట్టడి చేయగా, అనంతరం ఇంగ్లాండ్‌ను ఆసీస్ బౌలర్లు నెసర్, బొలాండ్, మిచెల్ స్టార్క్ , కామెరూన్ గ్రీన్ అడ్డుకున్నారు. రెండో ఇన్నింగ్స్?లోనూ పేసర్లే సత్తా చాటారు. మ్యాచ్‌లో కూలిన మొత్తం 36 వికెట్లను కూడా పేసర్లే పడగొట్టడడం విశేషం. ఇక రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 7 వికెట్లు పడగొట్టిన ఇంగ్లాండ్ పేసర్ జోష్ టంగ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. గత 15ఏళ్లలో ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లాండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఆసీస్ గడ్డపై ఇంగ్లాండ్ చివరిసారిగా 2010-11 యాషెస్‌ను 3-1తో దక్కించకుంది. ఆ తర్వాత 15ఏళ్ల నుంచి ఇంగ్లాండ్‌కు అక్కడ ఒక్క విజయం కూడా దక్కలేదు. ఈ మధ్య కాలంలో ఇంగ్లీష్ జట్టు 18 టెస్టులు ఆడింది. అందులో 16 మ్యాచ్‌ల్లో ఓడగా, రెండింటిని డ్రా చేసుకుంది. తాజా విజయంతో ఆసీస్ గడ్డ మీద 5,468 రోజుల తర్వాత ఓటముల పరంపరకు బ్రేక్ పడింది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన ఈ టెస్టు మ్యాచ్ మరో అరుదైన ఘనత సాధించింది. తొలి రోజైన శుక్రవారం ఈ మ్యాచ్ చేసేందుకు 94, 199 మంది అభిమానులు స్టేడియానికి వచ్చారు. ఓ టెస్టు మ్యాచ్?కు హాజరైన ప్రేక్షకుల్లో ఇది అత్యధికం. ఇక శనివారం కూడా భారీగానే ఫ్యాన్స్ హాజరైయ్యారు. తొలి రోజులో పోలిస్తే కాస్త తక్కువగా వచ్చారు. రెండో రోజు (శనివారం) 92,045 మంది మెల్‌బోర్న్ మైదానంలో లైవ్ మ్యాచ్ చూశారు. కాగా, ఈ యాషెస్?లో హ్యాట్రిక్ ఓటముల తర్వాత ఇంగ్లాండ్‌కు ఇదే తొలి విజయం. ఇప్పటికే సిరీస్?ను ఆసీస్ 3-1తో సొంతం చేసుకుంది. ఇక ఇరుజట్ల మధ్య ఐదో టెస్టు మ్యాచ్ సిడ్నీ వేదికగా 2026 జనవరి 04న జరగనుంది.




## ఆస్ట్రేలియా ఓటమితో టీమిండియాకు లాభం..

ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ బాక్సింగ్ డే టెస్ట్ కేవలం 2 రోజుల్లోనే ముగిసింది. నాలుగో టెస్టులో మొదటి రోజు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌట్ అయింది. అయితే ఇంగ్లాండ్ ప్రదర్శన ఆసీస్ కంటే దారుణంగా ఉంది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 110 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్‌లో కూడా ఆస్ట్రేలియా పరిస్థితిలో మార్పు రాలేదు. ఆసీస్ రెండో ఇన్నింగ్సులో 132 పరుగులు మాత్రమేచేసింది. 175 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ మూడో సెషన్‌లో ఛేదించింది. తొలి ఇన్నింగ్స్ లో తడబడిన ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ లో రాణించింది. దాంతో ఆసీస్ గడ్డమీద 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-2027 సైకిల్‌లో ఇది ఆస్ట్రేలియాకు తొలి ఓటమి. ఈ మ్యాచ్ ఫలితం భారత జట్టుకు కూడా కొంత ప్రయోజనం చేకూర్చింది.మెల్‌బోర్న్ టెస్టు లో టాస్ గెలిచి ఇంగ్లాండ్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. ఇంగ్లాండ్ తరపున తొలి ఇన్నింగ్స్‌లో జోష్ టంగ్ 5 వికెట్లు పడగొట్టడంతో ఆతిథ్య జట్టు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ లో 152 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా బౌలర్లు మైఖేల్ నెసెర్, స్కాట్ బౌలాండ్ విరుచుకుపడటంతో ఇంగ్లాండ్ 110 పరుగులకే ఆలౌట్ అయింది. మైఖేల్ 4 వికెట్లు, స్కాట్ 3 వికెట్లు తీశారు. మిచెల్ స్టార్క్ ఇద్దరు బ్యాట్స్‌మెన్‌లను ఔట్ చేశాడు. రెండో ఇన్నింగ్స్ మరింత ఉత్కంఠగా సాగింది. ఇంగ్లాండ్ బౌలర్లు చెలరేగడంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 8 మంది బ్యాట్స్‌మెన్‌లు రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. ట్రావిస్ హెడ్ 46, స్టీవ్ స్మిత్ 24 పరుగులు చేశారు. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లాండ్ తరపున జాక్ క్రాలీ (37), బెన్ డకెట్ (34) మంచి ఆరంభాన్ని అందించారు. ఆ తర్వాత జాకబ్ బెథెల్ 40 పరుగులతో విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో ఇది ఇంగ్లాండ్‌కు మూడో విజయం మాత్రమే. ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు ఇంగ్లాండ్‌తో జరుగుతున్న 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను ఇప్పటికే గెలిచింది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-2027 సైకిల్‌లో ఇది ఆస్ట్రేలియాకు తొలి పరాజయం. ఈ ఓటమి తర్వాత కూడా జట్టు పాయింట్ల పట్టికలో మొదటి స్థానంలోనే ఉంది. అయితే ఈ ఓటమితో ఆస్ట్రేలియా గెలుపు శాతం 100 నుండి 85.71కి తగ్గింది. జట్టుకు 72 పాయింట్లు ఉన్నాయి. ఈ ఓటమి భారత్ సహా ఇతర జట్లకు కలిసొస్తుంది. ఎందుకంటే ఆసీస్ మొదటి 6 టెస్టుల్లో ఒక్క టెస్టు కూడా ఓడిపోలేదు. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో న్యూజిలాండ్ జట్టు రెండో స్థానంలో ఉంది. న్యూజిలాండ్ 3 మ్యాచ్‌లలో 2 గెలిచింది. ఆస్ట్రేలియా ఈ ఓటమితో న్యూజిలాండ్‌తో పాటు దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్తాన్‌లకు, భారత్‌కు ప్రయోజనం కలిగింది. భారత జట్టు 9 టెస్టుల్లో 4 మ్యాచ్‌లు గెలిచి, 4 టెస్టులో ఓడిపోయింది. ఒక మ్యాచ్ డ్రా అయింది. ఇండియా 48.15 గెలుపు శాతంతో పట్టికలో ఆరో స్థానంలో ఉంది.

## బౌలర్‌కు సర్‌ప్రైజ్ ఇచ్చిన విరాట్ కోహ్లీ..




విజయ్ హజారే ట్రోఫీలో విరాట్ కోహ్లీని ఔట్ చేసిన గుజరాత్ స్పిన్నర్ విశాల్ జైస్వాల్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు. విశాల్ వేసిన ఒక బంతికి కింగ్ కోహ్లీ ముందుకు వచ్చి షాట్ ఆడబోయాడు. కానీ ముందుకు వచ్చిన తర్వాత కోహ్లీ ఆ షాట్ ఆడలేనని గ్రహించి, డిఫెన్స్ చేయబోయాడు. అయితే కోహ్లీ బంతిని ఆపలేకపోయాడు. బంతి టర్న్ అయి బయటకు వెల్లింది, వికెట్ కీపర్ స్టంప్ చేసి కోహ్లీ ఇన్నింగ్స్‌ను ముగించాడు. అయితే విజయ్ హజారే ట్రోఫీలో ఈ మ్యాచ్ ఢిల్లీ గెలిచింది. మ్యాచ్ తర్వాత కోహ్లీ తన వికెట్ తీసిన బౌలర్ విశాల్‌కు ఒక స్పెషల్ గిఫ్ట్ ఇచ్చాడు. రన్ మేషిన్ విరాట్ కోహ్లీతో పాటు ఢిల్లీకి చెందిన నలుగురు బ్యాట్స్‌మెన్‌లను విశాల్ జైస్వాల్ ఔట్ చేశాడు. అతను నితీష్ రాణా, రిషబ్ పంత్, అర్పిత రాణాలను ఔట్ చేశాడు. అందులో కోహ్లీ వికెట్ చాలా ప్రత్యేకం. విశాల్ మాట్లాడుతూ, కోహ్లీ వికెట్ జీవితాంతం మర్చిపోలేనని చెప్పాడు.విశాల్ జైస్వాల్ విరాట్ కోహ్లీని ఔట్ చేసిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ, "ప్రపంచ క్రికెట్‌లో అతన్ని డామినేట్ చేయడం చూడటం నుంచి, అతడితో ఒకే స్టేడియంలో ఆడటం, ఆపై కోహ్లీ వికెట్ తీయడం వరకు, ఇది నేను ఎప్పుడూ ఊహించని ఒక క్షణం. విరాట్ భాయ్ వికెట్ తీయడం నేను ఎప్పటికీ గుర్తుంచుకునే క్షణం. ఈ అవకాశం, ఈ జర్నీ, ఈ ఆట నాకు ఇచ్చిన ప్రతిదానికీ నేను కృతజ్ఞుడను" అని క్యాప్షన్‌లో రాశాడు. తన వికెట్ తీసిన బంతిపై కోహ్లీ సంతకం చేసి ఆ బౌలర్ విశాల్ జైస్వాల్‌కు స్పెషల్ గిఫ్ట్ ఇచ్చాడు. యంగ్ బౌలర్ ను ప్రత్యేకంగా అభినందించడంతో పాటు అతడిలో నూతనోత్సాహాన్ని నింపేందుకు కోహ్లీ తన వికెట్ తీసిన బౌలర్ కు ఆ బంతిపై సిగ్నేచర్ చేసి ఇచ్చాడు. దాంతో ఆ బౌలర్ కు ఈ జీవితంలో మరుపురాని క్షణంలా మారిపోయింది. విరాట్ కోహ్లీ 2010 తర్వాత మొదటిసారి విజయ్ హజారే ట్రోఫీలో భాగస్వామి అయ్యాడు. కోహ్లీ డిసెంబర్ 24న ఆంధ్రతో జరిగిన మొదటి మ్యాచ్‌లో 131 పరుగులు చేశాడు. 101 బంతుల్లో ఆడిన ఈ ఇన్నింగ్స్‌లో అతను 3 సిక్సర్లు, 14 ఫోర్లు కొట్టాడు. కోహ్లీ రెండో మ్యాచ్‌లో గుజరాత్‌పై 61 బంతుల్లో 1 సిక్సర్, 13 ఫోర్ల సహాయంతో 77 పరుగులు చేశాడు. కోహ్లీ విజయ్ హజారే ట్రోఫీలో తొలి 2 మ్యాచ్‌లు మాత్రమే ఆడేందుకు ఢిల్లీ జట్టుతో చేరాడు. అయితే అతను ఢిల్లీ కోసం మరో మ్యాచ్ ఆడే అవకాశం ఉందని వార్తలు ప్రచారంలో ఉన్నాయి. కానీ ఇది న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్ కోసం జట్టుతో చేరడంపై ఆధారపడి ఉంటుంది.

## హర్మన్ ప్రీత్ కౌర్ అరుదైన ఘనత..





అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టీమిండియా మహిళా జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. మహిళల టీ20 క్రికెట్‌లో అత్యధిక మ్యాచుల్లో విజయాన్ని అందించిన కెప్టెన్‌గా రికార్డులకు ఎక్కింది. తిరువనంతపురం వేదికగా శ్రీలంకతో జరిగిన మూడవ టీ20 మ్యాచ్‌లో.. భారత్ విజయం సాధించడం ద్వారా హర్మన్ ఈ అరుదైన ఘనత అందుకుంది. టీ20ల్లో కెప్టెన్‌గా హర్మన్‌కు ఇది 77వ విజయం. ఈ క్రమంలో ఆస్ట్రేలియా దిగ్గజ ప్లేయర్ మెగ్ లాన్నింగ్‌ను అధిగమించింది. మెగ్ లాన్నింగ్ 100 మ్యాచ్‌ల్లో ఆసీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించగా 76 మ్యాచ్‌ల్లో విజయాన్ని అందించింది. ఇక హర్మన్ విషయానికి వస్తే.. 130 మ్యాచ్‌ల్లో సారథ్యం వహించగా 77 మ్యాచ్‌ల్లో గెలిపించింది.అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒకే ప్రత్యర్థిపై అత్యధిక విజయాలను అందించిన కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. శ్రీలంకపై కెప్టెన్‌గా హర్మన్‌కు ఇది 16వ విజయం. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ఈ మ్యాచ్‌లో శ్రీలంక మహిళల జట్టు మొదట బ్యాటింగ్ చేసింది. నిరీ?త 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. భారత బౌలర్లలో పేసర్ రేణుకా సింగ్ నాలుగు వికెట్లు పడగొట్టింది. స్పిన్నర్ దీప్తి శర్మ మూడు వికెట్లు తీసింది. ఆ తరువాత షెఫాలి వర్మ (79 నాటౌట్ బీ 42 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లు) దంచికొట్టడంతో 113 పరుగుల లక్ష్యాన్ని భారత్ 13.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి అందుకుంది. ఈ విజయంతో భారత జట్టు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సొంతం చేసుకుంది.

## ఐపీఎల్‌లో బంగ్లా క్రికెటర్లు ఆడితే పిచ్‌లు డ్యామేజ్ చేస్తాం

### ఐపీఎల్‌లో బంగ్లా ప్లేయర్లు ఉండకూడని సాధువుల వార్నింగ్

బంగ్లాదేశ్‌లో చెలరేగిన హింస తాజాగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వరకు చేరుకుంది. అక్కడి నిరసనల సెగలు ఐపీఎల్‌ను తాకాయి. వచ్చే ఏడాది వేసవిలో జరగనున్న ఐపీఎల్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఆడేందుకు అనుమతిస్తే, ఐపీఎల్ మ్యాచ్‌లను అడ్డుకుంటామని మధ్యప్రదేశ్ ఉజ్జయిన్‌కు చెందిన సాధువులు, హిందూ మత పెద్దలు హెచ్చరిక జారీ చేశారు. ఈ లీగ్‌లో బంగ్లా ప్లేయర్లు ఆడేందుకు వీల్లేదని వారు పేర్కొన్నారు.ఇటీవల బంగ్లాదేశ్‌లో జరిగిన ఈ హింసాత్మక దాడిలో హిందూ సమాజానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. దీంతో యావత్ హిందూ సమాజం దిగ్భ్రాంతికి గురైంది. ఈ క్రమంలోనే ఉజ్జయిన్ రిన్‌ముక్తేశ్వర్ మహాదేవ్ ఆలయ ప్రధాన పూజారి మహావీర్ నాథ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐపీఎల్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన క్రికెటర్లు పాల్గొన్నట్లైతే, ఆ మ్యాచ్‌లను ఆపడానికి సాధువులు, యోధులు స్టేడియంలోకి ప్రవేశిస్తారని హెచ్చరించారు. మైదానంలోని పిచ్‌లను ధ్వంసం చేసి మ్యాచ్‌లకు అంతరాయం కలిగిస్తామని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు.యితే బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దారుణాలను ఇక్కడి అధికారులు పట్టించుకోకపోవడమే కాకుండా, ఆ దేశ క్రికెటర్లను భారత్‌లో ఆడటానికి అనుమతిస్తున్నారంటూ సాధువులు మండిపడ్డారు. బంగ్లాదేశ్‌కు చెందిన ఏ క్రికెటర్ కూడా ఐపీఎల్‌లో ఆడేందుకు అనుమతించకూడని తెలిపారు. ఈ మేరకు ప్రముఖ వార్తా ఏజెన్సీ తో పేర్కొన్నారు. 2026 మినీ వేలంలో బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రహ్మాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ భారీ ధరకు దక్కించుకుంది. అతడిని రూ. 9.20 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. 2016 నుంచి ఈ బంగ్లా ఫాస్ట్ బౌలర్ ఐపీఎల్ ఆడుతున్నాడు. గత సీజన్లో ముస్తాఫిజుర్ దిల్లీ క్యాపిటల్స్ తరపున కేవలం మూడు మ్యాచ్‌లే ఆడాడు. మొత్తం మీద ఐపీఎల్‌లో 60 మ్యాచ్‌ల్లో 65 వికెట్లు పడగొట్టాడు. ఓవరాల్‌గా ఈ ఐపీఎల్‌లో బంగ్లాదేశ్ నుంచి ముస్తాఫిజుర్ ఒక్కడే ఆడనున్నాడు. అయితే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఎలా వ్యవహరిస్తుందోనని ఆసక్తి నెలకొంది. ఇలాంటి హెచ్చరికల వేళ కేకేఆర్ ఎలా స్పందిస్తుందో చూడాలి. ఈ ఐపీఎల్‌లో బంగ్లా నుంచి ఓవరాల్‌గా ముస్తాఫిజుర్ ఒక్కడే వేలంలో అమ్ముడైయ్యాడు.



### ప్రతి ఒక్కరూ మెచ్చే సినిమా
# ఛాంపియన్

కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా 'ఛాంపియన్ అన్నారు హీరో రోషన్. ఈ చిత్రం యదార్ధగాధలకు ప్రతిరూపం అన్నారు. రోషన్,. అనస్వర రాజన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. స్వప్న దత్, జీకే మోహన్, జెమినీ కిరణ్ నిర్మించారు. నందమూరి కల్యాణ్ చక్రవర్తి ముఖ్య పాత్ర పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. 'ఛాంపియన్' నాకెంతో ప్రత్యేకమైన సినిమా అన్నారు హీరో రోషన్. 'ఇది పిల్లలతో కలిసి చూడాల్సిన చిత్రం. ఇది ప్రతి ఒక్కరికీ నచ్చింది' అన్నారు దర్శకుడు ప్రదీప్ అద్వైతం. ఈ కార్యక్రమంలో నందమూరి కల్యాణ్ చక్రవర్తి, స్వప్న దత్, జెమినీ కిరణ్, జీకే మోహన్, అనస్వర రాజన్, మిక్కీ జే మేయర్, రచ్చ రవి, సంజయ్ బలగం, యశ్ తదితరులు పాల్గొన్నారు.

# 'భాయ్ జాన్' బర్త్‌డే

### 60వ పుట్టినరోజులో సల్మాన్.. వేడుకలకు భార్యతో సహా వచ్చిన ధోనీ








బాలీవుడ్ 'భాయ్ జాన్' సల్మాన్ ఖాన్ శనివారం తన 60వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నాడు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ముంబై సమీపంలోని పన్వేల్ ఫామ్‌హౌస్‌లో డిసెంబర్ 26 రాత్రి నుంచే భారీ స్థాయిలో బర్త్‌డే సెలబ్రేషన్స్ ప్రారంభమయ్యాయి. ఈ వేడుకకు బాలీవుడ్, టాలీవుడ్‌తో పాటు క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు హాజరై సందడి చేశారు. సల్మాన్ బర్త్‌డే పార్టీలో టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తన భార్య సాక్షి ధోనితో కలిసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇద్దరూ ఫామ్‌హౌస్‌కు చేరుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వేడుకకి రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైస్వాల్ జంటగా హాజరై ఆకట్టుకున్నారు. జెనీలియా దేశ్‌ముఖ్ తన పిల్లలతో కలిసి వచ్చి ఫ్యామిలీ టచ్ ఇచ్చింది. హుమా ఖురేషి గ్లామరస్ లుక్‌లో మెరిసింది. సింగర్ మికా సింగ్ స్కూటీపై ఎంట్రీ ఇచ్చి అభిమానులను ఆశ్చర్యపరిచాడు. సల్మాన్ ఖాన్‌కు అత్యంత సన్నిహితుడైన మనీష్ పాల్‌తో పాటు, ఆయన మాజీ ప్రేయసి సంగీతా బిజ్లానీ కూడా పార్టీలో కనిపించడం విశేషంగా మారింది. నటుడు రణదీప్ హుడా తన నిండు గర్భిణి భార్య లిన్‌తో కలిసి హాజరయ్యాడు. సీనియర్ నటి టబు, నిర్మాత రమేష్ తౌరానీ, నిఖిల్ ద్వివేది, మహేష్ మంజ్రేకర్ తదితరులు కూడా పార్టీలో పాల్గొన్నారు. ఖాన్ కుటుంబ సభ్యులు ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సల్మాన్ సోదరులు అర్బాజ్ ఖాన్ (భార్య షురా, కూతురితో), సోహైల్ ఖాన్ పార్టీలో సందడి చేశారు. మేనల్లుళ్లు అహాన్, నిర్వాణ్ స్టైలిష్ లుక్స్‌లో ఎంట్రీ ఇచ్చారు. సల్మాన్ సోదరీమణులు కూడా తమ కుటుంబాలతో హాజరయ్యారు. ఈ వేడుకలో సల్మాన్ ఖాన్ కోసం ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. ఆయనతో కలిసి పనిచేసిన దర్శకులు ఈ వీడియో ద్వారా భాయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పుట్టినరోజు కానుకగా అభిమానులకు ఓ శుభవార్తను ప్రకటించనున్నట్లు సమాచారం. సల్మాన్ నటిస్తున్న భారీ చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' నుంచి ఒక కీలక అప్‌డేట్ విడుదల కానుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. 60వ పడిలోకి అడుగుపెట్టిన సల్మాన్ ఖాన్‌కు దేశవ్యాప్తంగా అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతుండగా, పన్వేల్ ఫామ్‌హౌస్‌లో జరిగిన ఈ గ్రాండ్ పార్టీ బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



### మహిళల వస్త్రధారణపై
# మాట్లాడరాదు

### వారి స్వేచ్ఛను భంగం కలిగించరాదు.. శివాజీ వ్యాఖ్యలపై నటుడు నాగబాబు



**హైదరాబాద్, డిసెంబర్ 27:** మహిళల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలపై మెగా బ్రదర్ నాగబాబు తీవ్రంగా స్పందించారు. ఈ అంశంపై నాగబాబు మాట్లాడుతూ సమాజంలో ఇంకా బలంగా కొనసాగుతున్న పురుషాధిక్య ఆలోచనలను తీవ్రంగా ఖండించారు. మహిళలు ఏ దుస్తులు ధరించాలనే విషయంపై ఎవరికీ సూచనలు చేసే హక్కు లేదని స్పష్టం చేస్తూ, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సుదీర్ఘ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తాను రాజకీయ నాయకుడిగా గానీ, సినిమా ఇండస్ట్రీకి చెందిన నటుడిగా గానీ కాకుండా, ఒక సామాన్య పౌరుడిగా ఈ అంశంపై మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. ఇటీవల మహిళల దుస్తులపై కొందరు చేస్తున్న వ్యాఖ్యలు సమాజంలో ప్రమాదకరమైన ఆలోచనలకు దారి తీస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా శివాజీ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఇవి మోరల్ పోలీసింగ్‌కు దారితీసే మాటలని, ఇలాంటి ఆలోచనలు సమాజానికి హానికరమని అన్నారు. 'ఆడపిల్ల ఎలా ఉండాలి, ఏ దుస్తులు వేసుకోవాలి, ఎలా మాట్లాడాలి అన్నదానిపై ప్రతి ఒక్కరూ తీర్పులు చెప్పడం మానాలి. ఇది రాజ్యాంగానికి విరుద్ధం. మహిళల స్వేచ్ఛను కట్టడి చేసే హక్కు ఎవరికీ లేదు' అని నాగబాబు వ్యాఖ్యానించారు. మహిళలు ఏ దుస్తులు ధరించాలో చెప్పే అధికారం పురుషులకు ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారిని సమర్ధించే మహిళలను చూసి తనకు బాధ కలుగుతుందని కూడా చెప్పారు. సమాజం ఏమనుకుంటుందో, భర్త ఏమనుకుంటాడో అన్న భయంతో కొందరు మహిళలు కూడా ఈ మోరల్ పోలీసింగ్‌కు మద్దతు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాషన్ కాలానుగుణంగా మారుతుందన్న నాగబాబు.. మహిళల దుస్తులను బట్టి వారి క్యారెక్టర్‌ను అంచనా వేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఒకప్పుడు తానూ ఇలాంటి ఆలోచనలతోనే మాట్లాడిన సందర్భాలు ఉన్నాయని, కానీ ప్రపంచాన్ని అర్థం చేసుకున్న తర్వాత తన ఆలోచనలను మార్చుకున్నానని చెప్పారు. 'నాకేం హక్కు ఉంది మహిళల గురించి తీర్పులు చెప్పడానికి ?' అని తాను తనను తానే ప్రశ్నించుకున్నానని తెలిపారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు వారి దుస్తుల వల్ల కాదని, అది పూర్తిగా పురుషుల క్రూరత్వం, పశుబుద్ధి వల్లేనని నాగబాబు ఘాటుగా వ్యాఖ్యానించారు. కొంతమంది పురుషులు మహిళలను విలాస వస్తువుల్లా చూస్తున్నారని, అలాంటి ఆలోచనలు ఉన్నవారికి మహిళ ఏ దుస్తులు వేసుకున్నా తేడా ఉండదని అన్నారు. సమస్య మహిళల దుస్తుల్లో కాదని, మగవారి ఆలోచనల్లో ఉందని స్పష్టం చేశారు. సమాజం ఇంకా మహిళలను పూర్తిగా రక్షించే స్థాయికి చేరలేదని నాగబాబు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మహిళలు తమ భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే ఆత్మ రక్షణ విద్యలను నేర్చుకోవాలని సూచించారు. అయితే దీన్ని మహిళలపై భారం వేయడంగా చూడకూడదని, ప్రభుత్వాలు సరైన రక్షణ కల్పించడంలో విఫలమవుతున్నాయనే నిజాన్ని గుర్తించాలన్నారు.మనం ప్రస్తుతం ఏఐ జనరేషన్‌లో ఉన్నామని, అయినా మహిళలపై పాతకాలపు ఆలోచనలతో మాట్లాడే పురుషుల మనస్తత్వాన్ని ఇకనైనా ఖండించాలని నాగబాబు పిలుపునిచ్చారు. 'ఆడవారిని అవమానించిన ఏ మగవాడు చరిత్రలో బాగుపడిన దాఖలాలు లేవు. ద్రౌపదిని అవమానించిన కౌరవుల గతి మనందరికీ తెలుసు'అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వీడియోలో హైలైట్‌గా నిలిచాయి. ఈ విషయాలపై మాట్లాడితే విమర్శలు వస్తాయని తెలిసినా, మౌనంగా ఉండటం తప్పేనని నాగబాబు చెప్పారు. మహిళల స్వేచ్ఛను హరించే మాటలు మాట్లాడటం నేరమని, అలాంటి ఆలోచనలను సమర్థించడం కూడా అంతే ప్రమాదకరమని హెచ్చరించారు. మహిళలు ఇకనైనా ప్రశ్నించాలని, మోరల్ పోలీసింగ్‌కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మొత్తానికి.. మహిళల వస్త్రధారణపై శివాజీ వ్యాఖ్యలకు ప్రతిగా నాగబాబు చేసిన ఈ ఘాటైన వ్యాఖ్యలు సమాజంలో జరుగుతున్న మోరల్ పోలీసింగ్, లింగ వివక్షపై మరోసారి పెద్ద చర్చను తెరపైకి తెచ్చాయి. మహిళల స్వేచ్ఛ, గౌరవం, భద్రతపై ఆలోచించాల్సిన సమయం వచ్చిందని ఆయన చేసిన పిలుపు ప్రస్తుతం సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన వస్తోంది.




# సహనా.. సహనా సాంగ్ కొత్తగా చూపారు

### రాజాసాబ్ సాంగ్‌పై నిధి అగర్వాల్

ప్రభాస్‌తో కలిసి 'ది రాజాసాబ్' అంటూ సందడి చేసేందుకు నిధి అగర్వాల్ సిద్ధమయ్యారు. వీరిద్దరి కాంబోలో తెరకెక్కిన ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా నిధి వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు.రాజాసాబ్ విడుదలయ్యాక నా అప్‌కమింగ్ ప్రాజెక్ట్‌ల గురించి చెబుతాను. తెలుగులో మూడు సినిమాలు చేస్తున్నా. ఇతర భాషల్లోనూ కొన్నిటికి సైన్ చేశా. 2026 మొత్తం బిజీనే. నాకు ఓటీటీ సినిమాలంటే ఇష్టం. డైరెక్ట్ ఓటీటీ ప్రాజెక్ట్‌లు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నా. మంచి కథ ఉంటే కచ్చితంగా చేస్తా. 2025లో రెండు ప్రత్యేక అనుభవాలు ఉన్నాయి. రాజాసాబ్ షూటింగ్, 'హరి హర వీరమల్లు' ప్రచార సమయంలో పవన్ నన్ను ప్రశంసించడం ఎప్పటికీ మర్చిపోలేనని నిధి చెప్పారు. ఇకపోతే రాజాసాబ్‌లో ఈ సినిమాలో ప్రతిఒక్కరి పాత్రకు ప్రాధాన్యం ఉంది. ప్రభాస్ 6.2 అడుగులు, నేను 5.7 అడుగులు.. ఆయన హైట్‌ను బ్యాలెన్స్ చేయడం కోసం పెద్ద హీల్స్ వేసుకుని యాపిల్ బాక్స్‌లపై నిల్చున్నా. సహనా సహనా సాంగ్‌ను స్క్రీన్‌పై కొత్తగా చూస్తారు. కాస్ట్యూమ్స్ చాలా కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. తెర పైనే కాదు.. నిజజీవితంలోనూ ప్రభాస్ స్వీట్ పర్సన్. నా కెరీర్‌లో అంత మంచి వ్యక్తిని చూడలేదు. ఆయన అతిథి మర్యాదల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇంటి నుంచి భోజనం తెప్పిస్తారు. నేను విరామ సమయంలో కుటుంబంతో గడుపుతాను. ధ్యానం చేసుకుంటా. సామాజిక సేవ కూడా చేస్తాను. కానీ, దాని గురించి బయటకు చెప్పడం నాకు ఇష్టం లేదు. విదేశాల్లో షూటింగ్‌కు వెళ్లినప్పుడు చిన్న గ్యాస్ సిలిండర్ వెంట తీసుకెళ్తాను. ప్రతిరోజు టిఫిన్, డిన్నర్ నేనే వండుకుంటాను అని వెల్లడించారు.

# చదువుకున్నారు కదా.. ఆ మాత్రం తెలీదా?

### శివాజీకి మహిళా కమిషన్ సూటి ప్రశ్నలు



**హైదరాబాద్:** తెలంగాణ మహిళా కమిషన్‌లో నటుడు శివాజీ విచారణ కొనసాగుతోంది. దండోరా సినిమా ప్రమోషన్‌లో భాగంగా వేదికపై శివాజీ అనుచిత వాఖ్యలు చేసి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. మహిళల వస్త్రధారణపై ఆయన అలా ఎందుకు మాట్లాడారో తెలుసుకునేందుకు కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ళ శారద విచారణ జరిపారు. మహిళల పై మీరు చేసిన వాఖ్యలు మహిళల గౌరవం, వ్యక్తిగత జీవితం ప్రభావితం చూపుతుందని కమిషన్ భావిస్తోంది.. మీరేమంటారు? ఒక నటుడిగా మీ వాఖ్యలు సమాజం పై ప్రభావం చూపుతాయి.. ఇది మీకు తెలిసే ఇలాంటి వాఖ్యలు చేశారని కమిషన్ భావిస్తోంది.. మహిళల వస్త్రాధారణ ఆధారంగా వాళ్ల వ్యక్తిత్వాన్ని అంచనా వేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.. చదువుకున్న వ్యక్తిగా ఇది మీకు తెలియదా? మీ వాఖ్యలు మహిళలను కించపరిచినట్లు కానట్లయితే వాటికి సంబంధించిన ఆధారాలు ఇవ్వండి! మీ వాఖ్యలు మహిళలపై దాడులు పెంచే విధంగా ఉన్నాయని ఫిర్యాదులొచ్చాయి.. వీటికి మీ సమాధానం? అనే పశ్నలకు శివాజీ ఇచ్చిన వివరణలను తెలంగాణ మహిళా కమిషన్ రికార్డు చేసింది. దండోరా సినిమా ఈవెంట్‌లో శివాజీ చేసిన ఆ అసంబద్ధ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. చిన్మయి, అనసూయ, నిధి అగర్వాల్, పాయల్ రాజ్‌పుత్ లాంటి సెలబ్రిటీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మరోవైపు.. ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సుమోటోగా స్వీకరించి.. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ శివాజీకి నోటీసులు జారీ చేసింది. అంతకు ముంద.. తాను చేసిన వ్యాఖ్యలకు శివాజీ షరతులతో కూడిన క్షమాపణలు చెప్పారు. తన కెరీర్‌లో ఎప్పుడూ ఇలా జరగలేదన్న ఈ సీనియర్ నటుడు.. తన వ్యాఖ్యలను గానూ మహిళా లోకానికి మనస్ఫూర్తిగా క్షమాపణలంటూ మాట్లాడారు. అయితే తన వ్యాఖ్యల్లో దొర్లిన రెండు అసభ్య పదాలకు మాత్రమే సారీ చెబుతూనే.. తన స్టేట్‌మెంట్‌కు మాత్రం కట్టుబడి ఉన్నానంటూ చెప్పడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఈ ఘటనలో శివాజీ మీద తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా ఫిర్యాదులు, కేసులు నమోదు కాకపోవడం మరో కొసమెరుపు.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861